సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 263

బుధవారం 14-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



'టెస్టు' సమరానికి సమయం

నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్.. విజయమే లక్ష్యంగా టీమిండియా - 14లో



2 రోజుల తర్వాత లాభాలు

సెన్సెక్స్ 403 పాయింట్లు ప్లస్.. నిఫ్టీ లాభం 111 పాయింట్లు - 15లో



సమానంగా చూడండి చాలు

వందకు పైగా దేశాల్లో లక్షలాది మంది ఉద్యోగులను సమర్థంగా నడిపిస్తూ మహిళా శక్తిని చాటుతున్న లీనానాయర్‌పై కథనం..

వివరాలు 13లో ▸



'బిల్కిస్'పై విచారణకు విముఖత

బిల్కిస్‌బానోపై అత్యాచారం కేసులో దోషుల విడుదలపై పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బేలా త్రివేది నిరాకరించారు.

వివరాలు 6లో ▸



నేటి నుంచి బీఆర్ఎస్ ప్రస్థానం

ఢిల్లీలో ఏర్పాటు చేసిన భారత్ రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయాన్ని తెలంగాణ సీఎం కేసీఆర్ బుధవారం ప్రారంభించనున్నారు.

వివరాలు 3లో ▸



వారి త్యాగాన్ని దేశం మరువదు

2001లో పార్లమెంట్‌పై ఉగ్రదాడి ఘటనలో నేలకొరిగిన వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ తదితరులు నివాళులర్పించారు.

వివరాలు 6లో ▸

ఇకపై పింఛన్ రూ.2,750

అవ్వాతాతలకు జనవరి 1 నుంచి పంపిణీకి మంత్రివర్గం ఆమోదం

- పింఛన్‌ను రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామని ఎన్నికలప్పుడు హామీ
- ఇప్పటికే రెండు దఫాలుగా రూ.2,250, రూ.2,500కు పెంపు.. ప్రస్తుతం 62 లక్షల మంది లబ్ధిదారులు.. డిసెంబర్ నుంచి రూ.2.43 లక్షల మంది అదనం
- ఈ లెక్కన నెలకు రూ.1,786 కోట్లు పంపిణీ చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- టీడీపీ సర్కార్ హయాంలో కేవలం రూ.400 కోట్లే.. గత ప్రభుత్వంతో పోలిస్తే నాలుగున్నర రెట్లు అధికం
- కొత్తగా అర్హత సాధించిన వారికి 27న నవరత్నాలు, సంక్షేమ పథకాలతో లబ్ధి
- వైఎస్సార్ జిల్లాలో రూ.8,880 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఉక్కు కర్మాగారం ఏర్పాటు
- ప్రతిష్టాత్మక కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లలో డిజిటల్ తరగతులు
- డిసెంబర్ 21న బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల పంపిణీ
- చిత్తూరు డెయిరీకి మోక్షం
- టీచర్లు మెరుగైన బోధన పనులకే..
- మంత్రివర్గం నిర్ణయాలను వెల్లడించిన మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సీఎం జగన్ అభినందన

కేంద్రం నుంచి అవార్డులందుకున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని, ఉన్నతాధికారి కృష్ణబాబును అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్

2 లో

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జనవరి 1 నుంచే ఈ మేరకు అవ్వాతాతలకు అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు నెలకు అదనంగా రూ.130.44 కోట్ల వ్యయం అవుతుంది. రాష్ట్రంలో అవ్వాతాతలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతామంటూ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆ హామీని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పెన్షన్‌ను రెండు విడతలుగా రూ.2,250కి.. రూ.2,500కు పెంచారు. ఇకపై రూ.2,750 చొప్పున ఇవ్వాలన్న కీలక నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం 62 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు

మిగతా 2వ పేజీలో ▶

విమర్శలకు ఆస్కారం ఇవ్వొద్దు

- మంత్రులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- దుష్టచతుష్టయం దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి

2 లో

ఏది నిజం?

రామోజీ.. అస్మదీయ తకధిమి

- ప్రాజెక్టులకు టెండర్లు పిలవలేదంటూ విచిత్రమైన వాదన
- ఏ మెగా ప్రాజెక్టుకూ దేశంలో ఎక్కడా టెండర్లు పిలవరని తెలియదా?
- 'ఎనర్జీ' ప్రాజెక్టులన్నీ ఓపెన్‌గా వెబ్‌సైట్లోనే.. ఎవరైనా రావచ్చు
- ముందుకొచ్చిన వారిలో ఒక్కరినీ తిరస్కరించిన సందర్భమే లేదు
- ఇంకా 30వేల మె.వా ప్రాజెక్టులు.. రామోజీ కూడా రావొచ్చు
- ఈ వాస్తవాలు దాచి.. సన్నిహితులకే ఎనర్జీ అంటూ తప్పుడు రాతలు
- అదానీ ప్రపంచంలోనే విలువైన గ్రూప్.. అరబిందో దేశీ ఫార్మాలో నెంబర్-2
- రూ.10వేల కోట్ల సోలార్ మాడ్యూల్స్ తయారీ ప్లాంటు ఏర్పాటు చేస్తున్న షిర్డీసాయి
- దీనికి కేంద్రం అనుమతి.. పీఎల్ఐ కింద ప్రోత్సాహకాలు


4 లో

చైనా సేనలను తరిమికొట్టాం..

పార్లమెంటులో రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటన

యథాతథ స్థితికి చైనా తూట్లు

- దొంగచాటుగా ఎల్‌ఏసీ దాటే యత్నం
- మనవాళ్లు వీరోచితంగా తిప్పికొట్టారు
- ప్రాణ నష్టం జరగలేదన్న రక్షణ మంత్రి
- అంగుళం కూడా వదలబోం: అమిత్ షా
- భారత సైన్యమే ఎల్‌ఏసీ దాటిందంటూ చైనా సైన్యం తెంపరి ప్రకటన
- కేంద్రానిది దౌత్య వైఫల్యమన్న కాంగ్రెస్



→ సరిహద్దుల్లో మళ్లీ గాల్వాన్ తరహా ఘర్షణకు చైనా తెగబడింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో యాంగ్‌ట్సే ప్రాంతం వద్ద వాస్తవాధీన రేఖను దాటేందుకు, తద్వారా యథాతథ స్థితిని మార్చేందుకు డిసెంబర్ 9న చైనా సైన్యం ప్రయత్నించింది. అయితే, ఆ ప్రయత్నాలను మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టడంతో డ్రాగన్ తోకముడిచిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పార్లమెంటులో తెలిపారు. మన భూభాగాన్ని ఆక్రమించేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా పూర్తిగా తిప్పికొట్టేందుకు, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు సైన్యం నిత్యం సన్నద్ధంగా ఉందని స్పష్టంచేశారు. కాగా, మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం భారత భూభాగంలో ఎవరూ ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. మరోవైపు చైనా అంశంపై ప్రభుత్వ వ్యవహార శైలిని కాంగ్రెస్‌తో పాటు విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఇదిలా ఉండగా.. తవాంగ్ అంశంపై డ్రాగన్ సైన్యం తెంపరి వ్యాఖ్యలు చేసింది. భారత దళాలే ఎల్‌ఏసీ దాటాయని.. వారిని తాము అడ్డుకోవడంతో రగడకు దారితీసిందని ఆరోపణలు చేసింది.

- వివరాలు 6లో



జీతాలపై వికృత రాతలు

- పచ్చ పత్రికలో కల్పిత కథనాలు
- బాబు హయాంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, కార్పొరేషన్ ఉద్యోగులకు ఏనాడైనా సమయానికి జీతాలిచ్చారా?
- ఏజెన్సీల పేరిట టీడీపీ నాయకుల దోపిడీ దందా
- ఈ నెలలో ఇప్పటివరకు సుమారు రూ.6 వేల కోట్లు జీతాల కోసం చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం

2 లో

పార్లమెంట్‌లో 'హోదా' గళం

- ఏపీ హక్కును ఇచ్చి తీరాల్సిందే..
- పోలవరం సాగునీటికే పరిమితమంటే ఎలా?
- ప్రాజెక్టుకు నిధులివ్వకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం
- ఎనిమిదేళ్లయినా విభజన సమస్యలు పరిష్కారం కాలేదు
- గత సర్కారు పరిమితికి మించి అప్పులు చేసిందని ఇప్పుడు కోతలు విధిస్తారా?
- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, భరత్ రామ్, లావు శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి, న్యూఢిల్లీ: విభజన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను ఇచ్చి తీరాలని, జీవనాడి లాంటి పోలవరానికి నిధులివ్వకుండా, జాతీయ ప్రాజెక్టులా భావించకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్‌లో గట్టిగా గళమెత్తారు. అశాస్త్రీయ విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీని ఎనిమిదేళ్లు గడిచినా నెరవేర్చకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో 20 మందికిపైగా ఎంపీలంతా కలసి హోదా ఇవ్వాలని

మిగతా 12వ పేజీలో ▶

కొల్లేరులో వలస పక్షుల సందడి



వలస పక్షులతో కొల్లేరు కళకళలాడుతోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ విస్తరించిన కొల్లేరు ప్రాంతంలో విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. శీతాకాలం విడిది కోసం సైబీరియా, నైజీరియా, రష్యా, టర్కీ, యూరప్ తదితర దేశాల నుంచి అవి ఇక్కడకు చేరుకున్నాయని అధికారులు చెప్పారు. ఈ ఏడాది వలస పక్షుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

16 లో



చెత్తతో 'పవర్' ఫుల్

- రాష్ట్రంలో మరో 'చెత్త' ఆధారిత విద్యుత్ కేంద్రం
- సర్కార్ గ్రీన్ సిగ్నల్.. త్వరలో టెండర్లు
- రాజమహేంద్రవరం వద్ద ఏర్పాటు
- సమీప 22 పట్టణ స్థానిక సంస్థల నుంచి చెత్త తరలింపు
- 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్

5 లో



అండమాన్‌పై ఆవర్తనం

అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రెండు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. వీటి ఫలితంగా బుధవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

- వివరాలు 2లో

ఇదం జగత్



మనం విచ్చలవిడిగా తిరుగుతున్నాం! కానీ భద్రం అని చెప్పింది వైరస్‌లకు కాదనుకుంటా

టమాటా రైతుకు దిగుల్లేదిక..

రాయలసీమ జిల్లాల్లో 20 ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు

తద్వారా మార్కెట్ ధర కంటే 30 శాతం అదనపు లాభం

నెలాఖరులోగా అందుబాటులోకి 4 యూనిట్లు.. మార్చి నాటికి మరో 16 యూనిట్ల ఏర్పాటుకు కసరత్తు

ఒక్కో యూనిట్‌లో గంటకు 1.5 టన్నులు ప్రాసెస్.. 250 టన్నులు నిల్వ చేసే శీతల గిడ్డంగులు

20 ఎఫ్‌పీవోల పరిధిలో 20 వేల మంది రైతులకు లబ్ధి



సాక్షి, అమరావతి: టమాటా రైతులకు మంచి రోజులు రాబోతున్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు కనీస మద్దతు ధర కంటే అదనపు లబ్ధి చేకూర్చే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 20 టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. వీటిలో నాలుగు యూనిట్లు ఈ నెలాఖరులో అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 61,571 హెక్టార్లలో టమాటా సాగవుతుండగా, ఇందులో అత్యధికంగా రాయలసీమ జిల్లాల పరిధిలోనే 56,633 హెక్టార్లు ఉన్నాయి. ఏటా 22.16 లక్షల టన్నుల దిగుబడుల్లో 20.36 లక్షల టన్నులు ఆ జిల్లాల నుంచే వస్తోంది. మూడున్నరేళ్లుగా టమాటా రైతుకు మద్దతు ధర లభించేలా కృషి చేస్తున్న ప్రభుత్వం.. ధరలు తగ్గిన

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

26న శ్రీశైలం రానున్న రాష్ట్రపతి ముర్ము



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 26న శ్రీశైలం రానున్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి అధికారులకు మంగళవారం సమాచారమందింది. ముర్ము 26న మధ్యాహ్నం 12.15 నిమిషాలకు శ్రీశైలం చేరుకుని, స్వామి అమ్మవార్లను దర్శించుకుంటారు. 'ప్రసాద్' స్కీమ్ ద్వారా శ్రీశైలంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన పలు భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం తెలంగాణ పర్యటనకు వెళతారు. ముర్ము పర్యటన నేపథ్యంలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు శ్రీశైలం రానున్నారు.

మానవ హక్కుల పరిరక్షణ మన బాధ్యత

ఐసీఐ సదస్సులో గవర్నర్ హరిచందన్



సదస్సులో జ్యోతి వెలిగిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, న్యూఢిల్లీ: మానవ హక్కుల పరిరక్షణ మన బాధ్యత అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇంటలెక్చువల్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో 'భారత దేశంలో మానవ హక్కుల పరిరక్షణ'పై సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ హరిచందన్ మానవ హక్కుల గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్, ఒడిశా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖ, గుంటూరు జిల్లాలకు సీఎం జగన్

సాక్షి, అమరావతి/డెంకాడ: సీఎం వైఎస్ జగన్ బుధవారం విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆయన తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం దాకమర్రి చేరుకుంటారు. అక్కడ జరిగే నెల్లిమర్ల ఎమ్మెల్యే బి.అప్పలనాయుడు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకలో సీఎం జగన్ పాల్గొంటారు. ఆ తర్వాత తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

వైద్య, ఆరోగ్య శాఖకు సీఎం జగన్ అభినందన

సాక్షి,అమరావతి: టెలీకన్సల్టేషన్, విలేజ్ హెల్త్ క్లీనిక్ విభాగంలో కేంద్రం నుంచి రెండు అవార్డులను అందుకున్న వైద్య, ఆరోగ్య శాఖను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. ఏపీకి వచ్చిన అవార్డులను మంగళవారం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్‌కు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చూపించారు.

అండమాన్‌పై ఆవర్తనం

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సగటు సముద్రమట్టానికి 5.8 కి.మీల ఎత్తు వరకు కొనసాగుతోంది. రానున్న రెండు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. రాష్ట్రంపైకి ప్రస్తుతం తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా బుధవారం కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం తెలిపింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. రాష్ట్రంలో కొన్నిచోట్ల పొగ మంచు ఏర్పడేందుకు ఆస్కారం ఉందని వివరించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు విజయపురం (చిత్తూరు)7.1 సెం.మీ., గొర్రెలమెట్ట (అల్లూరి సీతారామరాజు) 5.8, సెం.మీ వర్షం కురిసింది.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు 'అపుస్మా' మద్దతు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి(పశ్చిమ రాయలసీమ), పి.శ్యాంప్రసాద్ రెడ్డి(తూర్పు రాయలసీమ), సీతంరాజు సుధాకర్(ఉత్తరాంధ్ర)కు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.తులసీ విష్ణుప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, కోశాధికారి ఎంవీ రావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు రామచంద్రారెడ్డి(పశ్చిమ రాయలసీమ), పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి(తూర్పు రాయలసీమ)కు తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని, వారి గెలుపునకు కృషిచేస్తామన్నారు.

జీతాలపై వికృత రాతలు

పచ్చ పత్రికలో కల్పిత కథనాలు

సాక్షి, అమరావతి: గత సర్కారు హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు ఇవ్వకుండా పోస్ట్ డేటెడ్ జీవోలతో మభ్యపుచ్చినా ఈనాడు రామోజీకి చీమ కుట్టినట్టైనా అనిపించలేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, చివరకు చిరుద్యోగులైన పారిశుధ్య సిబ్బందికి జీతాల పెంపు దేవుడెరుగు.. ఆర్నెల్ల నుంచి ఏడాది పాటు కనీసం జీతాలు ఇవ్వకపోయినా ఒక్క ముక్క కూడా రాయలేదు. ఇప్పుడు పొరుగు రాష్ట్రాల కంటే మిన్నగా సకాలంలో చెల్లిస్తుంటే వక్రీకరణలతో పచ్చ పత్రికలో కట్టు కథలు ముద్రిస్తున్నారు.

నాడు దళారీల దందా..

చంద్రబాబు హయాంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, కార్పొరేషన్ ఉద్యోగులకు ఒక్క నెల కూడా సమయానికి జీతాలివ్వలేదు. ఏజెన్సీల పేరిట టీడీపీ నేతలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను దోచుకుతిన్నారు. ఇప్పుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి మరీ మధ్య దళారీలు లేకుండా నెల నెలా సకాలంలో వేతనాలు చెల్లిస్తున్నా రామోజీ తప్పుడు కథనాలు వండుతున్నారు.

కోవిడ్ లాంటివి లేకున్నా..

ప్రభుత్వ, ప్రభుత్వ కార్పొరేషన్ ఉద్యోగులదీ నాడు అదే దుస్థితి. మొదటి వారంలో జీతాలు అందుకోవడం గగనమే. అంగన్‌వాడీలకు నెలల తరబడి బకాయిలే. మధ్యాహ్న భోజన కార్మికులకూ బాకీలే. ఇక 108, 104 ఉద్యోగులదీ అదే పరిస్థితి. కొందరికైతే సంవత్సరం దాటినా జీతాలు అందని దయనీయ పరిస్థితులు చంద్రబాబు పాలనలో నెలకొన్నాయి. గత సర్కారు హయాంలో కోవిడ్ లాంటి సంక్షోభం లేదు. లాక్‌డౌన్‌లు, ఆర్థిక ప్రగతి మందగమనం లాంటి పరిస్థితులూ ఉత్పన్నం కాలేదు. అయినా సరే ఏనాడూ జీతాలు సకాలంలో ఇచ్చిన పాపాన పోలేదు.

సంక్షోభాలను అధిగమిస్తూ సకాలంలో..

కోవిడ్ సంక్షోభంతో పాటు ఆర్థిక మందగమనం లాంటి ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీతాలు, పెన్షన్లు చెల్లిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రం నిర్వర్తించని విధంగా సంక్షేమాన్ని, నెలకు సుమారు రూ.1,700 కోట్లకు పైగా సామాజిక పెన్షన్ల బాధ్యతనూ నెరవేరుస్తూనే ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులను సక్రమంగా నిర్వర్తిస్తోంది. సీఎం జగన్ ప్రభుత్వం ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు తెచ్చింది. దళారీలను నిర్మూలించి ఏజెన్సీ వ్యవస్థను రూపుమాపింది. నేరుగా వారి ఖాతాల్లోకే మొదటి తారీఖు కల్లా జీతాలు జమ చేస్తోంది. ఐఏఎస్‌ల కంటే ముందుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు, కార్పొరేషన్ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తోంది. తొలి ఏడు రోజుల్లోనే క్రమం తప్పకుండా జీతాలు ఇస్తోంది. పొరుగు రాష్ట్రాలతో పోల్చినా, దేశంలో ఇతర రాష్ట్రాలతో పోల్చినా ఏపీలో జీతాల చెల్లింపులు చాలా మెరుగ్గా ఉన్నాయన్నది సుస్పష్టం. డిసెంబర్ నెలలో 12వ తేదీ నాటికి సుమారు రూ.6 వేల కోట్లను జీతాల కోసం ప్రభుత్వం చెల్లించింది. అదే పొరుగున ఉన్న రాష్ట్రంలో జిల్లాల వారీగా జీతాల చెల్లింపులు చేస్తున్నారు. ఏ రోజు కూడా మొదటి తారీఖు అనే మాటే లేదు. ప్రతి నెలా తేదీ, ఆ తర్వాతే చెల్లింపులు చేస్తున్నారు.

పీఏసీ సభ్యుడుగా ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషిలకు ఆయన మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నెరవేర్చడంతోపాటు తనవంతు సహకారం అందిస్తానని ట్విట్టర్ వేదికగా ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు.

ఇకపై పింఛన్ రూ.2,750

▶ మొదటి పేజీ తరువాయి

నెలకు సుమారు రూ.1,720 కోట్లను పెన్షన్‌గా పంపిణీ చేస్తోంది. కొత్తగా డిసెంబర్‌లో 2.43 లక్షల మందికి పెన్షన్‌ను మంజూరు చేసింది. వారితో కలుపుకుంటే వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద లబ్ధిదారుల సంఖ్య 64.74 లక్షలకు చేరుకుంది. దాంతో పెన్షన్ల కోసం ప్రభుత్వం నెలకు చేస్తున్న వ్యయం మొత్తం రూ.1,786 కోట్లకు పెరగనుంది. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం నెలకు కేవలం రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు చేసేవారు. ప్రస్తుతం దానికి నాలుగున్నర రెట్లు అదనంగా పెన్షన్ రూపంలో అవ్వాతాతలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందజేస్తుండటం గమనార్హం. పెంచిన పెన్షన్ పంపిణీకి సంబంధించి జనవరి 1 నుంచి 7 వరకు వారోత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ మంజూరు పత్రాలను ప్రభుత్వం అందజేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంగళవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. సంక్షేమం, అభివృద్ధి పథకాలు, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిని సమాచార, బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.



మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

కొత్తగా అర్హత సాధించిన వారికి 27న పంపిణీ

- అర్హులైన పేదలందరికీ నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలులో భాగంగా వివిధ కారణాల వల్ల మిగిలి పోయిన, కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు ఏడాదికి రెండు దఫాలు (జూన్, డిసెంబర్)గా లబ్ధి చేకూర్చాలని గతంలో మంత్రివర్గం నిర్ణయించింది. ఆ నిర్ణయం అమల్లో భాగంగా కొత్తగా అర్హత సాధించిన వారికి ఈనెల 27న సంక్షేమ పథకాల ఫలాలను అందజేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఇందులో భాగంగా డిసెంబర్ 27న వివిధ పథకాల కింద 2.51 లక్షల మందికి రూ.403 కోట్ల మేరకు లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. దాంతోపాటు అదనంగా 2.43 లక్షల మందికి పెన్షన్లు, 44,543 బియ్యం కార్డులు, 14,441 ఆరోగ్యశ్రీ కార్డులు, 14,531 ఇళ్ల పట్టాలు, రూ.65 కోట్ల విలువైన సస్పెన్సియస్ అకౌంట్‌లో ఉన్న బీమా క్లెయింలు మంజూరు చేసింది.
- వ్యవసాయ, సహకార, మత్స్య శాఖలలో 2022 మే, జూన్ నెలలో అమలు చేసిన సంక్షేమ క్యాలెండర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఖరీఫ్–2022కు సంబంధించి రాష్ట్రంలో గతంలో అమలు చేసిన సాగునీటి విడుదల షెడ్యూల్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సకాలంలో ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా సరైన కాలానికే పంటలు చేతికందాయని, తుపాను బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు ఈ షెడ్యూల్ ఉపకరించిందని మంత్రివర్గం అభిప్రాయపడింది. మాండూస్ తుపాను ప్రభావం చూపక ముందే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో 80 శాతానికి పైగా ధాన్యం సేకరణ పూర్తి చేయగలిగామని మంత్రివర్గానికి సంబంధిత శాఖల అధికారులు వివరించారు.

బోధనేతర పనులకు సచివాలయ సిబ్బంది

పాఠశాల విద్యా శాఖకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రైట్ ఆఫ్ చిల్డ్రన్ టు ఫ్రీ అండ్ కంపల్సరీ ఎడ్యుకేషన్ రూల్స్–2010కు రూల్ నంబర్ 30ని జతచేసే సవరణలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా అకడమిక్ వ్యవహారాలకు తప్ప బోధనేతర పనులకు ఉపాధ్యాయులను ఉపయోగించడం నిషేధం. అందువల్ల పిల్లలకు మెరుగైన బోధనను అందించగలుగుతారన్న విద్యావేత్తల అభిప్రాయల మేరకు కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఉపాధ్యాయులు నిర్వర్తించిన బోధనేతర పనుల కోసం.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన 1.3 లక్షల మంది సచివాలయ సిబ్బందిని వినియోగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

చంద్రబాబు మూసేయించిన చిత్తూరు డెయిరీకి మోక్షం

గతంలో మూసి వేతకు గురైన చిత్తూరు డెయిరీని పునరుద్ధరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమూల్ సంస్థ ద్వారా మళ్లీ చిత్తూరు డెయిరీ కార్యకలాపాలు ప్రారంభించనుంది. చిత్తూరు డెయిరీ భూములను 99 ఏళ్లపాటు అమూల్‌కు లీజు ఇస్తూ రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఇందుకు ప్రభుత్వానికి లీజు రూపంలో ఏటా రూ.కోటి చొప్పున ఆదాయం వస్తుంది. దశల వారీగా పాల సేకరణ చేస్తూ.. మొత్తంగా 4 లక్షల లీటర్ల పాలను అమూల్ సేకరించనుంది. అమూల్ ప్రవేశం ద్వారా ఇప్పటికే రైతులకు మెరుగైన ధరలు దక్కుతున్నాయి. లీటరుకు అదనంగా రూ.5 నుంచి రూ.20 వరకు రైతులకు ఆదాయం వస్తోంది. చిత్తూరు డెయిరీ అంశంపై మంత్రివర్గంలో సమగ్ర చర్చ జరిగింది. తన సొంత ప్రయోజనాల కోసం చిత్తూరు డెయిరీని చంద్రబాబు మూసి వేశారని, ఆ తర్వాత పాడి రైతులను దోచుకున్నారని వ్యాఖ్యానించింది. ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోకి అమూల్ సంస్థను తీసుకురావడం ద్వారా పోటీ పెరిగి.. తప్పక రేట్లు పెంచాల్సిన పరిస్థితి వచ్చిందని, తద్వారా రైతులకు మంచి రేట్లు వస్తున్నాయని కేబినెట్ హర్షం వ్యక్తం చేసింది.

పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రమోషన్ పాలసీకి గ్రీన్ సిగ్నల్

- సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో భాగంగా రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజ్, హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రమోషన్ పాలసీ–2022కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఒక్కో మెగావాట్‌కు రూ.2 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి కంపెనీలు చెల్లించాల్సి ఉంటుంది. రైతుల నుంచి భూములు తీసుకుంటే.. ఏడాదికి లీజు రూపేణా ఎకరాకు రూ.30 వేల చొప్పున చెల్లించాలి. ప్రతి రెండేళ్లకు లీజు రుసుము 5 శాతం పెంచి ఇవ్వడం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూరనుంది.
- అల్లూరి సీతారామరాజు జిల్లా పెదకోట, విజయనగరం జిల్లాలో రైవాడ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1,600 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు అనుమతులు మంజూరు చేసే నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- వైఎస్సార్ జిల్లా సోమశిల వద్ద 900 మెగావాట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎర్రవరం వద్ద 1,200 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌కు అనుమతులు మంజూరు చేసే నిర్ణయానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు వద్ద 1,350 మెగావాట్ల సామర్థ్యంతో అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతుల మంజూరుకు ఆమోదం లభించింది.

వైఎస్సార్ జిల్లాలో రూ.8,880 కోట్లతో స్టీల్ పరిశ్రమ

- వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్యాక్టరీ (సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) ఆమోదించింది) ఏర్పాటుకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏటా రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో మరో 2.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఆమోదం తెలిపింది. రూ.8,880 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 6,500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి.

ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి డిజిటల్ తరగతులు

- పాఠశాల విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు మొదటి దశలో పనులు పూర్తయిన స్కూళ్లలో అత్యాధునిక బోధన ఉపకరణాల ఏర్పాటుకు ఆమోదం. హైస్కూల్స్ పరిధిలో ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ), ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలో స్మార్ట్ టీవీ రూమ్స్ ఏర్పాటు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతి గదిలో దాదాపు 15,694 స్కూళ్లలో 30,230 తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు ఏర్పాటు చేయనుంది. దీని కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయనుంది.
- ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రతి స్కూళ్లో ఒక టీవీ ఏర్పాటు చేయనుంది. పది వేల స్మార్ట్ టీవీలను పాఠశాలల్లో ఏర్పాటు చేయనుంది. ఇందుకు దాదాపు రూ.50 కోట్లు ఖర్చు అవుతుంది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సింధియా, సెయింట్ జేవియర్స్, బాంబే స్కాటిస్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి అత్యున్నత ప్రమాణాలు గల విద్యా సంస్థల్లోనే ఇలాంటి సౌలభ్యం ఉంది.

21న అందుబాటులోకి ట్యాబ్‌లు, ఈ-కంటెంట్

- ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులకు 24 గంటలపాటు ఉపయోగపడే విధంగా ట్యాబులు, ఈ-కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమాన్ని సీఎం పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 21న లాంఛనంగా ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించింది. 4.6 లక్షల మంది విద్యార్థులతోపాటు.. వారికి బోధించే 60 వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా శామ్‌సంగ్ ట్యాబులు పంపిణీ చేయనుంది.
- ఇంటర్‌నెట్ కనెక్షన్ లేకపోయినా, ట్యాబ్‌ను ఇంటిలో కూడా వినియోగించుకునేలా, ఆఫ్‌లైన్‌లో కూడా కంటెంట్ అందుబాటులో ఉండేలా సెక్యూర్ డిజిటల్ కార్డుతో బైజూస్ సంస్థ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందజేయనుంది. ఇందు కోసం ప్రభుత్వం రూ.668 కోట్లు వ్యయం చేస్తోంది. దాంతో పాటు రూ.778 కోట్ల విలువైన బైజూస్ కంటెంట్ ఉచితంగా ఇస్తోంది. మూడేళ్ల వారెంటీతో ఈ ట్యాబులు పంపిణీ చేస్తోంది.

మరిన్ని కీలక నిర్ణయాలు ఇలా..

- పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో కొత్తగా ఏర్పాటు చేయనున్న పశు సంవర్థక పాలిటెక్నిక్ కళాశాలకు మంత్రివర్గం ఆమోదం. 3 బోధన, 10 బోధనేతర సిబ్బందితో కలిపి 13 పోస్టుల భర్తీతో పాటు సుమారు రూ.10 కోట్లతో కళాశాల ఏర్పాటు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి తరగతుల ప్రారంభం.
- పశు సంవర్థక శాఖ పరిధిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ హజ్బెండరీ (తణుకు), ఏరియా వెటర్నరీ ఆసుపత్రి (గోపాలపట్నం), విశాఖపట్నంలో రెండు రేడియోగ్రాఫర్స్ పోస్టుల భర్తీకి ఆమోదం. అవుట్ సోర్సింగ్ విధానంలో ఆప్కాస్ ద్వారా నియమించాలని నిర్ణయం.
- డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో సవరణలకు మంత్రిమండలి ఆమోదం.
- నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ఏర్పాటు చేసిన మేకపాటి గౌతం రెడ్డి వ్యవసాయ కళాశాలలో 52 బోధనా సిబ్బంది, 56 బోధనేతర సిబ్బందితో సహా 108 పోస్టుల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. గతంలో మేకపాటి రాజమోహనరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (మెరిట్స్)లో ఇప్పటికే అక్కడ పని చేస్తున్న సిబ్బందిని తాజాగా ఏర్పాటు చేసిన వ్యవసాయ కళాశాలలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించాలన్న ప్రతిపాదనకు ఆమోదం. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జ్ఞాపకార్థం మెరిట్స్ కాలేజీని ప్రభుత్వానికి ఉచితంగా అందజేసిన మేకపాటి కుటుంబం.
- నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో భాగంగా వైఎస్సార్ పశు బీమా పథకం (లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ స్కీంను) పేరు మార్పునకు కేబినెట్ ఆమోదం. గతంలో వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం పేరుతో ఉన్న ఈ స్కీంను ఇకపై వైఎస్సార్ పశు బీమా పథకంగా మార్పు.
- చిత్తూరు జిల్లా సదుంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీడబ్ల్యూసీ) 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్. ఇందులో 18 అదనపు పోస్టుల భర్తీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్.
- ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ గైడ్‌లైన్స్ మేరకు.. అత్యుత్తమ బోధన అందించే కార్యక్రమంలో భాగంగా పోస్టు గ్రాడ్యుయేట్ విభాగంలో ముగ్గురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 4 ప్రొఫెసర్, 3 అసోసియేట్ ప్రొఫెసర్, 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం.
- వైద్య ఆరోగ్య శాఖలో నాడు–నేడులో భాగంగా ఏపీఎంఎస్ఐడీసీ కింద చేపట్టిన పనులకు కేబినెట్ ఆమోదం. ఇందులో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న, ఇప్పటికే వినియోగంలో ఉన్న వైద్య కళాశాలలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ బ్లాకులు, కేన్సర్ కేర్ సెంటర్ నిర్మాణాల్లో నాడు–నేడు పనులకు ఆమోదం.
- రాష్ట్రంలో అత్యాధునిక వైద్య చికిత్సలు (టెర్షియరీ కేర్) కోసం.. 16 మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రైవేట్ రంగంలో మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్. ప్రతి ఆస్పత్రిలో కనీసం వంద పడకల ఏర్పాటుతో పాటు రూ.100 కోట్లు పెట్టుబడి ఉండాలి. వీటిలో 50 శాతం పడకలు ఆరోగ్యశ్రీ కేటాయించాలి.
- కర్నూలు జిల్లా ఆదోని, అన్నమయ్య జిల్లా రాయచోటిలో మైనార్టీ గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో కొత్త విభాగాలు ఏర్పాటు. ఒక్కో ఐటీఐకి 20 బోధన, బోధనేతర పోస్టుల చొప్పున 40 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం. వీటిలో తొలిసారిగా కొత్తగా అందుబాటులోకి రానున్న సోలార్ టెక్నీషియన్, రేడియాలజీ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సులు.
- సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో సర్వే కోసం.. సర్వే సెటిల్మెంట్, రెవెన్యూ శాఖ సేవలను రీసర్వే పనుల కోసం వినియోగించుకునేందుకు.. ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీస్ యాక్టు –1965, మున్సిపల్ కార్పొరేషన్స్ యాక్టు –1955 సవరణలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.
- బాపట్ల కేంద్రంగా బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. 1,301.68 చదరపు కిలోమీటర్ల పరిధిలో 2 అర్బన్ లోకల్ బాడీస్, 101 గ్రామాలు, 9 మండలాలతో బుడా ఏర్పాటు.
- తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా)లో ఎస్ఈ పోస్టు ఏర్పాటుకు, విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ)లో ఎస్ఈ పోస్టు ఏర్పాటుకు ఆమోదం.
- నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం. 8 పట్టణ స్థానిక సంస్థలతో పాటు 28 మండలాల పరిధిలో 349 గ్రామాలతో 7,281.31 చదరపు కిలోమీటర్ల పరిధితో ఏర్పాటు.
- నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీలో వివిధ కేటగిరీల కింద 55 అదనపు పోస్టుల ఏర్పాటుకు, ఆంధ్రప్రదేశ్ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్ యాక్టు–1971 సవరణలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్.
- పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, ఎన్టీఆర్, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడిమిపాలెంలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ (మదర్ అండ్ చైల్డ్ కేర్) ఆస్పత్రి నిర్మాణానికి విశ్వమానవ సమైక్యతా సంస్థకు 7.45 ఎకరాల భూమి కేటాయింపునకు ఆమోదం.
- అనంతపురంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ వైద్యశాల ఉన్నతీకరణ కోసం 8.32 ఎకరాల భూమి ఉచితంగా కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్.
- వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం గండికోటలో విండ్ టర్బైన్స్ ఏర్పాటుకు ఐఓసీఎల్‌కు 15 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించాలన్న ప్రతిపాదనకు, తిరుమల తిరుపతి దేవస్థానంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్ఓ) నియామకానికి కేబినెట్ ఆమోదం.

విమర్శలకు ఆస్కారం ఇవ్వొద్దు

- మంత్రులకు సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- దుష్టచతుష్టయం దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' ప్రభావవంతంగా నిర్వహించాలి
- మీ నియోజకవర్గాలు, జిల్లాతో పాటు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిల్లాల్లోనూ పర్యవేక్షించాలి
- 21న ట్యాబ్‌ల పంపిణీ, జనవరి 1న పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనాలి



సాక్షి, అమరావతి: విమర్శలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని మంత్రులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. లేని అవినీతిని ఉన్నట్టుగా సృష్టిస్తూ ఎల్లో మీడియా వికృతరాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తోందంటూ ఆక్షేపించారు. మంగళవారం తాత్కాలిక సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం సమకాలీన రాజకీయ పరిణామాలపై ఆయన మంత్రులతో చర్చించారు. రాష్ట్రంలో అత్యంత పారదర్శకమైన పారిశ్రామిక విధానాలను అనుసరిస్తుండటం వల్లే అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని.. కానీ సన్నిహితులకే ఎనర్జీ ప్రాజెక్టులను కట్టబెడుతున్నట్లు ఎల్లో మీడియా వికృత ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడానికే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించి.. దుష్టచతుష్టయం దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని మార్గ నిర్దేశం చేశారు. ఎల్లో మీడియా వికృత చేష్టల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రులకు ఉద్బోధించారు. చేసిన మంచిని ప్రజలకు వివరించి.. వారి సమస్యలు విని.. వాటిని పరిష్కరించి.. ప్రజల ఆశీర్వాదం పొందడానికి చేపట్టిన బృహత్తర కార్యక్రమమే గడప గడపకూ మన ప్రభుత్వమని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మీ నియోజకవర్గాల్లో మరింత ప్రభావవంతంగా నిర్వహించడంతోపాటు మీ జిల్లా.. మీరు ఇన్‌చార్జ్ మంత్రిగా వ్యవహరించే జిల్లాలోనూ ఆ కార్యక్రమాన్ని మరింత ప్రభావ వంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 8వ తరగతి చదవుతున్న పిల్లలకు ఈనెల 21న ట్యాబ్‌లు, బైజూస్ ఈ-కంటెంట్‌ను అందజేసే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అవ్వాతాతలకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.2,750కి పెంచుతున్న తరుణంలో జనవరి 1 నుంచి 7 వరకు నిర్వహించే వారోత్సవాల్లో పాల్గొని, పెన్షన్ పెంపు మంజూరు పత్రాలను అందజేసి, వారి ఆశీస్సులు తీసుకోవాలని చెప్పారు.

66 మందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

- 198 మందితో ఉన్న అడ్‌హాక్ ప్యానల్ నుంచి 66 మంది ఎంపిక
- కొత్త రెవెన్యూ డివిజన్లు, అధికారుల అవసరం రీత్యా ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 66 మంది తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు, సూపరింటెండెంట్ క్యాడర్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇచ్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం జీవోఎంఎస్ నంబర్ 747 జారీచేశారు. వివిధ శాఖల్లో డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారుల అవసరం పెరగడం, కొత్తగా 24 రెవెన్యూ డివిజన్ కేంద్రాల ఏర్పాటు, జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం రెవెన్యూ శాఖలో 66 కొత్త డిప్యూటీ కలెక్టర్ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు, రాష్ట్ర సచివాలయం, రాష్ట్ర హెచ్‌వోడీ కార్యాలయాల్లో పని చేస్తున్న సెక్షన్ అధికారులు, సూపరింటెండెంట్‌లకు పదోన్నతులు ఇచ్చి ఈ పోస్టుల్ని భర్తీచేసింది. పదోన్నతుల కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లను ఎంపికచేసి 198 మందితో 2022–23 సంవత్సరం అడ్‌హాక్ ప్యానల్ తయారు చేసింది. ఈ నెల 8వ తేదీన జరిగిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశంలో ఈ జాబితా నుంచి 66 మందిని డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికచేశారు. ఆ జాబితాను ప్రభుత్వం ఆమోదించింది. పదోన్నతులు తాత్కాలికమని జీవోలో పేర్కొన్నారు. పదోన్నతులు పొందిన అధికారులంతా వెంటనే వెలగపూడి సచివాలయంలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని జీవోలో స్పష్టం చేశారు. ఒకేసారి ఇంతమంది తహసీల్దార్ క్యాడర్ అధికారులకు పదోన్నతులు రావడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది డిప్యూటీ తహసీల్దార్ల నుంచి తహసీల్దార్లుగా ప్రభుత్వం పెద్దఎత్తున పదోన్నతులు ఇచ్చింది. వీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూడగా చివరికి వైఎస్ జగన్ ప్రభుత్వం వారి కోరిక నెరవేర్చింది. తాజాగా తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇవ్వడం ద్వారా ఎంతోకాలంగా వాటికోసం ఎదురు చూస్తున్న వారి కలను నెరవేర్చింది.

నియోజకవర్గానికి ఒక బిజినెస్ ప్రాజెక్ట్

ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



సాక్షి, అమరావతి: స్థానిక పరిస్థితుల మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పెద్ద బిజినెస్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. వీటిని కేవీఐసీ, ఎంఎస్ఎంఈ, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతో అనుసంధానం చేయాలని సూచించారు. తద్వారా పొదుపు సంఘాలకు చెందిన 500 నుంచి 1,000 మంది మహిళలు శాశ్వతంగా జీవనోపాధి పొందేలా చూడాలన్నారు. సెర్ప్ కార్యక్రమాల అమలుపై మంగళవారం ఆయన విజయవాడలో డీఆర్‌డీఏ పీడీలతో సమీక్షించారు. సెర్ప్ పరిధిలోని పొదుపు సంఘాల మండల సమాఖ్యలను వ్యాపార సంస్థలుగా మార్పు చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి మండలంలో ఒక చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసుకునేలా అధికారులు తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. వచ్చే ఏడాది జనవరిలో మూడో విడత 'ఆసరా' సాయం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పారిశ్రామిక ప్రగతిని ఓర్వలేకే బురద: మంత్రి గుడివాడ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని చూసి ఓర్వలేక ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా చంద్రబాబు కుట్రలకు పాల్పడుతున్నారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో ఎవరు పెట్టుబడులు పెట్టినా అవి మన రాష్ట్రం నుంచే తరలిపోయాయంటూ దుష్ప్రచారానికి తెర తీశారని దుయ్యబట్టారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఎప్పుడూ విపక్ష నాయకుల పరిశ్రమలు, వ్యాపారాలను అడ్డుకునేందుకు ప్రయత్నించలేదని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

- టీడీపీ హయాంలో రూ.16 లక్షల కోట్లు ఎంవోయూలు జరిగినట్లు ప్రచారం చేసుకోగా 2 శాతం కూడా పెట్టుబడులు రాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దావోస్‌లో రూ.1.25 లక్షల కోట్లు ఎంవోయూలు చేసుకుంటే రూ.35 వేల కోట్ల పెట్టుబడులతో ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.
- రాయలసీమ ప్రజల చిరకాల వాంఛ కడప స్టీల్ ప్లాంట్‌ను సీఎం జగన్ నెరవేర్చారు. జిందాల్ సంస్థ రూ.8,800 కోట్ల పెట్టుబడులతో 6 వేలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తుంటే పచ్చ పత్రికలకు కనపడటం లేదా?
- పంప్డ్ స్టోరేజ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టును పారదర్శకంగా నిర్వహిస్తుంటే రామోజీరావు విషం చిమ్ముతున్నారు. గత ప్రభుత్వ నిబంధనలనే పాటిస్తున్నాం. 33,000 మె.వా సామర్థ్యంతో ఏపీలో 30కిపైగా పాయింట్లను గుర్తించాం. ఇప్పటికే 13,500 మెగావాట్లకు ఎస్ఐపీబీ, క్యాబినెట్ ఆమోదం లభించింది. ఇంకా 20 వేల మెగావాట్లకు అవకాశం ఉంది. ఆసక్తి ఉంటే రామోజీరావు 10 వేల మెగావాట్లు, చంద్రబాబు 5 వేల మెగావాట్లతో పెట్టుబడులు పెట్టవచ్చు. ఏపీ జెన్‌కో సైతం అప్పర్ సీలేరు, బేతంచర్ల, యాగంటి, వేంపల్లెలో భారీ సామర్థ్యంతో ప్రాజెక్టుల ప్రతిపాదనలు రూపొందించింది.

'ఆపద్బాంధవి' మరింత బలోపేతం

మరిన్ని 108 అంబులెన్స్‌ల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

- ప్రస్తుతం సేవలు అందిస్తున్నవి 768
- కొత్తగా మరో 146 వాహనాల కొనుగోలుకు వైద్యశాఖ కసరత్తు
- ఇందుకు రూ.46 కోట్ల మేర వ్యయం



సాక్షి, అమరావతి : అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసిన నిమిషాల్లో కుయ్.. కుయ్‌మంటూ వచ్చి బాధితులను ఆస్పత్రులకు చేరుస్తూ '108' అంబులెన్స్‌లు ఆపద్బాంధవిలా లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతున్నాయి. ఈ సేవలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కొత్త వాహనాల కొనుగోలుకు చర్యలు చేపడుతోంది. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన '108' సేవలకు సీఎం వైఎస్ జగన్ ఊపిరిలూదిన విషయం తెలిసిందే. ఫలితంగా 2020 జూలై నుంచి ఇప్పటివరకూ ఈ అంబులెన్స్‌లు 10 లక్షలకు పైగా ఎమర్జెన్సీ కేసుల్లో ప్రజలను ఆస్పత్రులకు చేర్చాయి. ఫోన్ చేసిన వెంటనే అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకునే సమయం గణనీయంగా తగ్గింది.

రూ.46 కోట్లతో 146 వాహనాలు

టీడీపీ హయాంలో 440 అంబులెన్స్‌లతో ఏపీలో 108 సేవలు అంతంతమాత్రంగా ఉండేవి. సీఎం వైఎస్ జగన్ వచ్చాక 768 అంబులెన్స్‌లతో వాటి సేవలను విస్తరించారు. తాజాగా.. రూ.46 కోట్లతో మరో 146 కొత్త వాహనాల కొనుగోలుకు వైద్యశాఖ చర్యలు తీసుకుంటోంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుకోసం రూ.107 కోట్లతో 432 కొత్త 104 వాహనాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. కానీ, రాష్ట్రంలో 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండుసార్లు ఒక్కో గ్రామాన్ని 104 మొబైల్ మెడికల్ యూనిట్స్ (ఎంఎంయూ)తో పాటు విలేజ్ క్లినిక్‌లను సందర్శించాలి. ఇప్పటికే ఉన్న 656 '104 ఎంఎంయూ' వాహనాలతో 7,166 విలేజ్ క్లినిక్‌లను సందర్శిస్తున్నారు. మిగిలిన విలేజ్ క్లినిక్‌లలోనూ నెలలో రెండుసార్లు సందర్శించడానికి 260 నూతన 104 వాహనాలు కొనుగోలు చేస్తే సరిపోతుందని వైద్యశాఖ నిర్ణయించింది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

146 కొత్త 108 అంబులెన్స్‌ల కొనుగోలుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చాక వాహనాల కొనుగోలుకు ఏపీఎంఎస్‌డీసీకి సిఫార్సు చేస్తాం. ప్రస్తుతం ఎమర్జెన్సీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలకు కొత్త వాహనాలను కేటాయిస్తాం. అదే విధంగా ప్రస్తుతం 336 పాత వాహనాలున్నాయి. వీటిలో ఎక్కువ కిలోమీటర్లు తిరిగి కండీషన్ సరిగాలేని వాహనాల స్థానంలో కొత్త వాటిని వినియోగించాలనుకుంటున్నాం.

– హరేంధిరప్రసాద్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈఓ

టమాటా రైతుకు దిగుల్లేదిక..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతిసారి మార్కెట్‌లో జోక్యం చేసుకొని, వ్యాపారులతో పోటీపడి ధర పెరిగేలా చేస్తోంది. దీంతో పాటు అదనపు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 'ఆపరేషన్ గ్రీన్స్' ప్రాజెక్టు కింద రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో 20 ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మొదటి దశలో 4 యూనిట్ల నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన యూనిట్లను మార్చి కల్లా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఒక్కో యూనిట్‌ను ఎకరం విస్తీర్ణంలో రూ.3 కోట్ల అంచనాతో ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో గంటకు 1.5 టన్నుల చొప్పున నెలకు 300 టన్నులు, ఏడాదికి 3,600 టన్నుల చొప్పున ప్రాసెస్ చేయనున్నారు.

సార్టింగ్, గ్రేడింగ్, వాషింగ్..

ఒక్కో యూనిట్ పరిధిలో కనీసం 250 టన్నులు నిల్వ చేసేందుకు వీలుగా శీతల గిడ్డంగులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా పండ్లు, కూరగాయలను సార్టింగ్, గ్రేడింగ్, వాషింగ్ చేసి.. అధిక ధరలకు విక్రయించే అవకాశం కలుగనుంది. ఈ రంగంలోని బడా కంపెనీలతో రైతు ఉత్పత్తి దారుల సంఘాలను (ఎఫ్‌పీవో – ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) అనుసంధానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే లీఫ్ అనే కంపెనీతో ఒప్పందం జరిగింది. సాధారణంగా రైతులు తాము పండించిన టమాటాలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మగా వచ్చే ఆదాయంలో రవాణా, కమీషన్ చార్జీల రూపంలో 10–20 శాతం కోల్పోతుంటారు. ఈ యూనిట్ల ఏర్పాటు వల్ల రైతులు ఈ నష్టాన్ని పూడ్చుకోగలుగుతారు. వీటన్నింటి వల్ల మార్కెట్ ధర కంటే 30 శాతం అదనంగా వస్తుంది. దళారుల చేతిలో నష్టపోకుండా అధిక లాభాలను ఆర్జించగలుగుతారు. వీటి నిర్వహణా బాధ్యతలను రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు అప్పగిస్తున్నారు. వచ్చే లాభాలను ఆయా సంఘాల పరిధిలోని రైతులే పంచుకోనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ టమాటా వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ, లారెన్సు డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. క్లీనింగ్, వాషింగ్, గ్రేడింగ్ తదితర పనులను ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ.. మార్కెటింగ్ బాధ్యతలను లారెన్సు డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ నిర్వహించనున్నాయి.

ట్రయల్ రన్ విజయవంతం

ఒక్కో యూనిట్‌ను ఒక్కో ఎఫ్‌పీవోకు అప్పగించనుండగా, మొత్తంగా 20 వేల మంది టమాటా రైతులు లబ్ధి పొందనున్నారు. తొలి దశలో చిత్తూరు జిల్లా అటుకురాళ్లపల్లి, చప్పిడిపల్లె, కమిరెడ్డివారిపల్లితో పాటు అన్నమయ్య జిల్లా తుమ్మనంగుంటలలో 4 యూనిట్లు ఈ నెలాఖరు నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా 3,300 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ఇటీవలే ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. రెండో దశలో అన్నమయ్య జిల్లా చెంబకూర్, పోతపాల్లు, చిన్నమండెం, తలవం, ములకల చెరువు, కంభంవారిపల్లె, బి.కొత్తకోట, కలికిరి, చింతపర్తి, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, చిత్తూరు జిల్లా వీ.కోట, పలమనేరు, పుంగనూరు, రాజ్‌పేట, చెల్దిగనిపల్లి యూనిట్లు మార్చిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దళారుల నుంచి ఉపశమనం

ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా దళారుల చేతిలో నష్టపోకుండా టమాటా రైతులు అధిక లాభాలు ఆర్జించే వీలు కలుగుతుంది. రవాణా, కమిషన్ నష్టాలను పూడ్చుకోవడమే కాకుండా, తమకు గిట్టుబాటైన ధరకు నచ్చిన వారికి అమ్ముకోగలుగుతారు. పైగా నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వీటి నిర్వహణా బాధ్యతను కూడా రైతు సంఘాలకే ఇస్తున్నాం. వచ్చే లాభాలు సంఘాలే పొందనున్నాయి.

– ఎల్.శ్రీధర్‌రెడ్డి, సీఈఓ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత: మంత్రి రోజా

- ఉత్సాహంగా జగనన్న స్వర్ణోత్సవ సంబరాలు



విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న రోజా

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఏపీలోని పలు ప్రాంతాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలు అద్భుతమైనవని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం విశాఖలో ప్రారంభమైన రీజనల్ స్థాయి జగనన్న స్వర్ణోత్సవ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. కొన్ని నృత్యాలను కేవలం ఇటువంటి సంబరాల్లో మాత్రమే చూడగలమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 జోన్లు ఏర్పాటు చేసి జగనన్న స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంబరాల్లో భాగంగా వెంపాడ గురుకుల పాఠశాల విద్యార్థులతో మంత్రి రోజా నృత్యం చేశారు. సంబరాలను విశాఖ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి ప్రారంభించారు.

చెస్ విజేతలకు మంత్రి రోజా అభినందన

సాక్షి, అమరావతి: శ్రీలంకలో జరిగిన 16వ ఆసియా స్కూల్స్ చెస్ చాంపియన్ షిప్–2022లో పతకాలు సాధించిన తిరుపతికి చెందిన అక్కాచెల్లెళ్లు త్రిపురాంబిక, శ్రీగురువర్షిణిని మంగళవారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అభినందించారు.

సాదా బైనామాల క్రమబద్ధీకరణకు సువర్ణావకాశం

సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం

సాక్షి, అమరావతి: సాదా బైనామా భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించిందని సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం తెలిపారు. సాదా బైనామాల క్రమబద్ధీకరణపై నల్సార్ న్యాయ నిపుణులతో రెవెన్యూ అధికారులకు మంగళగిరిలోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిజిష్టర్ కాని దస్తావేజుల (సాదా బైనామా) ద్వారా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి, పట్టాదారు పాసు పుస్తకాలు పొందని రైతులకు మేలు చేయడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని తెలిపారు. 2023 డిసెంబర్ 31 వరకు సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ సాదాబైనామాల క్రమబద్ధీకరణ గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ భూములకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సాదా బైనామాల క్రమబద్ధీకరణకు సంబంధించిన పుస్తకాన్ని అజేయ కల్లం, సిద్ధార్థ జైన్ ఆవిష్కరించారు.

నేటి నుంచి బీఆర్‌ఎస్ ప్రస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రాజకీయాల్లో సత్తా చాటాలనే లక్ష్యంతో ఏర్పాటైన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ ఢిల్లీలోని సర్దార్ పటేల్ మార్గ్‌లో కేంద్ర కార్యాలయాన్ని ఆరంభించనుంది. ఆ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం మధ్యాహ్నం 12.37– 12.47 గంటల మధ్య ప్రారంభించనున్నారు. అక్కడే బీఆర్‌ఎస్ జాతీయ విధానాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో బీఆర్‌ఎస్ జెండాను ఆయన ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి జేడీయూ నేత కుమారస్వామి, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్‌తో పాటు మరికొందరిని ఆహ్వానించినట్టు తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రైతు నేతలను ఆహ్వానించామని చెప్పారు. కాగా, తెలంగాణ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఢిల్లీ చేరుకున్నారు.

జాతీయ విధానం వెల్లడి!

కార్యాలయం ప్రారంభించిన తర్వాత పార్టీ జాతీయ విధానాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటిస్తారని తెలుస్తోంది. నదీ జలాలు, సరిహద్దు వివాదాలు, ఆర్థిక రంగ పురోభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ, విద్యుత్ సంస్కరణలు, విదేశాంగ విధానం, జాతీయ సంస్థల తీరు, సమాఖ్య స్ఫూర్తి, జాతీయ స్థాయిలో పొత్తులు వంటి అంశాలపై కేసీఆర్ తమ విధానాన్ని వెల్లడిస్తారని చెబుతున్నారు. భవిష్యత్ కార్యాచరణ, వివిధ రాష్ట్రాల్లో బహిరంగ సభలకు సంబంధించి సైతం కేసీఆర్ ప్రకటన చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, సోమవారం రాత్రికే ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం వసంత్ విహార్‌లో నిర్మాణంలో ఉన్న బీఆర్‌ఎస్ శాశ్వత కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత సర్దార్ పటేల్ మార్గ్‌లోని తాత్కాలిక కార్యాలయాన్ని కూడా సందర్శించారు. ఆయన వెంట రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, జోగినపల్లి సంతోష్‌కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.



శత్రువో, పగవాడో కాదు- ఒక మనిషిని అతడి సొంత మనస్సే చెడు మార్గంలో ప్రయాణించేలా ప్రలోభ పెడుతుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, డిసెంబర్, 14

ఈ ప్రయాణం నరకప్రాయం!

ప్రయాణమంటే... సుఖవంతంగా సాగాలని కోరుకుంటాం. సుఖంగా, సౌకర్యంగా, సత్వరంగా, సకాలంలో చేరడం కోసమే విమాన ప్రయాణాలను ఎంచుకుంటాం. కానీ, మన దేశంలో ఇప్పుడు అవి నరకప్రాయంగా మారుతున్నాయా? కొండవీటి చేంతాడంత క్యూలు... బోర్డింగ్ కోసం గంటల కొద్దీ నిరీక్షణ... చీకాకుపరిచేటన్ని చెకింగ్‌లు... నిలిచే జాగా లేని రద్దీ... ఎటుచూసినా లగేజ్... ట్రాలీల కొరత... విమానాల జాప్యం... ఇదీ ఇప్పుడు పరిస్థితి. రోజూ 1200 విమానాలతో, ఏటా 6.9 కోట్ల ప్రయాణికులతో దేశంలోకెల్లా బిజీగా ఉండే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయంలో గత వారంగా ఇవే దృశ్యాలు. ఎయిర్‌పోర్ట్ కాస్తా చేపల బజారులా తయారైందంటూ ఫోటోలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. సాక్షాత్తూ పౌర విమానయాన మంత్రి సోమవారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకొని, రద్దీ నివారణ చర్యలపై చర్చించాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా విమానాశ్రాయాల్లోని లోటుపాట్లపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది.

ప్రస్తుతం గంటలో గమ్యం చేరే దేశీయ విమాన ప్రయాణికులు సైతం గడువు కన్నా కనీసం మూడున్నర గంటల ముందే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రిపోర్ట్ చేయాల్సిన దుఃస్థితి. వేరే లగేజ్ లేకుండా, 7 కిలోల హ్యాండ్ బ్యాగేజీ ఒక్కటే తెచ్చుకొమ్మని ఇండిగో లాంటి విమానయాన సంస్థలు సూచి స్తున్న పరిస్థితి. దేశంలోకెల్లా అతి పెద్దదైన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో టీ1, టీ2, టీ3 అని మూడు టెర్మినల్స్ ఉన్నాయి. అంతర్జాతీయ విమాన సర్వీసులతో పాటు కొన్ని దేశీయ సర్వీసులూ టీ3 నుంచే నడు స్తుంటాయి. తాజా పరిణామాలతో రద్దీ ఎక్కువగా ఉండే కీలక సమయాలైన ఉదయం, సాయంత్ర వేళల్లో విమానాల సంఖ్యను తగ్గించాలనే యోచన చేస్తున్నారు. కొన్ని సర్వీసులను టీ3 నుంచి ఇతర టెర్మినల్స్‌కు మార్చాలని భావిస్తున్నారు. అయితే, ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలే. పది రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామంటున్న మంత్రివర్యులు దృష్టి పెట్టాల్సింది శాశ్వత పరిష్కారాలపైన!

ఒక్క ఢిల్లీలోనే కాదు... పుణే, ముంబయ్, బెంగళూరుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. హైదరాబాద్‌లో సైతం మొన్నటిదాకా వేర్వేరుగా ఉన్న జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికుల నిష్క్రమణ మార్గాన్ని ఇటీవల టెర్మినల్ విస్తరణ కోసమంటూ ఒకేచోటకు మార్చారు. అలా ఒకేచోట జనం కేంద్రీకృతమై, ఒత్తిడి పెరిగినట్లు వార్త. ప్రపంచీకరణతో పెరుగుతున్న రద్దీకి తగ్గట్టు కొన్నేళ్ళుగా దేశంలో పలు విమానాశ్రయాల ఆధునికీకరణ సాగింది. తీరా ఢిల్లీ వ్యవహారంతో అవన్నీ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు జరగలేదని అనుమానం కలుగుతోంది. కొత్తగా గోవాలో మోపా వద్ద కట్టిన ఎయిర్ పోర్ట్ యాత్రిక సామర్థ్యం 44 లక్షలే. అది ఇప్పటికే ఉన్న డాబోలిమ్ ఎయిర్‌పోర్ట్ కన్నా తక్కువ సత్తా కావడం విడ్డూరం.

అనేక దేశాల్లో కోవిడ్ నిర్బంధాలు ఎత్తివేసేసరికి దేశీయంగా, అంతర్జాతీయంగా కసికొద్దీ ప్రయాణాలు చేయడం పెరిగింది. ఇబ్బడిముబ్బడైన ఈ జనంతో ఎయిర్‌పోర్టుల్లో, ఎయిర్‌లైన్స్‌లో ఇప్పుడున్న వసతులపై ఒత్తిడి అధికమైంది. గత ఆదివారం ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచే 4.27 లక్షల మందికి పైగా ప్రయాణించారనేది పరిస్థితికి చిరు సూచన. కోవిడ్ నిబంధనలు ఎత్తేశాక ఈ ఏడాది జూలైలో యూరప్‌లోని పలు విమానాశ్రయాల్లో ఇలాంటి గందరగోళమే నెలకొంది. లండన్‌లోని ప్రసిద్ధ హీత్రూ విమానాశ్రయంలోనూ ఇదే కథ. కరోనా కాలంలో విస్తరణ ప్రణాళిక లకు బ్రేకులు పడ్డ విమానాశ్రయాలు ఇప్పుడు మళ్ళీ ఆ పనులను పట్టాలెక్కించాల్సి ఉంది.

ప్రయాణికుల చెకింగ్ పద్ధతి ప్రకారం సాగకపోవడం, విమానాశ్రయ అధికారుల్లో అలసత్వం లాంటి కారణాలతో ఢిల్లీలో గందరగోళం నెలకొంది. ఎయిర్‌లైన్స్ చెక్-ఇన్ కౌంటర్లలో సిబ్బంది లేకపోవడం, ఉన్నా అరకొరగా ఉండడం రద్దీకి దారి తీస్తోంది. సెక్యూరిటీ చెక్ చేయాల్సిన నిపుణు లైన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది కూడా తక్కువున్నారు. సీఐఎస్ఎఫ్ ఉద్యోగాలను 3 వేలకు పైగా రద్దు చేసి, వాటి స్థానంలో అనుభవం లేని 2 వేల కన్నా తక్కువ ప్రైవేట్ భద్రతా సిబ్బందిని పెట్టడం లాంటి స్వీయ తప్పిదాలు సవాలక్ష. వీటిని తక్షణం సరిదిద్దాలి. బ్యాగేజ్, బిల్లింగ్ నుంచి బోర్డింగ్ దాకా అన్నిటా 5జీ సహా ఆధునిక సాంకేతికతను ఆశ్రయించడం ఓ మార్గం. అంతర్జాతీయ ప్రయాణం చేసి వస్తున్నవారి ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ ఇప్పటికీ గంటన్నర నుంచి రెండు గంటలు పడుతోంది. ప్రస్తుతానికి విమానంలోనే వివరాలు నింపే పద్ధతి పెడతా మంటున్నా, డిజిటలీకరణ మంచి పరిష్కారం.

సంవత్సరాంతపు సెలవులు, పండగలతో రానున్నది ప్రయాణాల కాలం. దాంతో, రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దిగజారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు కావాల్సింది సరైన వ్యూహరచన, ప్రణాళికాబద్ధంగా ప్రాథమిక వసతులు. కౌంటర్లనూ, సిబ్బందినీ పెంచాలి. స్మార్ట్ సిటీల్లా స్మార్ట్ ఎయిర్‌పోర్ట్‌లు కావాలి. ప్రపంచశ్రేణి టెర్మినల్స్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ఢిల్లీ, హైదరాబాద్, ముంబయ్ - ఇలా ఊరికో రకం కాక అన్నిచోట్లా ఒకే ప్రామాణిక సెక్యూరిటీ ప్రోటోకాల్ తేవాలి. ముఖం చూసి గుర్తించే బయోమెట్రిక్ పద్ధతే అదే బోర్డింగ్ పాస్‌గా 'డిజి యాత్ర' విధానాన్ని ఇటీవలే 3 ఎయిర్‌పోర్టుల్లో తెచ్చారు. మొక్కుబడిగా కాక దాన్ని అన్నిచోట్లా విస్తరించడం, అవగాహన పెంచడం అవసరం. ప్రపంచంలోని 10 రద్దీ విమానాశ్రయాల్లో ఢిల్లీ, ముంబయ్ చేరనున్న వేళ ఇలాంటి క్షేత్రస్థాయి అంశాలపై శ్రద్ధ కీలకం. అలసత్వం వహిస్తే, పదేపదే ఢిల్లీ కథే!



సోషల్ మీడియా

అయినవాళ్లకు ఆకుల్లో!



ఎంత తలవంపు! ఈ ప్రభుత్వం తన ఆప్తులకు ప్రజాధనాన్ని వడ్డిస్తోంది. గత నాలుగేళ్లలో 2021-22 వరకు బ్యాంకులు వదిలేసు కున్న భారీ సొమ్ము - రూ.8,48,186 కోట్లు! మోదీ ప్రభుత్వం తన స్నేహితులకు బహుమతిగా ఇచ్చిన ఈ డబ్బుతో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మాణ మయ్యేవి? దోపిడి!

- సీతారాం యేచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

తగని ప్రవర్తన



ఆర్థిక వ్యవస్థ మీద ఏ ప్రతిపక్ష నాయకుడు ఎప్పుడు ఏ ప్రశ్న అడిగినా నిర్మలా సీతా రామన్ వాళ్లను దేశ శత్రువులతో పోల్చుతారా? పార్లమెంటులో జరిగే చర్చను ఆర్థిక మంత్రి అణిచే ప్రయత్నం దిగ్భ్రాంతికరం.

- అజయ్ కామత్, ఆప్తాల్మాలజిస్ట్

పగవాడికి కూడా...



నా జీవితంలో ఎన్నో ఘోరమైన అనుభవా లున్నాయి. వాటిల్లో కూడా ఏ సందేహమూ లేకుండా అత్యంత ఘోరమైన అనుభవం - డిప్రెషన్. ఏ జాడా లేకుండా మన జీవితంలోని ఏళ్లు మాయమవుతాయి. మన ఉనికికి సంబంధించిన మసక జ్ఞాపకం మాత్రమే మిగిలిపోతుంది.

- దారాబ్ ఫారూఖీ, రచయిత

ఇలాగా నిలబడటం?



ఎవరికీ అక్కర్లేని బుల్లెట్ ట్రెయిన్ కోసం ఇరవై వేలకు పైగా చెట్లను నరికేశారు. ఇక నికోబార్‌లో అదేదో ఎవరికీ అక్కర్లేని దాన్ని నిర్మించడానికి 8.5 లక్షల చెట్లను నరకనున్నారు. మళ్లీ ఈ కపటులు వాతావరణ సదస్సుల్లో పర్యావరణం కోసం నిలబడతామని వాగ్దానాలు చేస్తుంటారు.

- వీణా బక్షి, ఫిలింమేకర్

ఎలా అయిపోయింది!



మొదట్లో 'ఇన్‌స్టా రీల్స్' బాలీవుడ్ పాటలకు చెడ్డ అనుకరణల్లా ఉండేవి. కానీ ఇప్పుడు బాలీవుడ్ పాటలు ఇన్‌స్టా రీల్స్‌కు చెడ్డ అనుకరణల్లా కనబడుతున్నాయి. - వివేక్ అగ్నిహోత్రి, దర్శకుడు

రామోజీ.. అస్మదీయ తకధిమి!!

ప్రాజెక్టులకు టెండర్లు పిలవలేదంటూ విచిత్రమైన వాదన

- ఏపీ జెన్‌కోకు ప్రాజెక్టులివ్వటం లేదంటూ 'ఈనాడు' అబద్ధాలు
- వివిధ ప్రాంతాల్లో 5000 మెగావాట్ల ప్రాజెక్టులు చేపడుతున్న ఏపీ జెన్‌కో
- ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకూ 1,650 మెగావాట్లు
- భూముల రేటు బాబు హయాంలో ఎకరా రూ.2.5 లక్షలు.. ఇపుడది 5 లక్షలు
- గ్రీన్ రాయల్టీ ఏటా మెగావాట్‌కు లక్ష
- ఇక రైతులు భూములిస్తే వారికి ఎకరాకు సంవత్సరానికి రూ.30 వేలు
- 14,650 మెగావాట్లకు అనుమతి; దీంతో 58,600 మందికి ఉద్యోగాలు

ఇన్ని ప్రయోజనాలున్నా వదిలిపెట్టి... అస్మదీయులంటూ విషపు రాతలు



This has reference to the above and subject to the provisions of IFA, we confirm that manufacturing capacity, extent of integration and Cumulative PLI price quoted by your company in response to the application submitted by your company is accepted and this letter of award is being issued with the following details:

Sl. No.	Description	Value
1.	Manufacturing Capacity to be installed	4000 MW
2.	Eligible Capacity (for Claiming PLI)	2000 MW



(as per the manufacturing capacity allocated). It may be noted that Performance Bank Guarantee as per format given in Annexure 3 of IFA shall be submitted from any of the Scheduled Commercial Banks approved by RBI from time to time within 15 days from the date of issue of LoA by IREDA. Additionally, the PBG shall have validity till the period ending one year from the date of scheduled commissioning of the manufacturing unit. The PBG submitted by your company shall be replaced by the SPV(on formation of SPV) within a

పీఎల్ఐ కోసం సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీదారుగా షిర్డిసాయి సంస్థను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇరెడా జారీ చేసిన అనుమతి పత్రం

కంపెనీలకు ప్రాజెక్టులెలా ఇవ్వాలో రామోజీ చెబుతాడు!
ఆ కంపెనీలతో ఆయన చెప్పినట్టే ఒప్పందాలు చేసుకోవాలట!
వాళ్ల పెట్టుబడి, వాళ్లకిచ్చే రాయితీలు...
అన్నిటినీ ఆయన నిర్దేశించినట్లే ఉండాలట!

అలా చేయకపోతే..?

ఒక కంపెనీ వచ్చినా ఆ కంపెనీ అస్మదీయులదేనంటూ ముద్రవేస్తాడు.
ఒక కంపెనీ దివాలాతీసి వెళ్లిపోతే... ప్రభుత్వమే వెళ్లగొట్టిందని ప్రచారం చేస్తాడు.
రాష్ట్రంలో పరిశ్రమలకు చీకటి రోజులు దాపురించాయంటాడు.

ఎందుకంటే ఆయన చేతిలో పత్రిక ఉంది.
ఆయన రాతలు... ఆయనిష్టం.
కానీ ఇక్కడున్నది ఆయన చెప్పినట్టల్లా ఆడే నారా చంద్రబాబునాయుడి ప్రభుత్వం కాదే..?
ఈ ప్రభుత్వానికి తన ప్రాధాన్యాలేంటో తెలుసు!.
వాటి కోసం ఎలా పనిచేయాలో తెలుసు!
అందుకే ఈ ప్రభుత్వాధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అస్మదీయులే. ఎందుకంటే ఆయన ప్రజలందరినీ 'నా వాళ్లే' అనుకుంటారు కాబట్టి!!.

ఏది నిజం?

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయండంటూ ఎవరైనా టెండర్లు పిలుస్తారా రామోజీరావ్? అసలు అలా టెండర్లు పిలవటం ఏ రాష్ట్రంలోనైనా... ఎప్పుడైనా చూశామా? ప్రభుత్వం కొన్ని పరిశ్రమలు పెట్టాలని అనుకుంటే... వాటికి సంబంధించి ప్రతిపాదనలు ఆహ్వానిస్తుంది. అలా వచ్చిన వాటి నుంచి.. వాటి సామర్థ్యం, గత అనుభవం, పేరు ప్రఖ్యాతుల ఆధారంగా ఎంపిక చేస్తుంది. ఇదీ పద్ధతి. కానీ... 'సన్నిహితులకే ఎనర్జీ' అంటూ మంగళవారం 'ఈనాడు' ఏడ్చిన ఏడ్పులో రవ్వంతైనా నిజముందా? ఆరు కాలాల కడుపుమంట తప్ప అసలేముంది అందులో? ప్రతి అక్షరం అబద్ధాలు పేర్చుకుంటూ రాసిన విషపు రాతల్లో అబద్ధాల గుట్టును విప్పే... 'ఏది నిజం?' ఇదిగో...

మరీ అన్ని అబద్ధాలు అచ్చేయటానికి కొంచెమైనా విలువలంటూ అడ్డురావాలి కదా? ఎందుకంటే రాష్ట్రంలో ఇప్పటిదాకా 33,240 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను నిర్మించడానికి వీలైన ప్రాంతాలను గుర్తించి, నివేదికలు తయారు చేయించింది ప్రభుత్వం. మరో 10వేల మెగావాట్లకు కూడా ప్రాంతాలను గుర్తించింది. వాటన్నిటినీ నెడ్‌క్యాప్ వెబ్‌సైట్లో ఓపెన్‌గా ఉంచింది. తగిన ప్రతిపాదనతో ఎవరైనా ముందుకు రావచ్చు. ఈ అవకాశాలను వివరించడానికే ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ దావోస్‌కు వెళ్లారు. అక్కడ ఇవన్నీ వివరించిన మీదట... అదానీ, అరబిందో, షిర్డీ సాయి, అస్థా, ఇండో సోలార్, గ్రీన్‌కో సంస్థలు 14,650 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల కోసం అక్కడే ఒప్పందాలు చేసుకున్నాయి. ఇంకా 30వేల మెగావాట్లకు సంబంధించిన ప్రాజెక్టులు ఓపెన్‌గానే ఉన్నాయి. ఎవరైనా రావచ్చు. ఆఖరికి రామోజీరావైనా... ఆయన అస్మదీయులు రాధాకృష్ణ, చంద్రబాబు, టీవీ 5 నాయుడు... ఎవరైనా!!.

ఇవేమైనా చిన్న సంస్థలా?

అదానీ గ్రూపు ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థల్లో ఒకటి. అరబిందో ఫార్మా రూ.2,500 కోట్ల వార్షిక లాభంతో దేశంలో టాప్-2 ఫార్మా కంపెనీ. షిర్డీ సాయి విషయానికొస్తే... దేశీయంగా ఉత్పత్తిని పెంచి.. చైనా దిగుమతులను తగ్గించడానికి కేంద్రం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) కింద భారీ ప్రాజెక్టును దక్కించుకుంది. అది కూడా... అదానీ, జిందాల్, రిలయన్స్ వంటి సంస్థలతో పోటీపడి !!. రూ.10వేల కోట్లతో రాయాయపట్నంలో సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తోందీ సంస్థ. ఆ పరిశ్రమ అవసరాల కోసం (క్యాప్టివ్) 1,200 మెగావాట్ల ప్రాజెక్టుతో పాటు, మరో 900 మెగావాట్ల పీఎస్‌పీని చేపడుతోంది. కడప జిల్లాలో ఈ సంస్థకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ల ప్లాంటు దేశంలోని అతిపెద్ద పరిశ్రమల్లో ఒకటి. గ్రీన్‌కో సంస్థ చంద్రబాబు హయాంలోనే పీఎస్‌పీ ప్రాజెక్టును చేపట్టింది. ఇండోసోలార్, అస్థా గ్రీన్ సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో ఉన్నాయి. అంటే... అరబిందో, షిర్డీ సాయి సంస్థల ప్రమోటర్లకు పేరు చివర 'రెడ్డి' అని ఉంటే.... వాళ్లు అస్మదీయులైపోతారా? ఈ కంపెనీలకున్న అర్హతలేవీ చూడాల్సిన పనిలేదా? ఎందుకీ దుర్మార్గపు రాతలు? మరి ఇదే అరబిందో ఫార్మాతో కలిసి తన తమ్ముడు భాగస్వామిగా 'ఆంధ్రా ఆర్గానిక్స్' సంస్థను గతంలో చంద్రబాబే స్వయంగా పెట్టించాడు. అప్పుడేమనుకోవాలి? అది ఎవరి అస్మదీయుల సంస్థ? షిర్డీ సాయి సంస్థకు అంతటి భారీ ప్రాజెక్టును పీఎల్ఐ కింద కేంద్రం ఇచ్చింది కాబట్టి ఇది కేంద్రానికీ అస్మదీయ సంస్థేనా? ఇంకా ఎన్నాళ్లీ దగుల్బాజీ రాతలు?

ఎన్‌టీపీసీ, జెన్‌కో మీ కళ్లకు కనిపించలేదా?

ప్రభుత్వ సంస్థలైన ఎన్‌టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీ, జెన్‌కోలకు ప్లాంట్లు ఇవ్వలేదని, అంతా ప్రయివేటు వ్యక్తులకే కేటాయిస్తున్నారంటూ మరో దారుణమైన అబద్ధాన్ని వండేసింది 'ఈనాడు'. మరి కర్నూలు జిల్లాలోని తీగలేరు వద్ద 1,650 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఎన్‌టీపీసీ సహా వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇప్పటికే కేటాయించడం రామోజీకి కనిపించదా? ఏపీ జెన్‌కోకు ప్రాధాన్యం ఇవ్వటం లేదని మరో అబద్ధం కూడా అలవోకగా రాసేశారు. కానీ ఇప్పటికే సీలేరు వద్ద 1,350 మెగావాట్ల ప్రాజెక్టును అమలు చేస్తున్నది ఏపీ జెన్‌కో కాదా? ఎగువ సీలేరులో మరో 1,350 మె.వా., నంద్యాల జిల్లా బేతంచెర్లలో 500 మె.వా., యాగంటిలో 1,000 మె.వా., అన్నమయ్య జిల్లా వేంపల్లిలో 800 మె.వా.... ఇలా 5,000 మెగావాట్లు ఏపీ జెన్‌కో చేపట్టడానికి గుర్తించారు. ఈ వాస్తవాలెందుకు రాయరు? ఏపీ జెన్‌కోకు ఒక్క పీఎస్‌పీ కూడా ఇవ్వనట్లు ఎందుకీ దరిద్రపు రాతలు? ఎవరిని మోసం చేయటానికి? ఏ సంస్థయినా దాని సామర్థ్యం మేరకు అది ప్రాజెక్టులు చేపడుతుంది. అది కూడా రామోజీయే నిర్ణయిస్తే ఎలా?

భూములనేమైనా ఉచితంగా ఇస్తారా?

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను, నీటిని ఇస్తూ కూడా ప్రభుత్వం వారి నుంచి ఏమీ తీసుకోవటం లేదంటూ పనికిమాలిన రాతలు రాస్తున్న ఇలాంటి పత్రికల్ని ఏం చేయాలి? అసలు ఏ కంపెనీకైనా ప్రభుత్వ భూముల్ని కేటాయిస్తే ఛార్జీలు తీసుకోరా? చంద్రబాబు నాయుడి హయాంలో గ్రీన్‌కో సంస్థకు ఎకరానికి రూ.2.5 లక్షలు చొప్పున తీసుకుంటే.. ఈ ప్రభుత్వం దాన్ని రెట్టింపు చేసి... ఎకరా రూ.5 లక్షలుగా నిర్ణయించింది. పైపెచ్చు గ్రీన్ డెవలప్‌మెంట్ ఛార్జీల కింద మెగావాట్‌కు సంవత్సరానికి తొలి పాతికేళ్లు రూ.లక్ష, ఆ తరువాతి పాతికేళ్లు రూ.2 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రాజెక్టు కోసం తెచ్చే రుణాలను కంపెనీలు 25 ఏళ్లలో చెల్లిస్తాయి కనక... తదుపరి 25 ఏళ్లు ఫీజు ఎక్కువగా నిర్ణయించారు. అదే ఎంఎన్ఆర్ఈ నిబంధనల కింద యూనిట్‌కు 2పైసల చొప్పున వసూలు చేస్తే ఎంతవుతుందో తెలుసా? సంవత్సరానికి మెగావాట్‌కు రూ.43,800. మరి దీనికన్నా రూ.లక్ష/రూ.2 లక్షలు ఎక్కువే కదా? ఇవేవీ 'ఈనాడు'కు కనిపించవా?

ఎంఎస్ఎంఈలను పట్టించుకున్నారా?

లక్షల మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్ని (ఎంఎస్ఎంఈ) చంద్రబాబు ఏనాడూ పట్టించుకున్నది లేదు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్‌లు) సమయానికిస్తేనే ఇవి బతికి బట్టకడతాయని తెలిసి కూడా... ఆ ప్రయత్నం చేస్తే ఒట్టు. నిర్లక్ష్యంతో వీటికి సమాధికట్టేశారు. ఒక్కో ఎంఎస్ఎంఈలో సగటున 10 మంది ఉపాధి పొందుతున్నారనుకున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.33 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలలో 23 లక్షలకు పైగా ఉపాధి పొందుతున్నారు. అంత ముఖ్యమైన రంగాన్ని బాబు చిదిమేసినా... రామోజీ పెన్నెత్తితే ఒట్టు. కోవిడ్ కుంగదీసినా సరే... ఎంఎస్ఎంఈ రంగాన్ని ఈ ప్రభుత్వం నభూతో.. అన్న రీతిన ఆదుకుంది. ప్రోత్సాహకాలను సమయానికి ఇవ్వటమే కాకుండా... అలా ఇచ్చే పటిష్ఠమైన వ్యవస్థను తీసుకొచ్చింది. అందుకే ఈ మూడున్నరేళ్లలో కొత్తగా 1,08,206 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటయ్యాయి. రూ.20,537 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయిన ఈ యూనిట్ల ద్వారా 10.04 లక్షల మందికి ఉపాధి కలిగిన విషయాన్ని రాయరెందుకు రామోజీ? ఎప్పుడూ ఉద్యోగాల్లేవని, ఉన్నవి ఊడిపోతున్నాయని అబద్ధాలు రాయటం తప్ప ఇంత మందికి ఉపాధి కల్పించిన వాస్తవాన్ని ప్రస్తావించరెందుకు? ఇంకెప్పుడు మారతారు?

చంద్రబాబు హయాంలో భూముల రేట్లు తక్కువైనా... గ్రీన్ ఎనర్జీ చార్జీలనేవే పైసా కూడా లేకపోయినా... ఒక్క అక్షరం కూడా రాయని రామోజీరావు ఇప్పుడు చెలరేగిపోతున్నారెందుకు? అసలిలాంటి రోత రాతల్ని పట్టించుకోవాల్సిన అవసరం ఉందా?

రెవెన్యూపైనా తప్పుడు రాతలే...

ఈ ప్రాజెక్టుల వల్ల ప్రభుత్వానికొచ్చే రెవెన్యూ పెద్దగా ఉండదంటూ నోటికొచ్చిన లెక్కలతో 'ఈనాడు' చెలరేగిపోయింది. కానీ ప్రస్తుతానికి అనుమతించిన 14,650 మెగావాట్ల ప్రాజెక్టుల తోనే... కేవలం జీఎస్‌టీ రూపంలోనే ప్రభుత్వానికి రూ.3,956 కోట్ల ఆదాయం రానుంది. ఇవికాక భవిష్యత్తులో గ్రీన్ డెవలప్‌మెంట్ ఛార్జీల కింద రూ.8,058 కోట్ల ఆదాయం వస్తుంది. వీటన్నిటి కన్నా ముఖ్యంగా కేవలం ఈ ప్రాజెక్టుల వల్లే 58,600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరకనుంది. పైపెచ్చు ఈ ప్రాజెక్టులు తమ సొంత అవసరాల కోసం మరో 7వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వాటిద్వారా మరో రూ.3,640 కోట్ల రెవెన్యూతో పాటు కొన్ని వేల మందికి ఉపాధి దొరుకుతుంది. వీటిని ప్రస్తావించకుండా అవాస్తవాలు రాస్తున్న రామోజీని ఏమనాలి?

'విద్యుత్ రేటు'పై ఒప్పందం సాధ్యమేనా?

ఇక ఈ కంపెనీలు ఉత్పత్తి చేసే విద్యుత్తులో రాష్ట్రానికేమీ రాదని, ఇవి బయట విక్రయిస్తే రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదని చేతికొచ్చినట్లు రాసిపారేశారు రామోజీ. ఈ మేరకు రాష్ట్రం ఎలాంటి ఒప్పందం చేసుకోకపోవటం అన్యాయమని కూడా సూత్రీకరించారు. నిజానికివి ప్రయివేటు ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టులు పనిచేసేదే... డిమాండ్ -సప్లయ్ సూత్రానికి అనుగుణంగా. అంటే... ఈ ప్రాజెక్టులకు ఎగువన- దిగువన రెండు రిజర్వాయర్లుంటాయి. పగటిపూట డిమాండ్ తక్కువుంటుంది కనక సోలార్ లేదా విండ్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ... ఆ విద్యుత్తు సాయంతో నీటిని దిగువ నుంచి ఎగువన ఉండే రిజర్వాయర్లోకి పంపిస్తారు. ఇక సోలార్ అందుబాటులో లేనపుడు, డిమాండ్ పీక్‌లో ఉన్నపుడు ఎగువ రిజర్వాయరు నుంచి దిగువకు నీటిని పంపించటం ద్వారా సహజంగా విద్యుదుత్పత్తి చేస్తారు. అది పీక్ సమయం కనక అప్పుడు ఛార్జీలు కాస్త ఎక్కువ ఉంటాయి. అలా ఛార్జీలు ఎక్కువ వస్తాయి కనకే ఈ కంపెనీలు మనగలుగుతాయి. అందుకే ప్రభుత్వం వాటితో మొదటి ప్రాధాన్యత తమకే ఇవ్వాలని ఒప్పందం చేసుకుంది. రేటు అనేది ఆ సమయంలో మార్కెట్ డిమాండ్‌ను బట్టి ఉంటుంది కనక అది మార్కెట్ చేతుల్లోనే ఉంటుంది. ఈ వాస్తవం రామోజీరావుకు తెలియందేమీ కాదు. కానీ... ప్రభుత్వంపై బురద జల్లటమనే ఎజెండాలో ఇదీ ఒక భాగం కనక... నిజాలు రాయరు.

రైతులకు ఎంత లాభమో చెప్పరేం?

రైతులు గనక సోలార్ ప్రాజెక్టులకు భూములిస్తే వారికి ఎకరాకు సంవత్సరానికి రూ.30వేల చొప్పున కంపెనీలు లీజు మొత్తాన్ని చెల్లిస్తాయి. ఇందులో భాగంగానే ఒకేచోట 200, 300 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు పెట్టడానికి వీలుగా రైతులంతా కలిసి 1500 ఎకరాల వరకూ ఇవ్వగలిగే పరిస్థితి ఉంటే... ప్రభుత్వమే లీజుకు తీసుకుంటుందని ముఖ్యమంత్రి జగన్ నేరుగా ప్రకటించారు. మరి ఆ లీజుకిచ్చేది అస్మదీయులా? తీసుకునేది అస్మదీయులా? రైతుల కొచ్చే లాభం గురించి ఎందుకు రాయరు? సాగుకు పనికిరాని భూములున్న చోట మూడెకరాలున్న రైతుకు కూడా సంవత్సరానికి రూ.లక్ష వరకూ వచ్చే అవకాశం ఉంది కదా? దీన్ని రైతులంతా స్వాగతిస్తుంటే ఆ విషయమెందుకు రాయరు రామోజీ?

డేటా సెంటర్ పోలేదు... మరిన్ని పెట్టుబడులొచ్చాయి

అదానీ డేటా సెంటర్ తరలిపోతోందని, తాము కష్టపడి తెచ్చిన ప్రాజెక్టు వెళ్లిపోతోందని గగ్గోలు పెట్టింది చంద్రబాబు నాయుడైతే... దానికి సన్నాయి నొక్కులు నొక్కుతూ అదానీ డేటా సెంటర్ వెళ్లిపోతే ఎంత నష్టమో ఆనాడు రాసింది 'ఈనాడే'. నిజానికి డేటా సెంటర్ ఎక్కడికీ పోలేదు. దానికి కేటాయించిన భూములు తగ్గాయంతే. మరి అదే అదానీ సంస్థ ఆ డేటా సెంటర్‌కు అదనంగా ఇపుడు గ్రీన్ ఎనర్జీలో, పోర్టుల్లో దూకుడుగా పెట్టుబడులు పెడుతుంటే ఎందుకీ ఏడుపు? మీ మనవరాలి వియ్యంకులు కాబట్టి మీరు అమర రాజాను వెనకేసుకుంటూ వస్తున్నారేమో!!. కానీ అమరరాజా సంస్థకు జరిగిన అన్యాయమేంటి? కాలుష్యం నిబంధనలను మించి ఉన్నపుడు... వాటిని సరిచేసుకోవాలంటూ నోటీసులివ్వటం తప్పా? మీ బంధువుల సంస్థలైతే మాత్రం నోటీసులివ్వకూడదా? ఆ సంస్థనేమీ అక్కడి నుంచి వెళ్లిపోమనలేదు కదా? నోటీసులిచ్చినపుడు ఆ నోటీసుల్లో పేర్కొన్న అంశాలను సరిచేసుకుంటే చాలు కదా? మరి అదే అమరరాజా ఇప్పుడు అదే చిత్తూరు జిల్లాలో మరో 250 కోట్ల రూపాయలతో కొత్త ప్లాంటు ఏర్పాటు చేస్తానని ప్రకటించింది కదా? అదెందుకు ప్రస్తావించరు రామోజీ?

అలాంటి సలహాలు ఏనాడూ ఇవ్వరా?

'ఈనాడు' ఏనాడూ మంచి సలహాలివ్వదా? రాష్ట్రానికి అంత సత్తా లేదని తెలిసి కూడా... అంత ఖర్చును భరించలేమని తెలిసి కూడా అమరావతి పేరిట లక్షల కోట్ల రాజధానిని గ్రాఫిక్స్ సాయంతో చంద్రబాబు ప్లాన్ చేసినపుడు ఏమయింది రామోజీ మీ విజ్ఞత? విభజన కష్టాల్లో ఇరుక్కున్న ఆంధ్రకు అంతటి సత్తా లేదని, ఆచరణ సాధ్యమైన యోచన చెయ్యాలని మీ పత్రికా ముఖంగా గానీ... మీ ప్రయివేటు సంభాషణల్లో గానీ చంద్రబాబుకు ఎందుకు చెప్పలేదు? నాలుగైదు వేల కోట్లు ఖర్చు చేస్తే విశాఖపట్నం చక్కని రాజధానిగా మారి ఈ రాష్ట్రానికి వెన్నుదన్నుగా ఉంటుందని మీకు అనిపించలేదా? అలా అనిపించని మీదీ ఒక పత్రికేనా? అదీ ఒక ప్రభుత్వమేనా?

మూడేళ్లుగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్-1

ఏ పనైనా ఎంత బాగా చేశామన్నదానికి ఫలితాలే గీటురాయి. చంద్రబాబు ఐదేళ్ల పాలన స్వర్ణయుగం అనేది రామోజీరావు నిత్యం అచ్చేసే కథనాల సారాంశం. ఇక చంద్రబాబైతే స్వర్ణయుగాన్ని మించి... అంటుంటారు. మరి ఫలితమో? చూద్దాం.

పరిశ్రమలకు ఈ రాష్ట్రం ఎంత స్నేహపూర్వకమైన స్వాగతమిస్తోందన్నది రామోజీ, చంద్రబాబు చెప్పనే చెప్పరు. కానీ సులభతర వాణిజ్య విధానాన్ని అవలంబించే రాష్ట్రాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) గడిచిన మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ నెంబర్-1గా నిలుస్తూ వస్తోంది. ఇక్కడ పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం లేకపోతే... పరిశ్రమలు తాము సంతోషంగా ఉన్నామని చెప్పకపోతే ఈ ర్యాంకు ఎందుకొస్తుంది? మూడేళ్లుగా దేశంలో ఏ రాష్ట్రానికీ దక్కని ఈ హోదా మన రాష్ట్రానికే ఎందుకు దక్కుతోంది? అర నిమిషంలో తనను ముఖ్యమంత్రి ఒప్పించారంటూ... 6 నెలల్లో ఆలోచన నుంచి అనుమతులన్నీ వచ్చి, భూ కేటాయింపు పూర్తయి శంకుస్థాపన చేయగలిగామని సాక్షాత్తూ టెక్ మహీంద్రా సీఈఓ గుర్నానీ ప్రశంసించారు. ఆయన తన కుమారుడి బయో ఇథనాల్ ప్లాంటు 'అస్సాగో'కు ఏపీనే ఎంచుకున్నారు. ఏపీలో పరిశ్రమలకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని చెప్పింది ఏకంగా ఐటీసీ సీఈఓ సంజీవ్ పురి. ఏపీలో అతిపెద్ద స్పైసెస్ ప్రాసెస్ ప్లాంట్‌ను గత నెల్లోనే ఆయన ప్రారంభించారు. ఇక ఆదిత్యబిర్లా గ్రూపు వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్స్ తయారీ యూనిట్‌కు భూమి పూజ చేసిన రెండు నెలలకే తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్‌ను ప్రారంభించింది. తమ గ్రూపు సంస్థలకు ఏపీ కీలకమని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే సత్తా రాష్ట్రానికి ఉందని ఆ గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లాయే చెప్పారు. 'రావాలి జగన్... కావాలి జగన్' అనే నినాదం ఇప్పుడు 'జగన్ వచ్చారు... అభివృద్ధి తెచ్చారు' అనేట్లుగా మారిందనేది డిక్సన్ టెక్నాలజీస్ ప్రెసిడెంట్ పంకజ్ శర్మ ప్రశంస. ఎలక్ట్రానిక్ ఉపకరణాల ఉత్పత్తి కేంద్రానికి కొప్పర్తి ఈఎంసీలో భూమి పూజ చేశారాయన. ఇక రూ.600 కోట్లు పెట్టుబడి పెడదామనుకున్నామని, దాన్నిపుడు రూ.2,600 కోట్లకు పెంచుతున్నామని చెప్పింది సాక్షాత్తూ సెంచురీ ప్లైవుడ్ చైర్మన్ సజ్జన్ భజాంక. తమిళనాడులో యూనిట్ ఏర్పాటు చేయాలనుకున్నా... రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు కూడా ఆయనే చెప్పారు. ఇక తొమ్మిది రాష్ట్రాల్లో సిమెంటు ప్లాంట్లున్న శ్రీసిమెంట్... తొలిసారి ఏపీలో అడుగుపెడదామని నిర్ణయించుకున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని శ్రీసిమెంట్ ఎండీ హరి మోహన్ బంగూర్ కలిశాకే. గుంటూరులో రూ.1,500 కోట్లతో ప్లాంటును రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించింది కంపెనీ. మరి ఒక్క కంపెనీ కూడా రాలేదని... ఇప్పటికే ఉన్నవి కూడా వెళ్లిపోతున్నాయని విష ప్రచారమెందుకు? అసలు ఏపీ నుంచి ఇటీవలి కాలంలో వెళ్లిపోయిన కంపెనీ పేరు ఒక్కటి చెప్పండి రామోజీ? కొత్తగా నాలుగు పోర్టులు తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు రావటంతో పాటు ఆక్వా యూనివర్సిటీ సైతం వచ్చాయంటే అది ప్రభుత్వ చిత్తశుద్ధి వల్ల కాదా? కడప, కర్నూలు ఎయిర్‌పోర్టులతో పాటు ఎన్నో బాలారిష్టాల్లో చిక్కుకున్న భోగాపురం ఎయిర్‌పోర్టు కూడా ఒక కొలిక్కి వస్తున్నదంటే అది రాష్ట్ర ప్రభుత్వ కృషివల్లనే కదా? రాష్ట్రంలో టైర్-1 నగరాలు లేవు కాబట్టి ఆసుపత్రుల్లో టెర్షియరీ కేర్ (స్పెషలిస్టు సేవలు) తక్కువే. అయినా సరే ప్రభుత్వం ఏకంగా 17 మెడికల్ కాలేజీలను తెస్తున్నదంటే ఇది ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనం కాదా?


అన్నమయ్య జిల్లా ఉడుంవారిపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ బావుటా అందజేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


పార్వతీపురం మన్యం జిల్లా పొట్లిలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


ప్రకాశం జిల్లా గిద్దలూరులో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


కోనసీమ జిల్లా రాజోలులో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు సమస్య చెప్పుకుంటున్న మహిళ

మన ప్రభుత్వం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నాలుగు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,466 మంది స్వామిని దర్శించుకోగా, 26,174 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ కానుకల రూపంలో రూ.3.27 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని వారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3గంటల సమయం పడుతోంది.

ఏఎన్‌యూకి హరిత వర్సిటీ ర్యాంకు

- జారీ చేసిన ఇండోనేషియా యూనివర్సిటీ
- ఏపీలో మొదటి ర్యాంకు, జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు


నాగకిశోర్‌ను అభినందిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హరిత యూనివర్సిటీ ర్యాంకు పొందింది. యూనివర్సిటీ ఆఫ్ ఇండోనేషియా ప్రపంచ వ్యాప్తంగా యూనివర్సిటీలకు సోమవారం రాత్రి 'యూఐ గ్రీన్ మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2022' పేరుతో ర్యాంకులు జారీ చేసింది. వీటిలో ఏఎన్‌యూ ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ర్యాంకును, జాతీయ స్థాయిలో 6వ, అంతర్జాతీయ స్థాయిలో 246 ర్యాంకును సొంతం చేసుకుంది. ఆయా యూనివర్సిటీలలోని సెట్టింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎనర్జీ అండ్ క్లైమేట్ చేంజ్, వేస్ట్ ట్రీట్‌మెంట్, వాటర్ రిసోర్స్ యూసేజ్, ట్రాన్స్‌పోర్టేషన్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించింది. ఈ అంశాలన్నింటిలో 10వేల మార్కులకు గాను ఏఎన్‌యూ 7,325 మార్కులు దక్కించుకుని ఈ ర్యాంకులు సొంతం చేసుకుంది. ఏఎన్‌యూకి ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు రావడం అభినందనీయమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎన్‌యూకి ఐదేళ్లలో 150 జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు రావడాన్ని పురస్కరించుకొని వీసీ కేక్ కట్ చేశారు. వర్సిటీ ర్యాంకింగ్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిశోర్‌ను అభినందించారు.

చెత్తతో 'పవర్' ఫుల్



సాక్షి, అమరావతి: మున్సిపాలిటీల్లో రోజురోజుకు పెరుగుతున్న చెత్తను.. ఉపయుక్తంగా మార్చే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేసింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్రంగా చెత్త ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. రాజమండ్రి కార్పొరేషన్‌తో పాటు సమీపంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఉత్పత్తి అయ్యే చెత్తను.. ప్రాసెస్ చేసేలా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని సీఎం జగన్ గత నెలలో ఆదేశించారు. ఆ మేరకు ప్లాంట్ సామర్థ్యం, నిర్వహణపై రూపొందించిన నివేదికను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమర్పించగా.. ప్రభుత్వం ఇటీవల ఆమోదించింది. దీంతో 7.5 మెగావాట్ల సామర్థ్యమున్న విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిద్ధమైంది. సమీప పట్టణ స్థానిక సంస్థల నుంచి రోజుకు సగటున 400 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించి విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

22 పట్టణ స్థానిక సంస్థల నుంచి చెత్త తరలింపు..

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 22 పట్టణ స్థానిక సంస్థలను క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నారు. వీటి పరిధిలో రోజూ సుమారు 850 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అంచనా వేసింది. ఇందులో 400 మెట్రిక్ టన్నులు పొడి వ్యర్థాలు కాగా, మిగిలింది తడి చెత్త. తడి వ్యర్థాలను ముమ్మిడివరం, అమలాపురంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ ప్లాంట్ల ద్వారా ఎరువుగా మారుస్తున్నారు. మిగిలిన చోట్ల ఉన్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్లలో ఇనుము, గాజు, ప్లాస్టిక్, రబ్బర్ వంటివి వేరుచేస్తున్నారు. పునర్ వినియోగానికి, బయో ఎరువుగా మార్చేందుకు వీలులేని చెత్తను రాజమండ్రి వద్ద ఏర్పాటు చేసే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు తరలిస్తారు.

పర్యావరణానికి హాని కలగకుండా..

దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో తగలబెట్టడం, నదీ జలాల్లో పడేయడం వంటి చర్యలు పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతున్నాయని నీతి ఆయోగ్ తేల్చింది. ఈ నేపథ్యంలో ఘన వ్యర్థాలను ఆధునిక పద్ధతుల్లో విద్యుత్‌గా మార్చే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందుకు అనుగుణంగా రూ.640 కోట్లతో గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో రెండు విద్యుత్ ప్లాంట్లను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటిలో రోజూ సుమారు 1,600 మెట్రిక్ టన్నుల చెత్త నుంచి దాదాపు 20 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఆయా ప్లాంట్లకు సమీపంలోని మున్సిపాలిటీల్లో సేకరించిన వ్యర్థాలను ఈ ప్లాంట్లకు తరలిస్తున్నారు. వీటి తరహాలోనే త్వరలో రాజమండ్రి వద్ద కూడా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. VI(ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టము భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) అనుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.నెం.4356/2021-G1 తేది.09-12-2022

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, గోరిజవోలుగుంటపాలెం గ్రామము యందు ప్రజాప్రయోజనముకై అనగా "నీటి పారుదల సౌకర్యం పెంపు నిమిత్తం" "గుంటూరు ఛానల్ పొడిగింపు" (Km 54.200 నుండి Km 54.450 వరకు & Km 55.150 నుండి Km 56.400 వరకు) పథకము ద్వారా య.23.4275 సెంట్లు భూమి కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, శ్రీయుత జిల్లా కలెక్టరు గుంటూరు జిల్లా వారు 2013వ సంవత్సరము, 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలను అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ, పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018లోని 22వ చట్టం) ద్వారా సవరించబడిన విధంగా 2013 భూసేకరణ పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013లో 30వ చట్టం) సెక్షన్ 10A ప్రకారం సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది. సదరు విషయమును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అమరావతి, స్టేట్ గజిట్ మరియు Form-A(2) నోటిఫికేషన్ స్టేట్ గజిట్ W.No.19, తేది: మే 12, 2022 ద్వారా ప్రకటన చేయడమైనది.

చట్టములోని సెక్షన్ 43(1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1రెవిన్యూ (భూ.సే)శాఖ, తేది.02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు, గుంటూరు వారు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియులేవు.

కలెక్టరు గుంటూరు జిల్లా వారు పైన పేర్కొన్న చట్టంలో సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఈ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టంలోని 11(4) విభాగం క్రింద కలెక్టరు పూర్వ ఆమోదం లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేది నుండి ఏదేని లావాదేవీ లేదా ఏదేని భూమియొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం/కొనుగోలు మున్నగునవి లేదా అట్టి భూమిపై ఏదేని తాకట్టులను సృష్టించడం ఏ వ్యక్తి చేయరాదు.

పై చట్టంలోని సెక్షన్ 15ను అనుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు/ఆక్షేపణలు వున్న యెడల సంబంధిత వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టర్, గుంటూరు/ శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : గుంటూరు మండలము : పెదనందిపాడు గ్రామము : గోరిజవోలుగుంటపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం (య.సెంట్లు)	భూ సేకరణ చేయు విస్తీర్ణం య.సెం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, మరియు ఇతరముల వివరములు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	171/ఎ	సర్కారు పుంజ	4.59	0.16	వల్లభారెడ్డి నాగరాజకుమారి భర్త రవీంద్రబాబు	173	169-బి	175	170-బి	-
2	173	సర్కారు పుంజ	2.37	1.32	కాసు శివారెడ్డి తండ్రి సుబ్బారెడ్డి	174	171-ఎ	175	172-సి	-
3	200	ఇనాం పుంజ	4.50	1.61	వజ్రాల భారతి భర్త గంగిరెడ్డి	201	199-ఎ	198	177-డి,సి	-
				0.0025	వజ్రాల నాగిరెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి	201	199-ఎ	198	177-డి, సి	-
4	203	ఇనాం పుంజ	13.80	4.02	దేవాలయ భూములు (ప్రత్తిపాటి శ్రీ వేణుగోపాలస్వామి దేవాస్థానం తత్కల మేనేజర్)	202	208-3, 197	204	188	-
5	208-1	సర్కారు పుంజ	3.30	2.03	వనుకూరి దీపిక తండ్రి బుచ్చిరెడ్డి	208-2	209-ఎ, 210-ఎ	207	194-ఎ/1, ఎ/2	-
				0.06	వజ్రాల వెంకటరెడ్డి తండ్రి పెద తిరుపతిరెడ్డి	208-2	209-ఎ, 210-ఎ	207	194-ఎ/1, ఎ/2	-
				0.005	తుమ్మురి కేషరత్నం భర్త బ్రహ్మారెడ్డి	208-2	209-ఎ, 210-ఎ	207	194-ఎ/1, ఎ/2	-
6	208-2	సర్కారు పుంజ	3.30	0.71	వజ్రాల వెంకటరెడ్డి తండ్రి పెద తిరుపతిరెడ్డి	208-3	209-3	207	194-ఎ/1, ఎ/2, 19	-
				0.77	తుమ్మురి కేషరత్నం భర్త బ్రహ్మారెడ్డి	208-3	208-1	207	194-ఎ/1, ఎ/2	-
				0.02	వజ్రాల వెంకటరెడ్డి తండ్రి పెద తిరుపతిరెడ్డి	208-3	208-1	207	194-ఎ/1, ఎ/2	-
				0.05	వనుకూరి దీపిక తండ్రి బుచ్చిరెడ్డి	208-3	208-1	207	194-ఎ/1, ఎ/2	-
				0.16	పిడపర్తి శైలజ భర్త రఘునాధరెడ్డి	208-3	208-1	207	194-ఎ/1, ఎ/2	-
7	208-3	సర్కారు పుంజ	3.10	1.21	పిడపర్తి శైలజ భర్త రఘునాధరెడ్డి	203	208-2	207	203, 197	-
				0.10	వజ్రాల సుబ్బారెడ్డి తండ్రి పెద సాంబిరెడ్డి	203	208-2	207	203, 197	-
				0.23	వజ్రాల వెంకటరెడ్డి తండ్రి పెద తిరుపతిరెడ్డి	203	208-2	207	203, 197	-
8	209-ఎ	సర్కారు పుంజ	2.58	1.21	వనుకూరి బుచ్చిరెడ్డి తండ్రి సాంబిరెడ్డి	208-1	209-బి	210-ఎ	194-బి, 183	-
9	209-బి	సర్కారు పుంజ	1.16	0.33	వనుకూరి బుచ్చిరెడ్డి తండ్రి సాంబిరెడ్డి	209-ఎ	210-ఎ	210-ఎ	183	-
10	210-ఎ	సర్కారు పుంజ	7.65	1.60	బొందలపాటి బాజీప్రదీప్ కుమార్ తండ్రి రామారావు	208-1, 207	210-బి, 215-1ఎ, 2ఎ	211	209-బి, 183	-
				0.40	చీడిపూడి జ్యోతిర్మయి తండ్రి వెంకటరెడ్డి	209-బి	215-1ఎ, 2/ఎ	210-బి	183	-
11	210-బి	సర్కారు పుంజ	3.80	1.10	కాసు యూస్ఫీ లక్ష్మి భర్త వెంకటరెడ్డి	210-ఎ	214	211	210-ఎ	-
				0.93	ఈమని శివమ్మ భర్త సీతారామిరెడ్డి	210-ఎ	214	211	210-ఎ	-
				0.41	ఈద సుబ్బారెడ్డి తండ్రి చిన వెంకటేశ్వరరెడ్డి	210-ఎ	214	211	210-ఎ	-
12	214-ఎ	సర్కారు పుంజ	3.64	0.80	కంకణాల శివకుమారి భర్త సుభాష్ చంద్రబోసు	210	216	214-బి	215-2ఎ, 2/బి	-
				0.19	వెలగా రజని భర్త శివ శంకర్ రావు	210	216	214-బి	215-2ఎ, 2/బి	-
				0.02	కుందనపల్లి వీర రాఘవమ్మ భర్త బాజీరావు	210	216	214-బి	215-2ఎ, 2/బి	-
13	214-బి	సర్కారు పుంజ	4.02	0.65	కంకణాల శివకుమారి భర్త సుభాష్ చంద్రబోసు	210, 211	216	213	210-ఎ	-
				1.58	కంకణాల పద్మావతి భర్త శివన్నారాయణ	210,211	216	213	210-ఎ	-
14	218-డి	సర్కారు పుంజ	3.08	1.63	గింజుపల్లి రజిని భర్త రాంబాబు	216	219	217	218-సి	-
15	219	సర్వేస్ ఇనాం -పుంజ	4.83	0.12	పొన్నం శిరీష తండ్రి లక్ష్మి నారాయణ	218, 220-1/బి, 2/బి	247	217	221-బి1, బి2	-
మొత్తం				23.4275						

ప్రదేశం : గుంటూరు
తేది : 09-12-2022

సం/- యం.వేణుగోపాల్‌రెడ్డి IAS
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. VI(ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టము భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) అనుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.నెం.4360/2021-G1 తేది.08-12-2022

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, రాజుపాలెం గ్రామము యందు ప్రజాప్రయోజనముకై అనగా "నీటి పారుదల సౌకర్యం పెంపు నిమిత్తం" "గుంటూరు ఛానల్ పొడిగింపు" (K 64.400 KM నుండి 64.600 KM వరకు మరియు 65.300 కి.మీ. నుండి 66.000 కి.మీ. వరకు) పథకము ద్వారా య.13.7608 సెంట్లు భూమి కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, శ్రీయుత జిల్లా కలెక్టరు గుంటూరు జిల్లా వారు 2013వ సంవత్సరము, 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలను అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ, పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018లోని 22వ చట్టం) ద్వారా సవరించబడిన విధంగా 2013 భూసేకరణ పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013లో 30వ చట్టం) సెక్షన్ 10A ప్రకారం సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది. సదరు విషయమును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అమరావతి, స్టేట్ గజిట్ మరియు Form-A(2) నోటిఫికేషన్ స్టేట్ గజిట్ W.No.19, తేది: మే 12, 2022 ద్వారా ప్రకటన చేయడమైనది.

చట్టములోని సెక్షన్ 43(1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1రెవిన్యూ (భూ.సే)శాఖ, తేది.02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు, గుంటూరు వారు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియులేవు.

కలెక్టరు గుంటూరు జిల్లా వారు పైన పేర్కొన్న చట్టంలో సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఈ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టంలోని 11(4) విభాగం క్రింద కలెక్టరు పూర్వ ఆమోదం లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేది నుండి ఏదేని లావాదేవీ లేదా ఏదేని భూమియొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం/కొనుగోలు మున్నగునవి లేదా అట్టి భూమిపై ఏదేని తాకట్టులను సృష్టించడం ఏ వ్యక్తి చేయరాదు.

పై చట్టంలోని సెక్షన్ 15ను అనుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు/ఆక్షేపణలు వున్న యెడల సంబంధిత వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టర్, గుంటూరు/ శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : గుంటూరు మండలము : పెదనందిపాడు గ్రామము : రాజుపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం (య.సెంట్లు)	భూ సేకరణ చేయు విస్తీర్ణం య.సెం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, మరియు ఇతరముల వివరములు
1	32-2	సర్కారు పుంజ	5.95	0.37	వంగలూరి పార్వతమ్మ భర్త సుబ్బారావు	31	63	32-3	32-1	-
2	32-3	సర్కారు పుంజ	2.59	1.75	ధూళిపాళ్ళ రవికుమార్ తండ్రి వెంకటేశ్వరరావు	31	63	80	32-2	-
3	63-5	సర్కారు పుంజ	1.22	0.60	జాగర్లమూడి సుబ్బారావు తండ్రి ప్రసాద్	32	63-6	63-7	63-4	-
4	63-6	సర్కారు పుంజ	1.28	0.62	నల్లూరి శివరామయ్య తండ్రి భుజంగరాయుడు	65-5	66	63-7	63-4	-
5	65-1	సర్కారు పుంజ	2.60	0.29	గార్లపాటి సుబ్బారావు తండ్రి శేషయ్య	65-1ఎ	66	65-2బి	64	-
6	65-2బి	సర్కారు పుంజ	1.94	1.18	జాగర్లమూడి నాగరాజు తండ్రి అప్పయ్య	63	66	66	66-1	-
7	66-1	సర్కారు పుంజ	4.46	0.53	నిడుమోలు హరినారాయణ తండ్రి శ్రీరాములు	63	66-2	74	65	-
				0.18	నిడుమోలు నాగేంద్రమ్మ భర్త శ్రీరాములు	63	66-2	74	65	-
				1.00	జాగర్లమూడి నాగరాజు తండ్రి అప్పయ్య	63	66-2	74	65	-
8	66-2	సర్కారు పుంజ	4.60	0.89	చుండూరి శివనాగేశ్వరరావు తండ్రి సుబ్రహ్మణ్యం	65	పాలపర్రు 64	74, 67	64	-
				0.79	చుండూరి మురళీకృష్ణ తండ్రి రమణయ్య	65	పాలపర్రు 64	74, 67	64	-
9	79-1	సర్కారు పుంజ	11.52	0.0008	చుండూరి రాజ్యలక్ష్మి భర్త హరిబాబు	80	80	78	80	-
10	80-1	సర్కారు పుంజ	2.78	1.39	కొలసాని చిన్నమ్మాయి భర్త వెంకటేశ్వర్లు	81	74	79	32-2	-
11	80-2	సర్కారు పుంజ	0.75	0.06	చుండూరి రాజ్యలక్ష్మి భర్త హరిబాబు	81	79	79	80-1	-
12	82	సర్కారు పుంజ	13.28	1.21	చుండూరి హరికృష్ణ తండ్రి కిషోర్‌బాబు	83	81	94, 95	30, 31	-
				0.72	చుండూరి సాయికృష్ణ తండ్రి బంగారుబాబు	83	81	94, 95	30, 31	-
				0.08	కొత్తపల్లి అన్నపూర్ణ భర్త సాంబశివరావు	83	81	94, 95	30, 31	-
13	127-1	సర్కారు పుంజ	2.72	0.45	కొలసాని శివశంకరప్రసాద్ తండ్రి సుబ్బయ్య	128	126	127-2 127-4	130	-
				0.70	కొల్లా భానుమతి భర్త విశ్వనాథం	128	126	127-2 127-4	130	-
14	129-1	సర్కారు పుంజ	2.58	0.95	కొల్లా పద్మశ్రీ భర్త కొండలరావు	130	128	129-2	130	-
	మొత్తం			13.7608						

ప్రదేశం : గుంటూరు
తేది : 08-12-2022

సం/- యం.వేణుగోపాల్‌రెడ్డి IAS
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా

ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల మొండిబకాయిల మాఫీ

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: దేశంలో గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 10,09,511 కోట్ల మొండి బకాయిలను షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు మాఫీ(రైటాఫ్) చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రైటాఫ్ అనేది రుణ గ్రహీతలకు ఎలాంటి లబ్ధి చేకూర్చదని నిర్మలా సీతారామన్ తేల్చిచెప్పారు. వారి నుంచి రుణాలను వసూలు చేసే ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టంచేశారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను (రైటాఫ్ లోన్లు) తిరిగి చెల్లించాల్సిందేనని వివరించారు. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో రూ.6,59,596 కోట్ల రుణాలను తిరిగి వసూలు చేశాయని, ఇందులో రూ.1,32,036 కోట్ల మేర రైటాఫ్ లోన్లు ఉన్నాయని తెలియజేశారు.

క్లుప్తంగా...

బిల్కిస్ పిటిషన్‌పై విచారణకు జస్టిస్ బేలా త్రివేది విముఖత

న్యూఢిల్లీ: బిల్కిస్ బానోపై అత్యాచారం కేసులో దోషులను శిక్షాకాలం ముగియక ముందే జైలు నుంచి విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌బేలా ఎం.త్రివేది నిరాకరించారు. 2002లో గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై అత్యాచారం చేయడంతోపాటు ఆమె కుటుంబ సభ్యులను హత్య చేసిన 11 మంది దోషులను గుజరాత్ ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15న జైలు నుంచి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బిల్కిస్ బానో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం ముందుకువచ్చింది. అయితే, పిటిషన్‌పై విచారణకు జస్టిస్ బేలా ఎం.త్రివేది విముఖత వ్యక్తం చేశారు. అందుకు గల కారణాలు వెల్లడించలేదు. పిటిషన్‌ను కొత్త ధర్మాసనం విచారణకు స్వీకరిస్తుందని కోర్టు తెలిపింది.

గవర్నర్‌కు వర్సిటీల చాన్స్‌లర్ హోదా రద్దు

తిరువనంతపురం: రాష్ట్రంలోని వర్సిటీలకు చాన్సెలర్‌గా గవర్నర్‌ను తొలగించడంతోపాటు ఆ హోదాలో ప్రముఖ విద్యావేత్తను నియమించేందుకు ఉద్దేశించిన బిల్లును కేరళ అసెంబ్లీ మంగళవారం ఆమోదించింది. అయితే, తమ ప్రతిపాదనలను బిల్లులో చేర్చలేదంటూ కాంగ్రెస్ సారథ్యంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ సభ నుంచి వాకౌట్ చేసింది. కేరళ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని గానీ, సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీలను గానీ చాన్సలర్‌గా నియమించాలని యూడీఎఫ్ సూచించింది. చాన్సెలర్ ఎంపిక కమిటీలో సీఎం, ప్రతిపక్ష నేత, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలంది.

యువత సిగరెట్లు కొనకుండా జీవితకాలం నిషేధం

న్యూజిలాండ్‌లో కొత్త చట్టం

వెల్లింగ్టన్: ఆరోగ్యాన్ని హరించే పొగాకు వినియోగాన్ని అరికట్టడానికి న్యూజిలాండ్ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం కొత్తగా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం యువత ఇకపై సిగరెట్లు కొనడానికి వీల్లేదు. వారు సిగరెట్లు కొనకుండా జీవితకాలం నిషేధం విధించారు. 2009 జనవరి 1న, ఆ తర్వాత జన్మించినవారంతా సిగరెట్లకు దూరంగా ఉండాలి. వారికి ఎవరైనా సిగరెట్లు విక్రయిస్తే కఠినమైన శిక్షలు ఉంటాయి. కొత్త చట్టం వల్ల సిగరెట్లు కొనేవారి సంఖ్య ప్రతిఏటా తగ్గిపోతుందని, తద్వారా దేశం పొగాకు రహితంగా మారుతుందని న్యూజిలాండ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. దేశంలో సిగరెట్లు విక్రయించేందుకు అనుమతి ఉన్న రిటైలర్ల సంఖ్యను కొత్త చట్టం కింద 6,000 నుంచి 600కు కుదించింది. సిగరెట్లలో నికోటిన్ పరిమాణాన్ని తగ్గించింది. ఉపయోగించినవారిని భౌతికంగా అంతం చేసే సిగరెట్లను విక్రయించడానికి అనుమతించడంలో అర్థం లేదని ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఆయేషా వెరాల్ చెప్పారు.

3,744 పీజీ మెడికల్ సీట్లు ఖాళీ

న్యూఢిల్లీ: 2021–22 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లోని 60,202 పీజీ మెడికల్ సీట్లకుగాను 3,744 సీట్లు ఖాళీగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. అదేవిధంగా, 2020–21లో 1,425 సీట్లు, 2019–20లో 4,614 మెడికల్ పీజీ సీట్లు మిగిలి ఉన్నట్లు పేర్కొంది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా 92,065 ఎంబీబీఎస్ సీట్లకు గాను 2021–22 విద్యా సంవత్సరంలో 197 సీట్లు, 2019–20లో 273, 2018–19లో 274 సీట్లు మిగిలిపోయినట్లు చెప్పారు.


మూడేళ్లలో 1,811 ఎన్‌జీవోల లైసెన్సులు రద్దు

2019–21 ఏళ్ల మధ్య కాలంలో విదేశీ విరాళాల(నియంత్రణ)చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) నిబంధనలను ఉల్లంఘించిన 1,811 ప్రభుత్వేతర సంస్థ(ఎన్‌జీవో)ల అనుమతులను రద్దు చేసినట్లు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభలో తెలిపారు. విదేశీ నిధులను స్వీకరించే ఎన్‌జీవోలు ఎఫ్‌సీఆర్‌ఏ కింద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. విదేశాల నుంచి అందుకున్న నిధులను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించినట్లు తేలితే ఎఫ్‌సీఆర్‌ఏ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

చైనా సేనలను తరిమికొట్టాం

పార్లమెంటులో రాజ్‌నాథ్ ప్రకటన • కేంద్రం, కాంగ్రెస్ మాటల యుద్ధం

న్యూఢిల్లీ: భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చేందుకు చైనా చేసిన ప్రయత్నాలను మన సైన్యం పూర్తిస్థాయిలో తిప్పికొట్టిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ''అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్లో యాంగ్‌ట్సే ప్రాంతం వద్ద వాస్తవాధీన రేఖను దాటేందుకు, తద్వారా యథాతథ స్థితిని మార్చేందుకు డిసెంబర్ 9న చైనా సైన్యం ప్రయత్నించింది. వాటన్నింటినీ మన సైనికులు చాలా గట్టిగా తిప్పికొట్టారు. మన సైనిక కమాండర్లు సకాలంలో స్పందించడంతో చైనా సైన్యం తోక ముడిచింది'' అని చెప్పారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆయన వేర్వేరుగా ప్రకటన చేశారు. ''ఈ ఘర్షణ ఇరు సైనికుల నడుమ భౌతిక పోరుకూ దారి తీసింది. మన వాళ్లు వీరోచితంగా పోరాడారు. మన భూభాగాల్లోకి చొచ్చుకొచ్చేందుకు చైనా సైన్యం చేసిన ప్రయత్నాలను వమ్ము చేసి వారిని తరిమికొట్టారు'' అని వివరించారు. ''ఈ ప్రయత్నంలో మనవైపు ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదు. కొందరు సైనికులు స్వల్పంగా గాయపడ్డారు'' అని స్పష్టం చేశారు. ''ఈ ఘటన తర్వాత మన స్థానిక సైనిక కమాండర్, చైనా కమాండర్ మధ్య డిసెంబర్ 11న ఫ్లాగ్ మీటింగ్ జరిగింది. దీనిపై మన ఆగ్రహాన్ని, అభ్యంతరాలను దౌత్య మార్గాల్లో కూడా చైనాకు తెలియజేశాం. ఇలాంటి దుందుడుకు చర్యలను పునరావృతం చేయొద్దని, సరిహద్దుల వెంబడి శాంతి, సామరస్యాలను కాపాడాలని గట్టిగా చెప్పాం'' అని వెల్లడించారు. ''మన భూభాగాన్ని ఆక్రమించేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాలనైనా పూర్తిగా తిప్పికొట్టేందుకు, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు సైన్యం నిత్యం సన్నద్ధంగా ఉంది. సభకు ఈ మేరకు హామీ ఇస్తున్నా'' అని చెప్పారు. అంతకుముందు తాజా పరిస్థితిపై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ సమీక్ష జరిపారు.



కొద్ది రోజులుగా తవాంగ్ వద్ద భారత సైన్యం మోహరింపులు (ఎరుపు రంగు గీతలున్న ప్రాంతాల్లో)

భారత సైనికులు అడ్డుకున్నందుకే... తవాంగ్ రగడ: చైనా సైన్యం

'గల్వాన్ లోయ' చేదు అనుభవం నేపథ్యంలో తవాంగ్ రగడపై చైనా ప్రభుత్వ ఆచితూచి స్పందించగా సైన్యం మాత్రం తెంపరి వ్యాఖ్యలకు దిగింది! సరిహద్దుల వెంబడి పరిస్థితి నిలకడగా ఉందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ మంగళవారం వ్యాఖ్యానించారు. ''భారత దళాలే అక్రమంగా ఎల్‌ఓసీ దాటాయి. చైనా వైపు డాంగ్‌జాంగ్ ప్రాంతంలో గస్తీ విధుల్లో ఉన్న మా సైనికులను అడ్డుకున్నాయి. అది డిసెంబర్ 9 రగడకు దారి తీసింది'' అని చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) వెస్టర్న్ థియేటర్ కమాండ్ అధికార ప్రతినిధి కల్నల్ లోంగ్ షోహువా ఆరోపించారు.

గల్వాన్ తరహా ఘర్షణ



- డిసెంబర్ 9 నాటి చైనా ఆక్రమణ యత్నం మరోసారి రెండేళ్లనాటి 'గల్వాన్ లోయ' ఉదంతాన్ని తలపించింది. విశ్వసనీయ సమాచారం మేరకు... చైనా సైనికులు అచ్చం అప్పటి మాదిరిగానే ఇనుప ముళ్లతో కూడిన లావుపాటి ఆయుధాలు, కర్రల వంటివాటితో దాడికి దిగారు. అప్పట్లాగే పరిస్థితి మరోసారి బాహాబాహీకి కూడా దారితీసింది.
- తవాంగ్ పరిసరాల్లో యాంగ్‌ట్సే వద్ద 17 వేల అడుగుల పై చిలుకు ఎత్తున్న మంచు శిఖరాలపై పట్టు కోసం చైనా ఎప్పట్నుంచో ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దాదాపు రెండేళ్ల అనంతరం మరోసారి మన భూభాగాల్లోకి సైలెంటుగా చొచ్చుకొచ్చేందుకు డిసెంబర్ 9న దొంగ ప్రయత్నం చేసింది.
- అయితే అక్కడ ఎటు చూసినా మన సైన్యం భారీగా మోహరించిన తీరుతో చైనా దళాలు అవాక్కైనట్టు సమాచారం. వాటి చొరబాటు యత్నాలను మనవాళ్లు దీటుగా అడ్డుకోవడమే గాక పూర్తిస్థాయిలో తరిమి కొట్టారు.
- ఆ ప్రాంతంలో భారత సైన్యపు మోహరింపులు హై రిజల్యూషన్ కెమెరాలతో తీసిన ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కన్పిస్తున్నాయి.
- 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్ సమీపంలోని గల్వాన్ లోయ వద్ద చైనా, భారత దళాల మధ్య జరిగిన భీకర పోరు జరగడం తెలిసిందే. దానివల్ల ఇరుదేశాల సంబంధాలు బాగా క్షీణించాయి.
- అప్పటినుంచి తూర్పు ప్రాంతంలో వాస్తవాధీన రేఖ వద్ద మోహరింపులను, యుద్ధ సన్నద్ధతను సైన్యం బాగా పెంచింది. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది.
- ఆ తర్వాత ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న పెద్ద ఘర్షణ ఇదే. ఈ దురాక్రమణ యత్నంలో చైనా వైపు చాలా మంది సైనికులు గాయపడ్డట్టు సమాచారం.
- 2012 అక్టోబర్లో కూడా యాంగ్‌ట్సే ప్రాంతంలోనే భారత, చైనా సైనికుల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది.
- కొంతకాలంగా ఈ ప్రాంతంలో చైనా డ్రోన్ల హడావుడి బాగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజా రగడకు ముందే మన యుద్ధ విమానాలు తవాంగ్ పరిసరాల్లో గస్తీ కాయడం, డేగ కళ్లతో నిఘా వేయడం మొదలైంది.
- దాదాపు 3,500 కిలోమీటర్ల పొడవైన నియంత్రణ రేఖ పొడవునా పరిస్థితిపై, దళాల సన్నద్ధతపై త్రివిధ దళాధిపతులు సమీక్ష జరిపారు.

నిజాలు దాస్తున్న కేంద్రం

రాజ్‌నాథ్‌ది అరకొర ప్రకటన: కాంగ్రెస్
'తవాంగ్'పై అట్టుడికిన ఉభయసభలు
కాంగ్రెస్ సారథ్యంలో విపక్షాల వాకౌట్



తవాంగ్ రగడ మంగళవారం పార్లమెంటు ఉభయ సభలనూ కుదిపేసింది. చైనాను నిలువరించడంలో కేంద్రం సమర్థంగా వ్యవహరించడం లేదని కాంగ్రెస్ సారథ్యంలో విపక్షాలన్నీ దుయ్యబట్టాయి. ''ఇది కచ్చితంగా దౌత్య వైఫల్యమే. సరిహద్దుల వద్ద పరిస్థితిపై తక్షణం సవివర చర్చకు ప్రభుత్వం సిద్ధపడాలి'' అని డిమాండ్ చేశాయి. రాజ్‌నాథ్ ప్రకటనపై వివరణకు పట్టుబట్టాయి. ఇది సున్నితమైన అంశమంటూ వివరణ కోరేందుకు రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్, లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా అనుమతివ్వలేదు. అందుకు నిరసనగా కాంగ్రెస్, ఎస్పీ, జేఎంఎం, ఆర్జేడీ, శివసేన, సీపీఎం, సీపీఐ ఉభయ సభల నుంచీ వాకౌట్ చేశాయి. అనంతరం రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. చైనా సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ (ఆర్జీఎఫ్) గుర్తింపు రద్దు అంశాన్ని కావాలని మోదీ సర్కారు తెరపైకి తెస్తోందని ఆరోపించారు. ఉభయ సభల్లో వివరణ ఇవ్వకుండా పారిపోయిందని ఎద్దేవా చేశారు. చైనా దురాక్రమణ, ఉగ్రవాదం దేశ భద్రతకు, ప్రాదేశిక సమగ్రతకు పెను ముప్పుగా మారుతున్నా మౌన ప్రేక్షకునిగా చూస్తోందంటూ దుయ్యబట్టారు.

మంత్రుల వెనక దాక్కుంటున్న మోదీ

చైనా అంశంపై ప్రభుత్వ వ్యవహార శైలిని కాంగ్రెస్‌తో పాటు విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. తవాంగ్ రగడపై రక్షణ మంత్రి అరకొర ప్రకటనతో సరిపెట్టారంటూ కాంగ్రెస్ దుయ్యబట్టింది. దీనిపై మోదీ ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని పార్టీ నేతలు గౌరవ్ గొగొయ్, పవన్ ఖేరా ఆరోపించారు. ''డిసెంబర్ 9న ఘర్షణ జరిగితే రక్షణ మంత్రి ప్రకటనకు ఇంత ఆలస్యమెందుకు? ప్రజల నుంచి ఏం దాస్తున్నారు?'' అని ప్రశ్నించారు. జాతీయ భద్రత అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా మోదీ తన మంత్రుల వెనక దాక్కుంటారని ఎద్దేవా చేశారు. పీఎం కేర్స్ నిధికి విరాళాలిచ్చిన చైనా కంపెనీల పేర్లు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

అంగుళం కూడా వదలం: అమిత్ షా

రాజీవ్ ఫౌండేషన్‌కు చైనా నిధులు
దాని గుర్తింపు రద్దయినందుకే నిరసనలు
కాంగ్రెస్‌కు హోం మంత్రి చురకలు



మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం భారత భూభాగంలో ఎవరూ ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఎలాంటి చొరబాట్లనూ అనుమతించబోమన్నారు. 'లోక్‌సభలో కార్యకలాపాలను కాంగ్రెస్ పదేపదే అడ్డుకోవడానికి అసలు కారణం తవాంగ్ రగడ కాదు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్ (ఆర్జీఎఫ్)కు విదేశీ విరాళాల చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) గుర్తింపును కేంద్రం రద్దు చేయడమే!'' అంటూ చురకలంటించారు. ''సమాజ సేవ కోసమంటూ నమోదు చేసుకున్న ఆర్జీఎఫ్‌కు ఇండో–చైనా సంబంధాల అభివృద్ధి సంబంధిత అధ్యయనం పేరిట చైనా ఎంబసీ నుంచి రూ.1.35 కోట్లు అందాయి. అందుకే దాని గుర్తింపు రద్దు చేయాల్సి వచ్చింది. విపక్షాల గొడవ వల్ల ప్రశ్నోత్తరాలు తుడిచిపెట్టుకుపోయాయి. లేదంటే ఈ విషయాన్ని సభలోనే చెప్పేవాన్ని. బహుశా ఆర్జీఎఫ్ తన అధ్యయనం ముగించే ఉంటుంది. ఇంతకూ, 1962 చైనా యుద్ధంలో ఎన్ని వేల హెక్టార్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందన్నది ఆ అధ్యయనంలో ఉందా?'' అంటూ ఎద్దేవా చేశారు. చైనాపై మోదీ ప్రభుత్వం మెతక వైఖరి ప్రదర్శిస్తోందన్న కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టారు. నిజానికి విదేశీ నాయకులతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాధినేతలకు ఉన్న వ్యక్తిగత సంబంధాల కారణంగానే ఐరాస భద్రతా మండలిలో స్థానం చేజారిందంటూ ప్రత్యారోపణ చేశారు. ''భద్రతా మండలిలో భారత్ స్థానాన్ని కాంగ్రెస్‌కు చెందిన దేశ తొలి ప్రధాని నెహ్రూ ఎందుకు 'త్యాగం' చేశారు? కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్‌సింగ్ అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటిస్తే చైనా అభ్యంతరపెట్టింది. ఆ రాష్ట్ర సీఎం దోర్జీ ఖండూకు వీసా నిరాకరించింది. జమ్మూ కశ్మీర్‌ను ప్రత్యేక దేశంగా గుర్తిస్తూ అక్కడి ప్రజలకు స్టేపుల్ వీసాలిచ్చింది. వీటన్నింటిపై కూడా ఆర్జీఎఫ్ అధ్యయనం చేసిందా?'' అంటూ ఎద్దేవా చేశారు. సోనియాగాంధీ సారథ్యంలోని ఆర్జీఎఫ్‌కు ఉగ్రవాదులతో లింకుల ఆరోపణలపై నిషేధం ఎదుర్కొంటున్న ఇస్లామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జకీర్ నాయక్ నుంచి కూడా రూ.50 లక్షలందాయని ఆరోపించారు.

సుప్రీం జడ్జీలుగా ఐదుగురికి పదోన్నతి

కేంద్రానికి సిఫార్సుచేసిన సుప్రీంకోర్టు కొలీజియం



న్యూఢిల్లీ: పేరుకుపోతున్న కేసుల సత్వర పరిష్కారానికి సర్వోన్నత న్యాయస్థానం మరో ముందడుగు వేసింది. ఐదుగురు హైకోర్టు జడ్జీలను సుప్రీంకోర్టు జడ్జీలుగా పదోన్నతి కల్పించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అంతకుముందు ఢిల్లీలో మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం సమావేశమైంది. ఆ తర్వాత సంబంధిత జడ్జీల పేర్ల జాబితాను కేంద్రానికి పంపించింది. ఈ వివరాలను సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ పంకజ్ మిట్టల్, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్, పట్నా హైకోర్టులో మరో జడ్జి జస్టిస్ అసనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మనోజ్ మిశ్రాలను సుప్రీంకోర్టులో జడ్జీలుగా ఎంపికచేయాలంటూ కేంద్రానికి సిఫార్సుచేసింది. ఈ సిఫార్సులకు కేంద్రం ఆమోదముద్ర వేస్తే సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 33కు పెరుగుతుంది. మరోవైపు, ఉత్తరాఖండ్ హైకోర్టులో జడ్జి జస్టిస్ సంజయకుమార్ మిశ్రాను జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, గువాహటి హైకోర్టు జడ్జి ఎన్ కోటీశ్వర్ సింగ్‌ను జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, కేరళ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ను గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుచేసింది.

మీ త్యాగాన్ని జాతి మరువదు

పార్లమెంట్‌పై ఉగ్రదాడి మృతులకు ప్రముఖుల నివాళి

న్యూఢిల్లీ: 2001లో పార్లమెంట్‌పై ఉగ్ర దాడి ఘటనలో నేలకొరిగిన వారికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా జాతి యావత్తూ మంగళవారం నివాళులర్పించింది. పార్లమెంట్ భవనం వెలుపల జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, అన్ని పార్టీల ఎంపీలు ఘనంగా నివాళులర్పించారు. 2001 పార్లమెంట్ దాడి ఘటనలో వీరమరణం పొందిన వారికి జాతి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్రపతి ముర్ము అనంతరం ట్వీట్ చేశారు. దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన వారి త్యాగాన్ని, ధైర్యసాహసాలను ఎన్నడూ మరువబోమని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో తెలిపారు.



మృతులకు నివాళిగా మౌనం పాటిస్తున్న మోదీ, తదితరులు.



నివాళులర్పిస్తున్న భద్రతా సిబ్బంది

ఘనంగా నివాళులర్పించిన రాజ్యసభ

అంతకుముందు, పార్లమెంట్‌పై దాడి ఘటనలో ప్రాణాలర్పించిన వారికి రాజ్యసభ నివాళులర్పించింది. సభ్యులు తమ స్థానాల నుంచి లేచి నిలబడి మౌనం పాటించారు. సభా కార్యకలాపాలు ప్రారంభం కాగానే డిప్యూటీ చైర్మన్ హరివంశ్ రాయ్ మాట్లాడారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో డిసెంబర్ 13వ తేదీ ఎప్పటికీ విషాదకరమైన రోజుగానే గుర్తుండిపోతుందన్నారు. 2001 డిసెంబర్ 13వ తేదీన లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్ ఉగ్ర సంస్థలకు చెందిన ఐదుగురు ఉగ్రవాదులు పార్లమెంట్ వద్ద కాల్పులకు తెగబడ్డారు. పార్లమెంట్ భవనంలోకి చొచ్చుకుపోయేందుకు వారు చేసిన యత్నాన్ని బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘటనలో ఐదుగురు ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ మహిళా జవాను ఒకరు, పార్లమెంట్ సిబ్బంది ఇద్దరు, జర్నలిస్ట్ ఒకరు ప్రాణాలు కోల్పోగా భద్రతా బలగాల కాల్పుల్లో ఉగ్రవాదులందరూ హతమయ్యారు.

అనంత శక్తిని ఒడిసిపట్టే... దారి దొరికింది!



'కేంద్రక సంలీన' పరీక్ష విజయవంతం

- అమెరికా సైంటిస్టుల చరిత్రాత్మక ఘనత
- సూర్యుడు, తారల అనంత శక్తికిదే మూలం
- స్వచ్ఛ విద్యుదుత్పత్తిపై సరికొత్త ఆశలు

శాస్త్ర, సాంకేతిక పరిశోధన రంగంలో నభూతో అనదగ్గ అతి కీలక ముందడుగు! అంతర్జాతీయంగా ఇంధన రంగ ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేయగల పరిణామం!! మహా మహా శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా అలుపెరగకుండా చేస్తూ వస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించింది. నియంత్రిత వాతావరణంలో కేంద్రక సంలీన ప్రక్రియను జరపడంలో సైంటిస్టులు తొలిసారిగా విజయవంతమయ్యారు. కాలిఫోర్నియాలోని లారెన్స్ లివర్‌మోర్ నేషనల్ లేబొరేటరీ పరిశోధకులు చరిత్రలో తొలిసారిగా ఈ ఘనత సాధించారు. సంలీన ప్రక్రియలో అత్యంత కీలకమైన, పరిశోధకులంతా ఏళ్ల తరబడి ప్రయత్నిస్తున్న 'నికర శక్తి లాభం' సాధించి చూపించారు. సంలీన ప్రక్రియను ప్రారంభించేందుకు వెచ్చించాల్సిన శక్తి కంటే, ప్రక్రియ ద్వారా పుట్టుకొచ్చే శక్తి పరిమాణం ఎక్కువగా ఉండటాన్ని నికర శక్తి లాభంగా పిలుస్తారు. అమెరికా ఇంధన మంత్రి జెన్నిఫర్ గ్రాన్‌హోం మంగళవారం ఈ మేరకు అధికారికంగా ప్రకటన చేశారు. వైట్‌హౌస్ శాస్త్ర సలహాదారు ఆర్తీ ప్రభాకర్, పరిశోధకుల బృందంతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ''శాస్త్ర, సాంకేతిక పరిశోధనల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విజయమిది. మా పరిశోధకుల బృందం తమ కెరీర్లతో పాటు జీవితాలను కూడా అంకితం చేసి పాటుపడి ఎట్టకేలకు సాధించింది. ఇంతకాలంగా మనమందరం కలలుగన్న కేంద్రక సంలీన ప్రక్రియను నిజం చేసి చూపించింది. ఇది ఈ రంగంలో మరిన్ని గొప్ప ఆవిష్కరణలకు తెర తీయనుంది'' అని చెప్పారు. ఈ పరిశోధన రక్షణ రంగంలో కనీవినీ ఎరగనంతటి విప్లవాత్మక మార్పులకు తెర తీయడమే గాక విద్యుచ్ఛక్తితో సహా భవిష్యత్తులో మానవాళి మొత్తానికీ సరిపడా స్వచ్ఛ ఇంధనాన్ని సునాయాసంగా తయారు చేసుకునేందుకు కూడా వీలు కల్పించగలదని అమెరికా ఇంధన శాఖ ఒక ప్రకటనలో ఆశాభావం వెలిబుచ్చింది. ఎంతకాలమైనా సహనం కోల్పోకుండా పట్టుదలతో ప్రయత్నిస్తే ఎంతటి అద్భుతాలైనా సాధ్యమేననేందుకు ఈ ఫలితమే ఉదాహరణ అని ఆర్తీ అన్నారు.

ఏమిటీ కేంద్రక సంలీనం?

కేంద్రక సంలీనం అంటే రెండు చిన్న పరమాణువుల కేంద్రకాలు కలిసిపోయి, అంటే సంలీనం చెంది ఒకే పెద్ద కేంద్రకంగా ఏర్పడటం. అలా ఏర్పడ్డ సదరు కేంద్రకం తాలూకు ద్రవ్యరాశి ఆ రెండు పరమాణువుల కేంద్రక ద్రవ్య రాశి కంటే తక్కువగా ఉంటుంది. ఆ మిగులు ద్రవ్యరాశి అపార శక్తి రూపంలో విడుదలవుతుంది. ఇది జరగాలంటే అపారమైన శక్తిని వినియోగించాల్సి ఉంటుంది. సూర్యునిలోనూ, ఇతర నక్షత్రాల్లోనూ ఉత్పన్నమయ్యే అనంత శక్తికి ఈ కేంద్రక సంలీనమే మూలం. వాటిలోని అపార ఉష్ణోగ్రతలు ఇందుకు వీలు కల్పిస్తాయి. హైడ్రోజన్ బాంబు తయారీ సూత్రం కూడా ఇదే. అదే అణు బాంబు తయారీలో దీనికి సరిగ్గా వ్యతిరేకంగా ఉండే కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియను అనుసరిస్తారు. అందులో ఒకే అణువు తాలూకు కేంద్రకం చిన్న భాగాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో విపరీతమైన శక్తి పుట్టుకొస్తుంది.

ప్రయోజనాలు అనంతం!

కేంద్రక సంలీన ప్రక్రియను శాస్త్రవేత్తలు ఏనాడో అవగాహన చేసుకున్నారు. భూమిపై దీన్ని చేసి చూసేందుకు 1930ల నుంచే తీవ్రస్థాయిలో ప్రయత్నాలు మొదలయ్యాయి. వీటిపై పలు దేశాలు వందలాది కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నాయి. ''ఇంధనపరంగా చూస్తే కేంద్రక సంలీనం తాలూకు ప్రయోజనాలు అనంతమనే చెప్పాలి. ఎందుకంటే అణు విద్యుదుత్పత్తికి అనుసరించే కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ ద్వారా విడులయ్యే రేడియోధార్మిక వ్యర్థాలకు సంలీనంలో అవకాశమే ఉండదు. కాబట్టి మానవాళి మొత్తానికీ అవసరమయ్యే స్వచ్ఛ ఇంధనాన్ని అపరిమితంగా, కారుచౌకగా అందించడం సాధ్యపడుతుంది'' అని కాలిఫోర్నియా వర్సిటీ ఇంధన విభాగ ప్రొఫెసర్ డేనియల్ కామెన్ వివరించారు. అయితే ఇది సాకారమయ్యేందుకు ఇంకా చాలా ఏళ్లు పట్టొచ్చని సైంటిస్టులు చెబుతున్నారు.

తాజా ఆవిష్కరణ ప్రత్యేకత ఏమిటంటే...

సూర్యుడు, ఇతర తారల్లోనూ హైడ్రోజన్ బాంబు తయారీలోనూ కేంద్రక సంలీన చర్య అనియంత్రిత పద్ధతిలో జరుగుతుంది. ఈ చర్యలో రెండు హైడ్రోజన్ పరమాణువులు కలిసి ఒక హీలియం అణువుగా మారుతూ ఉంటాయి. దీన్ని గనక నియంత్రిత వాతావరణంలో జరపగలిగితే అపారమైన శక్తిని ఉత్పత్తి చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా భూమిపై మానవాళి మొత్తానికీ సరిపడా విద్యుత్తును నిరంతరంగా సరఫరా చేయొచ్చు! అది కూడా అతి చౌకగా, ఎలాంటి రేడియో ధార్మిక తదితర కాలుష్యానికీ తావు లేకుండా!! తాజాగా అమెరికా సైంటిస్టులు స్వల్ప పరిమాణంలోనే అయినా సరిగ్గా దాన్నే సాధించి చూపించారు. హైడ్రోజన్ ఐసోటోప్‌లైన డ్యుటీరియం, ట్రిటియంలను సంలీనం చెందించారు. ''ఇతర సంలీనాలతో పోలిస్తే వీటి సంలీనానికి తక్కువ ఉష్ణోగ్రత సరిపోతుంది. పైగా చాలా ఎక్కువ శక్తి విడుదలవుతుంది'' అని యూఎస్ ఇంధన శాఖ పేర్కొంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం ၊ 14 ၊ డిసెంబర్ ၊ 2022



సబ్‌కలెక్టర్ ఆకస్మిక సందర్శన

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మునిసిపల్ కార్యాలయాన్ని సబ్‌కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు.



ఫ్యాషన్‌లో పాల్గొన్న యువతులు

మోడల్స్ హొయలు



మోడ్రన్ డ్రెస్‌లతో యువతులు సందడి చేశారు. ర్యాంప్‌పై క్యాట్ వాక్‌తో, క్యూట్ లుక్స్‌తో హొయలొలికించారు. ఇందుకు నోవోటెల్ హోటల్ వేదికైంది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు 'హై లైఫ్ బ్రైడ్స్' పేరిట జరగనున్న ఎగ్జిబిషన్‌లో భాగంగా యువతులు మంగళవారం ఫ్యాషన్ షో నిర్వహించారు. వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్ ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని హై లైఫ్ ఎగ్జిబిషన్స్ ఎండీ, సీఈఓ పి.డొమినిక్ తెలిపారు.

– గుణదల(విజయవాడతూర్పు)

పట్టు దొరికింది



పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల మహిళా కబడ్డీ జట్ల మధ్య ఉత్కంఠ పోరు

జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో కబడ్డీ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జోన్–2 పరిధిలోని కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించాయి. సీనియర్ స్త్రీ, పురుషుల జట్లు విజయమే లక్ష్యంగా హోరాహోరీగా తలపడ్డాయి.

–8లో▸

న్యూస్‌రీల్

20న వాహనాలకు వేలం

పటమట(విజయవాడతూర్పు): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ), పటమట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 20వ తేదీన వేలం నిర్వహిస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్.నిక్సన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పటమట గురునానాక్‌కాలనీలోని స్టేషన్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ద్విచక్ర వాహనాలకు రూ.5 వేలు, ఆటో, కార్లకు రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని సూచించారు. వేలంలో పాడుకున్న వాహనం ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0866-2543707, 94409 02456, 82878 27255 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్ వర్సిటీ పీజీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం పీజీ స్పెల్–2 పరీక్షల నోటిఫికేషన్ విడుదలైందని వర్సిటీ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.అజంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా ఏపీ ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించొచ్చని సూచించారు. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 23వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించొచ్చని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వచ్చేనెల 20 నుంచి 24వ తేదీ వరకు, ప్రథమ సంవత్సరం వారికి అదే నెల 27 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. మరింత సమాచారం కోసం మాచవరంలోని అధ్యయన కేంద్రంలో స్వయంగా లేదా 0866-2434868, 73829 29642 ఫోన్ నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

96 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్–2022లోని బైపీసీ విభాగం విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం కొనసాగింది. ప్రత్యేక కేటగిరి విభాగంలో ఎన్‌సీసీ అభ్యర్థులు 38 మంది, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నుంచి 13 మంది, క్యాప్ (ఆర్మీ ఉద్యోగుల పిల్లలు) 45 మంది సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హెల్ప్‌లైన్ సెంటర్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.విజయసారథి పరిశీలించారు. బుధవారం ప్రత్యేక కేటగిరి విభాగం విద్యార్థుల 45,001 నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని ఎం.విజయసారథి తెలిపారు. జనరల్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఆన్‌లైన్‌లో కొనసాగుతోందని వివరించారు.

బస్సుల కొనుగోలుకు ఎస్‌బీఐ రుణసాయం

డీజీఎం రంగరాజన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేంద్ర ప్రభుత్వ స్టాండప్ ఇండియా పథకంలో భాగంగా వాహనాల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తున్నామని భారతీయ స్టేట్ బ్యాంక్ అమరావతి సర్కిల్ డీజీఎం కె.రంగరాజన్ పేర్కొన్నారు. తొలి విడతలో ఎస్‌బీఐ బీసెంట్ రోడ్డుశాఖ ఆధ్వర్యంలో మంజూరైన ఏడు బస్సులను సూర్యారావుపేటలోని ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో 700 ఆర్టీసీ అద్దె బస్సుల కొనుగోలుకు ఎస్‌బీఐ రుణాలు అందిస్తోందన్నారు. ఈ పథకంలో అమరావతి సర్కిల్ పరిధిలో 100 అద్దె బస్సులకు వారం రోజుల్లో రుణాలు ఇస్తున్నామని తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం కింద ప్రతి మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు అతి తక్కువ వడ్డీతో రుణసాయం అందిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఏడు ఆర్టీసీ బస్సులను మహిళలు కొనుగోలు చేశారని తెలిపారు. ఒక్కొక్క బస్సు ధర రూ.45 లక్షలు కాగా మార్జిన్ మనీ 15 శాతం అంటే రూ.5 లక్షలు మాత్రమే మహిళలు చెల్లించాలని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేస్తుందని వివరించారు. బ్యాంకు మంజూరు చేసే రుణంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 70 శాతం వరకు సబ్సిడీ ఇస్తాయని తెలిపారు. ఈ పథకం కింద మహిళా సాధికారతకు ఎస్‌బీఐ తన వంతు సాయం చేస్తోందని రంగరాజన్ వివరించారు.

డిజిటల్ వైద్యం

- కాగితం రహిత వైద్య సేవల దిశగా జీజీహెచ్
- రోగుల వివరాలు వారి ఐడీలో నమోదు
- ఆన్‌లైన్‌లోనే వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు
- ఓపీ చీటీ పోయినా చికిత్స వివరాలు భద్రం
- అన్ని విభాగాల్లో ఐపీ సేవలకు చర్యలు



జీజీహెచ్‌లో ఔట్ పేషెంట్ వివరాలను ఐడీ విధానంలో కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)లో పూర్తి స్థాయిలో కాగిత రహిత (డిజిటల్) సేవల వైపు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్రంలోనే తొలి డిజిటల్ ఆస్పత్రిగా జీజీహెచ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగికీ గుర్తింపు నంబర్ (ఐడీ) కేటాయిస్తున్నారు. అన్ని ఓపీ సేవల్లో రోగి ఐడీతో లాగిన్ అయ్యి వారి వివరాలు నమోదు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల రిపోర్టులను కూడా ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తున్నారు. ఇన్ పేషెంట్ల రికార్డులను కూడా రోగి ఐడీలో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం ఆస్పత్రి సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, ప్రతి వార్డులో కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి సారథ్యంతో పూర్తిస్థాయి ఈ–ఆస్పత్రిగా జీజీహెచ్ రూపుదిద్దుకుంటోంది.

ఆన్‌లైన్‌లో రోగి వివరాలు

ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికీ వారి ఆధార్, మొబైల్ నంబర్ల ఆధారంగా ప్రత్యేక నంబర్ (ఐడీ)ను రూపొందిస్తున్నారు. అప్పటికే ఐడీ ఉంటే, ఆ నంబర్‌తో ఓపీ స్లిప్‌ను రోగికి అందజేస్తున్నారు. ఆ చీటీ తీసుకుని ఓపీకి వెళ్తే వైద్యులు రోగి ఐడీ నంబర్‌తో లాగిన్ అవుతారు. రోగికి సంబంధించి జబ్బు, చికిత్స వివరాలతో పాటు ఇన్వెస్టిగేషన్లు(వ్యాధి నిర్ధారణ పరీక్షలు) వంటివి నమోదు చేస్తారు. ఇలా ఆస్పత్రి లోని అన్ని ఓపీ విభాగాల్లో వైద్యుల వద్ద కంప్యూటర్‌లు ఏర్పాటు చేసి, ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

పరీక్షల రిపోర్టులూ ఆన్‌లైన్‌లోనే..

రోగికి ఓపీలో వైద్యులు పరీక్ష చేసిన సమయంలో చేయాల్సిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వైద్యుడి నుంచి ఎటువంటి చీటీ లేకుండా సెంట్రల్ ల్యాబ్‌కు వెళ్లి, రోగి ఐడీ నంబరు చెబితే, వైద్యులు ఏ పరీక్షలు రాశారో అక్కడి సిబ్బందికి తెలుస్తుంది. ఆ సమాచారం ఆధారంగా బ్లడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేస్తారు. రిపోర్టులను సైతం వారి ఐడీ నంబర్‌లో ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్‌ఐ, అల్ట్రా సౌండ్ స్కాన్ రిపోర్టులను కూడా ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. దీంతో రిపోర్టుల కోసం రోగి అటూ ఇటూ తిరిగాల్సిన అవసరం ఉండదు. ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా వాటిని వెంట తీసుకెళ్లాల్సిన పనీ ఉండదు.

ఓపీ చీటీ పోయినా..

ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన ఓపీ చీటీ పోయినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. గతంలో ఓపీ చీటీ పోతే అంతకు ముందు ఏ మందులు వాడారు? ఏ పరీక్షలు చేశారు, రక్త పరీక్షల వివరాలు తెలిసేవి కాదు. ఇప్పుడు రోగి ఆధార్‌నంబర్, ఫోన్ నంబరు చెబితే, వారి ఐడీని తెలుసుకుని, దానిని ఓపెన్ చేస్తే చాలు. గతంలో వారు పొందిన చికిత్స వివరాలు, వాడిన మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలు అందుబాటులోకి వస్తాయి. కాగితంతో పనిలేకుండా ఐడీ నంబర్ ఆధారంగా రోగి రిపోర్టులన్నీ భద్రంగా ఉంటాయి. హైదరాబాద్, ఢిల్లీ.. ఇలా ఎక్కడికి వెళ్లినా ఐడీ నంబరు చెపితే చాలు రోగుల వివరాలు అక్కడి వైద్యుల కంప్యూటర్లలో అందుబాటులోకి వస్తాయి.

ఐపీ సేవలవైపు అడుగులు

ప్రస్తుతం ఓపీ, డయాగ్నోస్టిక్ సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. న్యూరాలజీ, కార్డియాలజీ వంటి విభాగాల్లో ఐపీ సేవలను కూడా ఇప్పటికే ఆన్‌లైన్ చేయడం ప్రారంభించారు. రానున్న రోజుల్లో ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో ఐపీ సేవలను ఆన్‌లైన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోగి ఆస్పత్రిలో చికిత్స పొందిన సమయంలో పొందిన వైద్య సేవల వివరాలన్నీ వారి ఐడీలో నమోదవుతాయి. అవన్నీ భద్రంగా ఉండటంతో భవిష్యత్తులో ఏదైనా చికిత్స పొందే సమయంలో పూర్వపు చికిత్స వివరాలను వైద్యులు తెలుసుకునే వీలు ఉంటుంది.

పూర్తిస్థాయి సేవలకు ఏర్పాట్లు



ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికీ పూర్తిస్థాయిలో డిజిటల్ సేవలు అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే ఓపీల్లో రోగుల వివరాలను వారి ఐడీల్లో నమోదు చేస్తున్నాం. డయాగ్నోస్టిక్ సేవలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఐపీ రోగుల వివరాలు నమోదు ప్రక్రియ పూర్తిచేశాం. పోస్టుగ్రాడ్యుయేట్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చి పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అన్ని వార్డుల్లో కంప్యూటర్లు, నెట్ సౌకర్యం ఏర్పాటుచేశాం.

– డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్

వందశాతం డిజిటల్ సేవలు



ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతిరోగి వివరాలు వారి ఐడీలో నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి సూచనలతో డిజిటల్ సేవల్లో ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే అన్ని ఓపీల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, రోగుల వివరాలు ఐడీలో నమోదు చేస్తున్నాం. ఐపీ రోగుల వివరాల నమోదు ప్రక్రియను కూడా ప్రారంభించాం. రానున్న రోజుల్లో వంద శాతం డిజిటలైజేషన్ చేసి, కాగిత రహిత సేవలు అందించడమే మా లక్ష్యం.

– డాక్టర్ ఎస్ ఆనంద్, ఈ–ఆస్పత్రి ఇన్‌చార్జి

హోరాహోరీగా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ

సాక్షి అమలాపురం: ఏపీ సీఎం కప్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. రూ.50 లక్షల ప్రైజ్ మనీ క్రీడాపోటీల్లో భాగంగా జోన్–2 పరిధిలోని ఏడు జిల్లాలకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు అమలాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. పురుషులు, మహిళలకు వేర్వేరుగా సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. పురుషుల విభాగంలో సింగిల్స్ ఎ.శ్రీగుణశ్రీకర్ (ఏలూరు) విజేతగా, అదే జిల్లాకు చెందిన బి.కృష్ణమురళి రన్నర్‌గా నిలిచాడు. డబుల్స్ విభాగంలో బి.కిరణ్‌మౌళి (ఏలూరు), జె.జేమ్స్ (కోనసీమ) జంట, కె.సాయి శ్రీరామ్, ఎ.గుణశ్రీకర్ (ఏలూరు) జంట మీద విజేతగా నిలిచింది. మహిళ విభాగంలో సింగిల్స్‌లో ఎం.హాసన్ శ్రీ (కృష్ణా) జిల్లా విజేతగా నిలిచింది. ప్రత్యర్థి మమేక్య (ఎన్టీఆర్)పై 22 –24, 21–14, 23–21 తేడాతో విజయం సాధించింది. డబుల్స్ విభాగంలో మమేక్య (ఎన్టీఆర్), ఎ.అక్షిత (తూర్పు గోదావరి) జంట 21–17, 21–13 తేడాతో సీహెచ్ నయన, కె.పి.ఫణి శ్రీ (పశ్చిమ గోదావరి) జంటపై విజేతగా నిలిచింది.

మనసు దూరగొన్న చిచ్చరపిడుగు

ఈ పోటీల్లో విజయవాడకు చెందిన 12 ఏళ్ల కె.లోహిత్ ప్రత్యర్థి సీనియర్ ర్యాంకింగ్ క్రీడాకారుడిపై చెలరేగి ఆడాడు. ఓటమి చెందినా క్రీడాభిమానుల మనసు దూరగొన్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ బాలుడు మూడో స్థానంలో నిలిచాడు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ బి.వసంతరాయుడు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రంకిరెడ్డి నారాయణరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ, ఓసీ క్లబ్ కారదర్శి ఆర్.కాశీవిశ్వనాథ్, బ్యాడ్మింటన్ చీఫ్ రిఫరీ పాయసం శ్రీనివాస్, పీడీ, పీఈటీలు అడపా శ్రీనివాస్, గొలకోటి శ్రీనివాస్, భీమేష్, కనకదుర్గ, సత్యనారాయణ, కామేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో అసమ్మతి జ్వాలలు

- పెనమలూరులో మూడు వర్గాలుగా చీలిన పార్టీ శ్రేణులు
- బోడె ప్రసాద్‌పై సోషల్ మీడియాలో తీవ్ర ఆరోపణలు
- విజయవాడ సెంట్రల్‌లోనూ ముదురుతున్న విభేదాలు
- బొండా ఉమాకు వ్యతిరేకంగా తమ్ముళ్ల కుంపట్లు
- నాలుగు గ్రూపులుగా విడిపోయిన వైనం



బోడె ప్రసాద్‌పై సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతున్న పోస్టు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: వరుస పరాజయాలను మూటకట్టుకున్న టీడీపీ పరిస్థితి ఉమ్మడి కృష్ణా జిల్లాలో రోజు రోజుకూ మరింతగా దిగజారుతోంది. పెనమలూరు నియోజకవర్గ టీడీపీలో అసమ్మతి బుసలు కొడుతోంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్‌పై ఆ పార్టీ నాయకులు ఏకంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతూ తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలు నాలుగు వర్గాలుగా చీలిపోయారు. ఒకరి మీద మరొకరు కారాలూ మిరియాలు నూరుకొంటున్నారు.

బోడెపై తీవ్ర వ్యతిరేకత

మాజీ ఎమ్మెల్యే, పెనమలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్‌పై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'అసమర్థుడు, చిత్తశుద్ధి లేదు, అవినీతిపరుడు, అధికార దుర్వినియోగం' చేశాడు అంటూ సోషల్ మీడియా వేదికగా టీడీపీలోని ఓ వర్గం బోడెపై తీవ్ర స్థాయిలో తీవ్ర ఆరోపణలు గుప్పిస్తోంది. యలమంచిలి బాబూరాజేంద్ర ప్రసాద్ (వైబీబీ), పండు వర్గాలు, బోడె ప్రసాద్‌పై బహిరంగంగానే విమర్శల దాడి చేస్తున్నాయి. 'మీకు బదులు వేరే వాళ్లతో పరీక్షలు రాయిస్తూ పట్టుబడిన మాట వాస్తవం కాదా' అంటూ బోడెను ప్రశ్నిస్తున్నాయి. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు బోడె ప్రవర్తనతో విసిగి పార్టీ మారారంటూ నిందిస్తున్నాయి.

కోడిపందేలు, పేకాటతో అపఖ్యాతి

బోడె ప్రసాద్ ఈడుపుగల్లులో కోడిపందేలు, పేకాట, క్యాసినో సంస్కృతిని తెచ్చి, ఆయా జూదాల నిర్వాహకుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసిన వైనాన్ని వ్యతిరేక వర్గం నాయకులు ప్రచార అస్త్రంగా మార్చుకున్నారు. ఇప్పటికీ కాల్ మనీ, సెక్స్ రాకెట్, క్యాసినో నిందితులతో అంతర్గత వ్యాపారం ఉన్న మాట వాస్తవం కాదా అని నిలదీస్తున్నారు. వారితో కలిసి పట్టాయి, బ్యాంకాక్, దుబాయ్, మహాబలిపురం తదితర ప్రాంతాలకు ఇటీవలే వెళ్లి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. గతంలోనే ఈడుపుగల్లులో సంక్రాంతి సంబరాలకు క్యాసినో పెట్టాలని గోవా నుంచి యువతులను, సామగ్రిని తెచ్చి హోటల్‌లో ఉంచిన విషయాన్ని మరిచారా అంటూ ప్రశ్నిస్తున్నారు. నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలకు ఆయన అభిమానులు ఆహ్వానిస్తే, అహంకారంతో వ్యవహరించిన బోడె తీరును ఇంకా మర్చిపోలేదంటూ గుర్తుచేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే నిజమైన కార్యకర్తల పరిస్థితి ఏమిటని సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నేతలే బోడె ప్రసాద్‌ను నిలదీయడం పార్టీ దుస్థితికి అద్దంపడుతోంది. ఓడిపోయినా తీరుమారని బోడే అంటూ పోస్టులు పెడుతున్నారు. మరో వైపు సర్పంచ్‌ల సంఘం దొంగ డ్రామాలు అంటూ వైవీబీ వర్గంపై బోడె వర్గం ఎదురుదాడి చేస్తోంది.

సెంట్రల్‌లో నాలుగు ముక్కలాట

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీలో నాలుగు ముక్కలాట సాగుతోంది. నియోజకవర్గంలో బొండా ఉమా సొంతంగా ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు. గత ఎన్నికలకు ముందు ఆయన వద్దకు కొత్తగా వచ్చిన నాయకుడు ఒకరు నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. దీంతో ఆది నుంచి టీడీపీలో ఉన్న తెలుగు తమ్ముళ్లు బొండా ఉమాకు దూరమయ్యారు. ఈ నియోజకవర్గంలో బొండా ఉమాది ఓ వర్గం. కేశినేని చిన్నిది మరో వర్గం. వంగవీటి రాధాది ఇంకో వర్గం. పార్టీని మొదటి నుంచి వెన్నంటి ఉన్నవారు నాలుగో వర్గంగా విడిపోయారు. ఈ నాలుగు గ్రూపులు ఎవరికి వారుగా వ్యవహరిస్తూ, పార్టీలో అసమ్మతిని రాజేస్తున్నారు. ఇటీవల 63 డివిజన్ పరిధిలో అన్నా క్యాంటీన్ వద్ద ఇరువర్గాలు ఎదురుపడి పరస్పరం తిట్ల పురాణంతో రెచ్చిపోయాయి. చొక్కాలు పట్టుకొని కొట్టుకొనేంత స్థాయికి వెళ్లడంతో అక్కడే ఉన్న పోలీసులు సర్ది చెప్పాల్సిన పరిస్థితి తలెత్తింది. పార్టీ నాయకులే గ్రూపులుగా విడిపోవడంతో కార్యకర్తలు సైతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో పార్టీ నేతల మధ్య అసమ్మతి పార్టీ పుట్టి ముంచడం ఖాయమనే భావన సొంత పార్టీ కార్యకర్తల్లోనే వ్యక్తమవుతోంది.

ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పనే లక్ష్యం

ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పిస్తూ ఆకలి మరణాలు లేని ఆరోగ్యకర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నదే ఫుడ్ కమిషన్ లక్ష్యమని ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, ప్రధానమంత్రి వందన యోజన, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో విజయ్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తోందని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో బాధ్యతలు స్వీకరించిన తాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలతోపాటు, నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థకు సంబంధించి తనిఖీలు నిర్వహించానన్నారు. జిల్లాలో అత్యధికంగా 44 చోట్ల నిర్వహించిన తనిఖీలు సంతృప్తి ఇచ్చాయన్నారు. జిల్లాలోని వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన ఉండడం సంతోషాన్నిచ్చిందన్నారు. గతంలో పౌరసరఫరాల శాఖలో పనిచేసిన ఢిల్లీరావు జిల్లా కలెక్టర్‌గా ఉండటం పౌరసరఫరాల వ్యవస్థకు మంచి పరిణామమని అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా సహకరించాలని అధికారులను విజయ్ ప్రతాప్‌రెడ్డి కోరారు.

నిల్వ పదార్థాలను వెనక్కు పంపాలి

వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో 85 నుంచి 95 శాతం విద్యార్థులు భోజనం చేయడం గమనించామని ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఒకటి, రెండు చోట్ల విద్యార్థుల ఫిర్యాదుల మేరకు లోపాలను సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ఆరు నెలలుగా నిల్వ ఉన్న ఆయిల్, కందిపప్పు వంటి వాటిని వాడకుండా తిరిగి వెనక్కు పంపాలని సూచించారు. ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లోని బాలికల సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఆహారం సరిగా లేదని ఫుడ్ కమిషన్ ఛైర్మన్ దృష్టికి రావడంతో అక్కడి పరిస్థితులను వెంటనే పరిశీలించి నివేదికను సమర్పించాలని డీఈఓను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి, డెప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, డీఎస్‌ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ.10.58 లక్షల ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.10,58,940 నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాల్లో దేవతామూర్తులకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను మహా మండపం ఆరో అంతస్తులో మంగళవారం కూడా లెక్కించారు. సోమవారం జరిగిన కానుకల లెక్కింపులో రూ.3.32 కోట్ల మేర ఆదాయం సమకూరిన విషయం పాఠకులకు తెలిసిందే. భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో ఆలయంలోని హుండీల కానుకలను దేవస్థానం అధికారులు లెక్కించారు. ఆలయ ఈఓ భ్రమరాంబ పర్యవేక్షించగా, ఆలయ సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య


మృతుడు వరుణ్

పెనమలూరు: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పానుగుమాటి కిషోర్‌బాబు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు వరుణ్ (25) దురలవాట్లకు బానిస అవ్వటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో అతను సోమవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఆలస్యంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి


దాసరి పెదరామయ్య (ఫైల్)

రామవరప్పాడు(గన్నవరం): ట్రాన్స్‌ఫారంపై మరమ్మతులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురైన లైన్‌మెన్ మృతి చెందిన ఘటన మంగళవారం రామవరప్పాడులో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఫ్లై ఓవర్ సమీపంలో దాసరి పెద రామయ్య (45) తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. రామయ్య వృత్తిరీత్యా విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉదయం గ్రామంలోని రాజుల బజార్‌లో ఓ ట్రాన్స్‌ఫారానికి ఫ్యూజు వేసే నిమిత్తం వెళ్లాడు. విద్యుత్ లైన్ ఆఫ్ చేసి ట్రాన్స్‌ఫారం ఎక్కి ఫ్యూజు వేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్ పాస్ అయ్యి షాక్ కొట్టింది. దీంతో పై నుంచి రామయ్య కింద ర్యాంపుపై పడటంతో కోణాలు తలకు గుచ్చుకుని తీవ్ర రక్తస్రావమైంది. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతునికి కుమారుడు, కుమార్తె సంతానం. గత 16 ఏళ్లుగా విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా సేవలందిస్తున్న రామయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

14వ శతాబ్దానికి చెందిన ఆలయాన్ని పరిరక్షించుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విజయవాడ నగరానికి సమీపంలోని కొత్తూరు గ్రామంలో వసంతరాయుని కొండపై ఉన్న వసంత నరసింహ స్వామి దేవాలయాన్ని పరిరక్షించాలని చరిత్ర పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్ తరాలకు అందించేందుకు సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తూరు గ్రామంలో పర్యటించామని చెప్పారు. 14వ శతాబ్దానికి చెందిన చెందిన ఈ ఆలయ ఆవరణలో క్రీస్తు శకం 1390 నాటి రాతి శాసనం పడి పోయి ఉందన్నారు. దానిపై కర్పూర వసంతరాయలు అనే బిరుదు గల కొండవీటి రెడ్డిరాజు ఈ ఆలయాన్ని కట్టించారని రాసి ఉందన్నారు. ప్రస్తుతం ఆలయం గర్భాలయ మండపాలు శిథిలమై పోయి ఆలయం గోడలపై రావిచెట్టు పెరిగి, గోడలు, ఆలయ శిఖరం బీటలువారాయని వివరించారు.


శిథిలమైన ఆలయాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తే.. పర్యాటక కేంద్రంగా తయారవుతుందని శివనాగిరెడ్డి సూచించారు. గోళ్ల నారాయణరావు, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, మేడసాని శుభాకర్‌తో కలిసి పర్యటించినట్లుగా తెలియజేశారు.

తెలుగు ఖ్యాతిని ఇనుమడింపజేయండి

శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి

విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడా వేదికపై సత్తా చాటి తెలుగు ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) వీసీ, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి ఏపీ, తెలంగాణ సివిల్ సర్వీస్ ఉద్యోగుల టెన్నిస్ జట్లకు సూచించారు. హరియాణాలో జరుగుతున్న సివిల్ సర్వీస్ ఉద్యోగుల జాతీయ పోటీలను ప్రభాకరరెడ్డి మంగళవారం పరిశీలించి ఈ పోటీలను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్ర, తెలంగాణ జట్ల క్రీడాకారులను



మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జాతీయ పోటీల్లో పతకం సాధించి తెలుగు నేలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అవతార్ కోసం త్రీడీ తెర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అవతార్ –2 చిత్రం ఈనెల 16వ తేదీన రిలీజ్ కానున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని శైలజా థియేటర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం ప్రత్యేకంగా త్రీడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మంగళవారం థియేటర్‌లో ఏర్పాటు చేసిన త్రీడీ స్క్రీన్‌ను మేనేజర్ బాబీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవతార్– 2 సినిమా విడుదల సందర్భంగా ప్రేక్షకులను కనువిందు చేసేందుకు త్రీడీ తెర ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముంబై నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి నిపుణుల పర్యవేక్షణలో థియేటర్‌లో అమర్చినట్లు చెప్పారు. ప్రస్తుతం


శైలజ థియేటర్‌లో నూతన ఏర్పాటు చేసిన త్రీడీ టెక్నాలజీతో కూడిన తెర

ఉన్న 2.6 గైన్ నుంచి 3.8 గైన్ స్క్రీన్ అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. అవతార్ సినిమాకు బుకింగ్ ప్రారంభించామని, రోజూ ఐదు షోలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

‘పట్టు’ దొరికింది

- హోరాహోరీగా జగనన్న కబడ్డీ పోటీలు
- జోన్–2 విజేతలుగా కాకినాడ, కృష్ణా జిల్లా జట్లు



పురుషుల విభాగంలో విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు



మహిళల విభాగంలో విజేత కృష్ణాజిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

విజయవాడ స్పోర్ట్స్: జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా జోన్–2 సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర జోన్–2 పరిధిలోని కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జట్లు ఈ పోటీలను ప్రాతినిధ్యం వహించి హోరాహోరీగా తలపడ్డాయి. రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల బహుమతితో ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రీడా ప్రతిభను చాటేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఈ నెల 21వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం రోజున రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. ఈ పోటీలను శాప్ స్పోర్ట్స్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్, కోచ్‌లు, 20 మంది పీఈటీలు పర్యవేక్షించారు.

విజేతలు వీరే..

- పురుషుల విభాగంలో హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో జగ్గంపేట నియోజకవర్గం (కాకినాడ జిల్లా) జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని ముమ్మిడివరం నియోజకవర్గం(కోనసీమ జిల్లా) జట్టు రెండో స్థానాన్ని సాధించింది. మూడో స్థానాన్ని గుడివాడ నియోజకవర్గం (కృష్ణా జిల్లా జట్టు), రాజమండ్రి అర్బన్ నియోజకవర్గ జట్టు (తూర్పు గోదావరి జిల్లా) సంయుక్తంగా పంచుకున్నాయి.
- మహిళల విభాగంలో అవనిగడ్డ నియోజకవర్గం (కృష్ణాజిల్లా) ప్రథమ, నరసాపురం నియోజకవర్గం (పశ్చిమ గోదావరి) రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. మూడో స్థానంలో జగ్గంపేట నియోజకవర్గం (కాకినాడ జిల్లా), రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం (తూర్పు గోదావరి జిల్లా) జట్లు సంయుక్తంగా నిలిచాయి.
- విజేతలకు శాప్ స్పోర్ట్స్ ఆఫీసర్ నరసింహారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ ట్రోఫీలను అందజేశారు.


ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి


క్రీడాకారులతో కలసి కబడ్డీ ఆడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

రేపటి నుంచి భవానీ దీక్ష విరమణలు

- గురువారం ఉదయం 6.30 గంటలకు అగ్నిప్రతిష్టాపన
- ఏడు లక్షల మంది విచ్చేస్తారని అంచనా
- సిద్ధమైన ఆరు లక్షల లడ్డూలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం నుంచి భవానీ దీక్ష విరమణలు ప్రారంభం కానున్నాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు మహా మండపం దిగువన హోమ గుండాలలో అగ్నిప్రతిష్టాపనతో దీక్ష విరమణలు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులతో పాటు వైదిక కమిటీ సభ్యులు ప్రధాన ఆలయం నుంచి జ్యోతిని వెలిగించి ఊరేగింపుగా హోమగుండాలకు చేరుకుంటారు. ఆలయ అర్చకులు ఆలయం నుంచి బయలుదేరిన తర్వాత అమ్మవారి దర్శనానికి భవానీలను అనుమతిస్తారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపం వద్దకు చేరుకున్న భవానీలు ఇరుముడులను సమర్పించిన అనంతరం హోమగుండాలలో నేతి కొబ్బరి కాయలను సమర్పిస్తారు. దీక్ష విరమణలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దేవస్థానం పూర్తి చేసింది. అమ్మవారి


విద్యుత్ దీప కాంతులతో వెలిగిపోతున్న దుర్గగుడి

ఆలయంతో పాటు మహా మండపం, దేవస్థాన ఘాట్‌రోడ్డు, ఆలయానికి చేరుకునే అన్ని మార్గాలలో రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భవానీలు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ. 500 టికెట్లు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకునేలా దేవస్థానం మొత్తం 5 క్యూలైన్లు ఏర్పాటు చేసింది. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, స్నాన ఘాట్లలో జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేసింది. ఈ ఐదు రోజులు భవానీలతో పాటు సామాన్య భక్తులు సైతం క్యూలైన్‌లోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. ఇతరులనెవరిని క్యూలైన్ బయట నుంచి దేవస్థానానికి అనుమతించరు. మరోవైపు దీక్ష విరమణలను పురస్కరించుకుని దేవస్థానం ఇప్పటికే ఆరు లక్షల లడ్డూలను సిద్ధం చేసింది. 5 రోజుల పాటు సాగే దీక్ష విరమణలకు మొత్తం 7 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

చెకుముకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్రభవాని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల భవానీపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పట్నాయక్, హేమంత్, విన్యాస్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయిలో కడపలో జరిగే చెకుముకి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

కొత్త వస్త్రాలు కొనలేదని యువకుడు బలవన్మరణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పుట్టిన రోజుకు కొత్త బట్టలు కొనలేదనే ఆవేశంలో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఘటనపై మృతుని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట వేసుపోగు వీధిలో పఠాన్ సలాం కుటుంబం నివాసం ఉంటుంది. సలాం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సలాంకు ఇద్దరు సంతానం కాగా కుమార్తెకు వివాహమైంది. కుమారుడు పఠాన్ గాలిబ్(21) చికెన్ షాపులో పని చేస్తుంటాడు. మంగళవారం గాలిబ్ పుట్టినరోజు కావడంతో బట్టలు కొనుక్కునేందుకు డబ్బులు కావాలని తల్లి, తండ్రిని అడిగాడు. దీంతో తండ్రి కొత్త బట్టలు మంగళవారం ఉదయం కొని ఇస్తానని చెప్పాడు. గాలిబ్ ఇంట్లో ఉండగా, బట్టలు, సేమియా కొనేందుకు తల్లి మార్కెట్‌కు బయలుదేరింది. రాత్రి మార్కెట్ నుంచి తిరిగి రాక ఇంట్లో ఐరన్ రాడ్‌కు చీరతో గాలిబ్ ఉరి వేసుకోవడంతో వెంటనే చుట్టు పక్కల వారి సాయంతో కిందకు దింపి, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాలిబ్‌ను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుని తండ్రి సలాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కోడి పందేలు వేస్తున్న ఎనిమిది మంది అరెస్టు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో కోడిపందెం ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సమీపంలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు ఆ శిబిరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ. 6,850 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవర్చాలి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవర్చాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు ఎస్.సురేష్ కుమార్ సూచించారు. పటమటలోని కోనేరు బుచ్చయ్య చౌదరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ బుక్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ‘ఎన్.బి.టి.కృష్ణా పుస్తక పరిక్రమ’ సంచార పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహా రాష్ట్రాల మార్గాల్లో సుమారు 45 రోజుల పాటు సాగే ఈ పరిక్రమ యాత్ర పుస్తక ప్రియులకు గొప్ప వరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా తెలుగు సంపాదకుడు, దక్షిణ ప్రాంత ఆఫీసర్ ఇన్‌చార్జి


వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్

డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా దేశ వ్యాప్తంగా పుస్తక సంస్కృతి వ్యాప్తి కోసం పని చేస్తోందని, పుస్తక వికాస కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది దేశంలోని వివిధ నదీతీరాల వెంట సంచార పుస్తక ప్రదర్శన నిర్వహిస్తోందన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక, పరిశోధనాత్మక విద్య అవసరం

ఉయ్యూరు(పెనమలూరు): ప్రయోగాత్మక, పరిశోధనాత్మక విద్య నేటి తరానికి అవసరమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్‌రావు అన్నారు. స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో ఐక్యూ, పరిశోధనా శాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో పరిశోధనా ప్రాముఖ్యత, పద్ధతులపై జాతీయస్థాయి సెమినార్ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ రామమోహన్‌రావు మాట్లాడుతూ పరిశోధనలతో క్లిష్టమైన ఆలోచనా విధానాన్ని మార్చుతుందన్నారు. వాస్తవాలను తెలుసుకోవటానికి, పరిష్కార మార్గాన్ని అన్వేషించేందుకు ప్రయోగం, పరిశోధన దోహదపడతాయన్నారు. రీసోర్స్ పర్సన్ డాక్టర్ పి.బ్రహ్మచారి మాట్లాడుతూ స్టార్టప్, పరిశోధనా పద్ధతులు మధ్య సంబంధాలను వివరించారు. డిగ్రీ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ప్రొఫెసర్‌లు డాక్టర్ తుమ్మల చంద్రశేఖర్, రామ న్‌ఫెలో, డాక్టర్ జయశంకర్‌ప్రసాద్, డాక్టర్ రాజేష్ పరిశోధనా ప్రక్రియలపై అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామమోహన్‌రావు

విద్యుత్ షాక్‌తో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): విద్యుత్‌షాక్‌కు గురై ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటనపై బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన చలమలశెట్టి సాయిప్రసాద్ (22) విజయవాడలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 12వ తేదీ గ్రామంలోని ఓ చర్చిలో డెకరేషన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు సాయిప్రసాద్ విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. తోటి స్నేహితులు, గ్రామస్తులు హుటాహుటిన వైద్యం నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే సాయిప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.


సాయిప్రసాద్ (ఫైల్)

డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కళాశాలలోని స్కిల్ హబ్‌లో అకౌంటెంట్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణులతో శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తారని తెలిపారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఆపైన చదివిన 30 ఏళ్ల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8919951682 లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రోజువారీ విధుల్లో హిందీ తప్పనిసరి

వర్కుషాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వర్కుషాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అధికారిక కార్యకలాపాలలో తప్పనిసరిగా హిందీని ఉపయోగించడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యతని రాయనపాడు వర్కుషాపు చీఫ్ మేనేజర్, వర్కుషాపు అధికార భాష అమలు కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. వ్యాగన్ వర్కుషాపులో అధికార భాష అమలు కమిటీ త్రైమాసిక సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వర్కుషాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు వర్కుషాపులో అధికార భాష అమలులో సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేరుకోవాల్సిన లక్ష్యాలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగీ తప్పనిసరిగా రాజభాష హిందీని వాడాలన్నారు. వర్కుషాపులో పార్లమెంటరీ కమిటీ తనిఖీలు ఎప్పుడైనా జరగొచ్చని, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సీనియర్ అనువాదకుడు డి.రామప్రసాద్ మాట్లాడుతూ వర్కుషాపులో హిందీ భాష అమలులో భాగంగా సిబ్బందికి శిక్షణ తరగతులు, ఆన్‌లైన్ తరగతులు, వర్కుషాపులు, సెమినార్లు నిర్వహించి ప్రోత్సహిస్తున్న కమిటీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ రాజభాష అధికారి, డిప్యూటీ చీఫ్ మెటీరియల్ మేనేజర్ హెమరాజ్ మీనా, డిప్యూటీ సీఎంఈ కె.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కెవీ మసీదు ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా బుధవారం కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు భవానీపురంలోని అల్లుడు పేట, బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, రాజేంద్ర వీధి, నాగార్జున వీధి, మసీదు రోడ్, రంగూన్ సాహెబ్ వీధి, కరకట్ట రోడ్, ఆలివ్ ట్రీ హోటల్ వెనుక భాగం, రీజనల్ సైన్స్ సెంటర్ ఏరియా, కోళ్ల ఫారం రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండబోదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాడి కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తీసుకున్న డబ్బు లు తిరిగి చెల్లించమని అడిగినందుకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు సొరంగం ప్రాంతానికి చెందిన కావేటి అనిల్‌కుమార్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. అనిల్‌కుమార్‌కు పరిచయం ఉన్న రామారావు, వంశీ, మహేష్ అనే వారికి రూ.1.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంత కాలంగా తీసుకున్న డబ్బులు ఇవ్వమని అడిగినా సమాధానం చెప్పకపోవడంతో అనిల్‌కుమార్ మంగళవారం తన భార్య, పిల్లలను తీసుకుని రామారావు ఇంటికి వెళ్లాడు. తనకు బాకీ ఉన్న డబ్బులు తిరిగి ఇవ్వాలని రామారావును అడిగాడు. దీంతో రామారావు అనిల్‌కుమార్‌తో గొడవ పడ్డాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన వంశీ, మహేష్ కూడా అనిల్‌కుమార్‌పై దాడి చేశారు. అనిల్‌కుమార్‌కు గాయాలు కాగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్‌ఎస్‌ఎం విద్యార్థుల ప్రతిభ



పటమట(విజయవాడతూర్పు): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్సీ) క్లస్టర్-07 పేరుతో ఈ నెల 9–11 తేదీల వరకు హైదరాబాదులోని ఆలీవ్‌మౌంట్ గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్–2022 పోటీల్లో ఎన్‌ఎస్‌ఎం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం టీటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్–07 పోటీల్లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో తమ పాఠశాల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న సంవేద్, సన్నిత వ్యక్తిగత విభాగంలో మొదటి విభాగంలో గెలుపొందారని, బృంద విభాగంలో పాఠశాల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి జనవరిలో పెద్దాపురంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని, విద్యతో పాటు తమ విద్యార్థులు అన్ని రంగాల్లో వారి అభిరుచికి అనుగుణంగా తర్ఫీదు ఇస్తామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మౌంట్‌ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి అభినందించారు.

అభివృద్ధే ప్రభుత్వ నినాదం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



11వ డివిజన్‌లో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేసిన దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఆయన పటమటలోని 11వ డివిజన్‌లో కనకదుర్గ కాలనీ రూ. 9లక్షలతో బి.టి రోడ్, 13వ డివిజన్‌లో నల్లూరి పాపయ్య స్ట్రీట్ బి.టి రోడ్ రూ.20లక్షలతో అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, హామీ ఇచ్చిన ప్రతి అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పనులు పూర్తి అయ్యేలా నిరంతర పర్యవేక్షణ చేస్తూ నాణ్యత లోపం లేకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి ప్రచారం చేసుకోవడం తప్ప పనుల పురోగతి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. టీడీపీ శంకుస్థాపన చేసిన ఎన్నో పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తిచేసిందన్నారు. మూడేళ్లలో నియోజకవర్గంలో మేము చేపట్టిన రూ.400 కోట్ల అభివృద్ధి పనులే తమ చిత్తశుద్ధిని నిదర్శమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధంతా కంప్యూటర్ స్క్రీన్ మీద, టీడీపీ అనుకూల మీడియా మినహా వాస్తవ రూపంలోకి రాలేదని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఎన్ని పాదయాత్రలు, బస్ యాత్రలు చేసిన ప్రజల గుండెల్లో సీఎం జగన్ స్థానం చెక్కుచెదరదని, ప్రజల సంపూర్ణ మద్దతు మళ్లీ ఆయన్నే సీఎంగా ఎన్నుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, 13వ డివిజన్ రామాయణపు శ్రీనివాస్, పార్టీ నాయకులు జమ్ముల ప్రసాద్, త్రిపురనేని చందు, చిమటా బుజ్జి, సన్నీ, కొల ఉమ, కోటం రాజు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు, చిత్రంలో దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): వృద్ధులు, మహిళలకు ఆసరాగా నిలిచే వైఎస్సార్ పింఛన్‌ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను పెంచుతూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం లబ్ధిదారుల్లో ఆనందోత్సాలను నింపింది. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని లబ్ధిదారులైన మహిళలు, వృద్ధులు సీఎం జగన్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.250 పెంచడంతో వచ్చే నెల నుంచి లబ్ధిదారులు రూ. 2,750 అందుకుంటారన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు ఎన్నికల ముందు మాత్రమే పింఛన్‌ను పెంచి ఓటర్లను ఆకర్షించేందుకు విఫలయత్నం చేశారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను తూచా తప్పకుండా పాటిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దుక్కుతోందన్నారు. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే పింఛన్‌ను అందించడంతో పాటు తాజాగా పింఛన్‌ను పెంచి ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుల సీఎం జగన్ అండగా నిలుస్తున్నాడని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కోటి నాగులు, డేవిడ్‌రాజు, చినబాబు, సొంగా రాజ్‌కమల్, శెటికం దుర్గాప్రసాద్, నాని పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెక్నికల్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ జి.రవి గుజ్జుల అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో సీడీఎస్ఇ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించి పోటీతత్వాన్ని చాటుకున్నారు. జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. తొలుత ఎగ్జిబిషన్‌ను డాక్టర్ జి.రవి గుజ్జుల ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నలంద విద్యానికేతన్ యాజమాన్యం ఇలాంటి విజ్ఞానదాయకమైన కార్యక్రమం చేపట్టడం ఎంతో ఆనందించదగిన విషయమన్నారు. ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ నేటి పోటీ యుగంలో విద్య కేవలం చదవడం, రాయడం మాత్రమే కాదని, విద్యావేత్తలు ఎల్లప్పుడూ విద్యార్థుల సృజనాత్మక ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేయాలన్నారు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో సైన్స్, టెక్నాలజీపై ఆసక్తిని కలిగించి వారిలో సృజనాత్మకత వెలికి తీసేందుకు నలంద విద్యానికేతన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా సీబీఎస్ఈ నుంచి ఎంపిక చేసిన వి.జగదీష్, కె తిరుమలప్రసాద్, కె.కిరణ్‌కుమార్, డీవీ కరుణకుమార్, డాక్టర్ ఎం.సెంథిల్ మురుగన్, డాక్టర్ పి.శ్రీనివాస్‌చక్రవర్తి తదితరులు విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలను పర్యవేక్షించారు.

మాదక ద్రవ్య రహిత రాష్ట్రానికి కృషి చేయాలి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ రవికిరణ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ అన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికిరణ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన కుటుంబ స్థాయి నుంచే మార్పురావాలన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని మహిళా పోలీసులు గుర్తించి వారికి సరైన అవగాహన కల్పించాలన్నారు. అలాగే కౌన్సిలింగ్ నిర్వహించి డీ ఎడిక్షన్ సెంటర్లకు పంపించి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా తీసుకుని పనిచేయాలని సూచించారు. కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థులు జీవితాన్ని నిలువెల్లా నాశనం చేసుకుంటున్నారన్నారు. సరదాగా అలవాటు చేసుకుని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో సచివాలయ మహిళా పోలీసులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. నవజీవన్ బాలభవన్ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ షీలా నికోలస్, సైకాలజిస్ట్ జి.అనూష మాట్లాడుతూ మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై స్క్రీన్, ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో–ఆర్డినేటర్ జె.ఆంజనేయులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వ్యసనం నుంచి డి ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. నూజివీడు మండలం పొనసనపల్లిలో ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాలభవన్ బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇతర వివరాలకు 9490492020లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అడ్వొకేట్ ఎం.దేవదానం, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు, జె.వాణి, శ్రీవల్లీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): కూలి చేసుకునే వ్యక్తి గుండెపోటుతో మరణించగా, ఆ కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారాన్ని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత మంగళవారం అందజేశారు. గిరిపురంలో నివశించే చిరువూరు రవికిరణ్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రెండు నెలల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ వరలక్ష్మితో కలిసి కార్పొరేటర్ కుక్కల అనిత మృతుడి భార్య ఉషకు ఆ నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కుక్కల రమేష్, కొమ్ము చంటి పాల్గొన్నారు.

16న దత్తపీఠంలో అనఘాష్టమి వ్రతం

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని గణపతిసచ్చిదానంద ఆశ్రమం, అవధూత దత్త పీఠంలో దత్త విజయానందతీర్థ స్వామి, జయలక్ష్మీ మాతృమండలి విజయవాడశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ 9.30 గంటలకు ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు మండలి కన్వీనర్ స్రవంతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోకకల్యాణార్థం, భక్తుల సమస్త కోరికలు తీరేందుకు, సంపద వృద్ధి చెందేందుకు ఈ వ్రతం నిర్వహిస్తున్నామని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు. వివరాలకు 9491636317లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండో విడత బోనస్ రూ.19 కోట్లు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాడి రైతులకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత బోనస్ (ఆగస్టు నుంచి నవంబర్ వరకు)గా రూ.19 కోట్లు చెల్లిస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పాలప్రాజెక్టు ఆవరణలోని పాల ఉత్పత్తిదారుల సమావేశ మందిరంలో మంగళవారం మైలవరం క్లస్టర్ పరిధిలోని పాల సంఘాలకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులను ఉద్దేశించి ఆంజనేయులు ప్రసంగించారు. ఈ ఏడాది కృష్ణా మిల్క్ యూనియన్ రికార్డు స్థాయిలో పాలసేకరణ చేస్తోందన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 4.6 కోట్ల లీటర్ల పాలను సేకరించామని తెలిపారు. ఈ ఏడాది 6.08 కోట్ల లీటర్ల పాల సేకరణ జరిగిందని, ఇది గత ఏడాది కంటే 32 శాతం అధికమని వివరించారు. రెండో విడత బోనస్‌గా మైలవరం క్లస్టర్ పరిధిలోని 110 పాల సంఘాలకు రూ.1.40 కోట్లు చెల్లించామన్నారు. ఈ సందర్భంగా పాల సంఘాల అధ్యక్షులకు చలసాని ఆంజనేయులు చెక్కులను పంపిణీ చేశారు. 2022–23లో రూ.1150 కోట్ల టర్నోవర్ లక్ష్యమని తెలిపారు. ఎండీ కొల్లి ఈశ్వర బాబు, జిల్లా పాలక వర్గ సభ్యులు అంజిరెడ్డి, కొండలరావు, ఫీడ్ కమిటీ సభ్యులు యు.నాగరాజు, జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్, మైలవరం క్లస్టర్ మేనేజర్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

రథం సెంటర్లో గుర్తుతెలియని మృతదేహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని రథం సెంటర్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు రథం సెంటర్ సమీపంలోని ఫ్లెక్సీవర్ ఫిల్లర్ దిగువన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని గుర్తించారు.

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం



పటమట(విజయవాడతూర్పు): మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అన్నారు. ఆయన వీఎంసీ సిబ్బంది, కార్మికులతో పలు అంశాలపై మంగళవారం చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో అవుట్‌సోర్సింగ్ వర్కర్ల కనీస వేతనాన్ని ప్రభుత్వం పెంపుదల చేయాలని తాము ప్రతిపాదన చేశామన్నారు. దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని, పారిశుద్ధ్య కార్మికులకు వారాంతరపు సెలవు దినాలు ప్రకటించాలని, పర్మినెంట్ కార్మికులకు జీపీఎఫ్ అకౌంట్లను అమలు చేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేశామన్నారు. దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్మికులు ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, శివకుమార్, రాంబాబు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రోడ్డు నాణ్యతా ప్రమాణాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అధికారులు నిరంతర పర్యవేక్షణలోనే ఆయా డివిజన్లలో అభివృద్ధి పనులు జరగాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన అధికారులతో కలసి సర్కిల్–3 పరిధిలోని 4వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీ రోడ్ నంబరు 3, 4 లో నూతనంగా అభివృద్ధి చేసిన సీసీ రోడ్లను, 19వ డివిజన్ వై.వి.రావు హాస్పిటల్ వద్ద పైడియ్య పిచ్చియ్య రోడ్డు రీబౌండ్ హ్యామర్‌తో పనుల నాణ్యతను, రోడ్డు లోతు పరిమాణం నిబంధన ప్రకారం ఉన్నదీ, లేనిదీ స్వయంగా పరిశీలించారు. అనంతరం తదితర ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల నాణ్యత, పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగితెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయా రోడ్లలో జరుగుతున్న డ్రెయిన్ పనుల పురోగతిని పర్యవేక్షించారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. వెటర్నరీ కాలనీలోని డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్, డ్రెయిన్స్ పారుదల విధానాన్ని, రిజర్వాయర్ నిర్వహణ తీరు పర్యవేక్షించి డ్రెయిన్లలో అడ్డుగా చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంక్ శుద్ధి వివరాలతో కూడా బోర్డు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎప్పటికప్పుడు ట్యాంకు క్లీనింగ్ సమయం, తేదీలను ప్రదర్శించాలని, రిజర్వాయర్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్క్రాప్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈఈ చంద్ర శేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవాలు యాప్‌లో నమోదు చేయండి

డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



ప్రభుత్వాస్పత్రి ప్రసూతి వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో జరిగే ప్రసవాలను వెంటనే మాతృ శిశు సంరక్షణ యాప్‌లో నమోదు చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంఎహెచ్ఓ) డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. పాత ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి విభాగ వైద్యులతో ఆమె మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో జరిగే ప్రతి కాన్పును ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయడం ద్వారా బాలింతలకు ఆరోగ్య ఆసరా వర్తిస్తుందన్నారు. అందుకు నిర్వహించాల్సిన ప్రక్రియను వివరించారు. ప్రతి ప్రసవానికి ఇ–జీవన్ పై వర్తింపు ద్వారా రూ.1000లు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వైద్యులను ఆదేశించారు. అదేవిధంగా ఆస్పత్రిలో కాన్పులు, మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై సమీక్షించారు. సమావేశంలో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు, డీసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీకుమారి, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా



కేసులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి రామమోహన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్ట్ కార్యకలాపాల్లో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి యు రామమోహన్ మంగళవారం నగరపాలక సంస్థ సర్కిల్–1 కార్యాలయంలో మొబైల్ కోర్ట్ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించినవారిపై శానిటరీ ఇనస్పెక్టర్లు నమోదు చేసిన 34 కేసులకు సంబంధించి వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఈ కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలేస్తున్న వ్యక్తులు, రోడ్లపై చెత్త వేసేవారు ఉన్నారు. ఆయా నేరాల కింద వారికి న్యాయమూర్తి రామమోహన్ రూ. 16,710ను జరిమానాను విధించారు. మరోమారు ఇదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడ నగరాన్ని తీర్చిదిద్దేందుకు శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ప్రతి రోజూ తమతమ డివిజన్లలో పర్యటించి ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించే షాపులను తనిఖీ చేసి ప్లాసిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్కిల్–1 జోనల్ కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన స్టెల్లా కాలేజీ



నెట్‌బాల్ జాతీయ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న స్టెల్లా కాలేజీ ప్రిన్సిపాల్ జసింతక్వాడ్రస్

విజయవాడ స్పోర్ట్స్: నెట్‌బాల్ జాతీయ సీనియర్ మహిళల పోటీల్లో విజయవాడ మేరీస్ స్టెల్లా కాలేజీ విద్యార్థినులు సత్తా చాటారు. ఈ నెల 10,11 తేదీల్లో తమిళనాడులోని చిక్‌మంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో స్టెల్లా కాలేజీ విద్యార్థినులు పి.భవానీసాయి (ఎంబీఏ), పి.హరిత (బీఏ), పి.శ్రావ్య (బీఎస్సీ) రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర జట్టు తృతీయ బహుమతి సాధించేందుకు కాలేజీ విద్యార్థునులు అద్భుత ఆట తీరు ప్రదర్శించడం అభినందనీయమని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతాక్వాడ్రస్ అన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులను కాలేజీలో మంగళవారం ఆమె అభినందించారు. కార్యక్రమంలో కోచ్ రాజ్‌కుమార్, పీడీ సునీత పాల్గొన్నారు.

ఆత్యాపాత్యా రాష్ట్ర జట్టుకు విజయవాడ క్రీడాకారులు



ఆత్యా పాత్యా జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం

విజయవాడ స్పోర్ట్స్: ఆత్యా పాత్యా సబ్ జూనియర్ రాష్ట్ర జట్టులో విజయవాడ క్రైస్ట్ ద కింగ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు చోటు దక్కించుకున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థులు ఎన్.రాకేష్, శ్రీనాథ్, ఎం.దినేష్, బి.మణికంఠ, ఎస్.సాయి సందీప్ బాలుర జట్టుకు, బాలికల జట్టుకు ఎ.సోనారిక, కె.హరిత, కె.వర్షిత, కె.హేమంత్, పి.దుర్గాభవాని, కె.హాసిని ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారిని ప్రధానోపాధ్యాయిని జాస్పిన్, డిప్యూటీ హెచ్ఎం పుష్ప మంగళవారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

మంగళ సూత్రాల బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన వధువు మౌనికదేవి వివాహం బుధవారం జరగనున్న క్రమంలో వన్‌టౌన్‌కు చెందిన అప్పన వెంకట కృష్ణయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకట సత్యసాయిబాబు, వెంకట మధురవాణీ దంపతులు వధువుకు మంగళసూత్రాలు బహూకరించారు. వధూవరులు మౌనిక దేవి, అమరసాయి చిరంజీవికి వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు.

సంకల్ప సిద్ధి కేసులో టీడీపీ అసత్య ఆరోపణలు

- ఈ కేసుతో మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యే వంశీలకు ముడిపెట్టడాన్ని ఖండిస్తున్నాం
- న్యాయవాదులు చిరంజీవి, శ్రీనివాసరావు స్పష్టీకరణ



విజయవాడ స్పోర్ట్స్: సంకల్ప సిద్ధి కేసుతో మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీలకు ముడిపెట్టి టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని హైకోర్టు న్యాయవాదులు తాడికొండ చిరంజీవి, బర్రె శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుపై త్వరగా విచారణ జరిపి దోషులను అదుపులోకి తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ డీజీపీకి ఇటీవల వినతిపత్రం ఇచ్చారన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఈ కేసులో అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఐడీ చీఫ్ సునీల్, పోలీస్ కమిషనర్ టీకే రాణా పేర్లను ప్రస్తావించడాన్ని వారు ఖండించారు. సీఐడీ విచారణను చెంచా విచారణ అని సంబోధించడం పట్టాభి అహంకారానికి పరాకాష్ట అన్నారు. ఈ కేసుతో సంబంధం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని వల్లభనేని వంశీ గతంలోనే ప్రకటించినట్టు గుర్తు చేశారు. అసత్య ఆరోపణలు చేస్తున్న పట్టాభికి లిఖిత పూర్వకంగా నోటీసులు ఇచ్చామన్నారు. పట్టాభిపై కేసు నమోదు చేసి రాష్ట్ర బహిష్కరణ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఓపెన్ ఇ-టెండరు నోటీస్ నం.: DRM/Works/SC/174-184/2022/OT, తేది: 09-12-2022

PUB/1101

భారత రాష్ట్రపతి తరఫున క్రిందినంతకందారు దిగువ తెలిపిన పనుల కోసం 04-01-2023న 14.00 గం. వరకు ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.01, ఇ-టెండర్ నం.: 174_CR_SC_22_OT, పని పేరు: **WD-SC-KZJ సెక్షన్: SW 1).** ADEN/E/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/SC సెక్షన్‌లో HSJ-MLY స్టేషన్ మధ్య UP,DN & థర్డ్ లైన్స్‌పై కి.మీ. 199.00. నుండి 202.30 వరకు మరియు SNF-MLY స్టేషన్ల మధ్య SL పై 11/8 నుండి 22/1 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/E/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/SC సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 99,82,677/- **బయానా:** 1,99,700/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.02, ఇ-టెండర్ నం.: 175_CR_SC_22_OT, పని పేరు: **WD-SC-KZJ సెక్షన్: SW 1).** ADEN/East/SC సబ్ డివిజన్ పరిధిలో SSE /P.Way/SNF సెక్షన్‌లో SNF-SC సెక్షన్‌లో UP & DN లైన్స్‌పై కి.మీ. 174.65 నుండి 190.30 వరకు మరియు SNF-AMQ స్టేషన్ల మధ్య SL లైన్స్‌పై కి.మీ.0.00 నుండి 11.40 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/East/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/SNF సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 1,08, 73,475/- **బయానా:** 2,04,400/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.03, ఇ-టెండర్ నం.: 176_CR_SC_22_OT, పని పేరు: SC-KZJ **సెక్షన్: SW 1).** ADEN/E/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/GD సెక్షన్‌లో MLY-WP స్టేషన్ల మధ్య UP, DN & క్వాడ్రాపుల్ లైన్స్‌పై కి.మీ. 202.30 నుండి 252.60 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/E/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/GT సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 92,30,682/- **బయానా:** 1,84,700/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.04, ఇ-టెండర్ నం.: 177_CR_SC_22_OT, పని పేరు: SC-KZJ **సెక్షన్: SW 1).** ADEN/N/KZJ సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/ALER సెక్షన్‌లో WP-GNP స్టేషన్ల మధ్య UP, DN లైన్స్‌పై కి.మీ. 252.60 నుండి 300.30 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/N/KZJ సబ్ డివిజన్ క్రింద SSE/P.Way/ALER సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 92,30,682/- **బయానా:** 1,84,700/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.05, ఇ-టెండర్ నం.: 178_CR_SC_22_OT, పని పేరు: SC-KZJ, BPQ-KZJ & KZJ-KI **సెక్షన్: SW 1).** ADEN/N/KZJ సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/CR/KZJ సెక్షన్‌లో SC-KZJ సెక్షన్‌పై GNP-KZJ స్టేషన్ల మధ్య UP,DN లైన్స్‌పై కి.మీ. 300.30 నుండి 324.89 వరకు BPQ-KZJ సెక్షన్‌పై కి.మీ. 365 నుండి 366.89 వరకు & KZJ-KI సెక్షన్‌పై కి.మీ.366.89 నుండి 388.89 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/N/SC సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/CR/KZJ సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 1,10,23,887/- **బయానా:** 2,05,200/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.06, ఇ-టెండర్ నం.: 179_N_SC_22_OT, పని పేరు: BPQ-KZJ **సెక్షన్: SW 1).** ADEN/RDM సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/MCI, PDPL & N/KZJ సెక్షన్‌లో MMZ-KZJ స్టేషన్ల మధ్య UP,DN థర్డ్ లైన్స్‌పై కి.మీ. 241.74 నుండి 365 వరకు ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/RDM సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/MCI, PDPL & N/KZJ సెక్షన్‌లో MMZ-KZJ స్టేషన్ల మధ్య UP,DN థర్డ్ లైన్స్‌పై కి.మీ. 241.74 నుండి 365 వరకు ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 4,21,25,341/- **బయానా:** 3,60,700/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.07, ఇ-టెండర్ నం.: 180_N_SC_22_OT, పని పేరు: BPQ-KZJ **సెక్షన్: SW 1).** ADEN/BPA సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/MAGH,SKZR & BPA సెక్షన్‌లో BPQ-MMZ స్టేషన్ల మధ్య UP,DN థర్డ్ లైన్స్‌పై కి.మీ. 135 నుండి 241.74 వరకు మరియు MAGH-GDCR SL లైన్స్‌పై కి.మీ. 0 నుండి 28.85 వద్ద ప్రతిపాదిత రక్షణ సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/BPA సబ్ డివిజన్ పరిధిలో SSE/P.Way/MAGH,SKZR & BPA సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (రక్షణ సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 3,79,09,162/- **బయానా:** 3,39,600/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.08, ఇ-టెండర్ నం.: 181_N_SC_22_OT, పని పేరు: **PDPL-NZB సెక్షన్: SW 1).** ADEN/KRMR సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/KRMR & ARMU సెక్షన్‌లో PDPL-NZB స్టేషన్ల మధ్య SL లైన్స్‌పైన కి.మీ. 1.645 నుండి 177.78 వరకు ప్రతిపాదిత భద్రత సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/KRMR సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/KRMR & ARMU సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (భద్రత సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 2,83,68,827/- **బయానా:** 2,91,900/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.09, ఇ-టెండర్ నం.: 182_S_SC_22_OT, పని పేరు: **KZJ-WL & KZJ-KI సెక్షన్: SW 1).** ADEN/S/KZJ సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/WL & MABD సెక్షన్‌లోని KZJ-DKJ స్టేషన్ల మరియు KZJ-WL UP & DN కర్వ్ మధ్య UP,DN లైన్స్‌పైన కి.మీ. 368.00 నుండి 457.80 వరకు ప్రతిపాదిత భద్రత సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/S/KZJ సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/WL & MABD సెక్షన్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (భద్రత సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 1,89,48,259/- **బయానా:** 2,44,800/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.10, ఇ-టెండర్ నం.: 183_S_SC_22_OT, పని పేరు: **KZJ-KI & DKJ-MUGR సెక్షన్: SW 1).** ADEN/DKJ సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/DKJ & BDCR సెక్షన్‌లోని GLA-PNDP స్టేషన్ల మధ్య UP,DN లైన్స్‌పైన కి.మీ. 457.80 నుండి 487.46 వరకు మరియు DKJ నుండి MUGR స్టేషన్ల మధ్య SL పై కి.మీ. 0.00 నుండి 103.69 వరకు ప్రతిపాదిత భద్రత సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/DKJ సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/DKJ & BDCR సెక్షన్స్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (భద్రత సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ.3,37,89,857/- **బయానా:** 3,19,000/-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

క్ర.సం.11, ఇ-టెండర్ నం.: 184_S_SC_22_OT, పని పేరు: **KZJ-KI & MTMP-JNPD సెక్షన్స్: SW 1).** ADEN/MDR సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/MDR, KI & MTMP సెక్షన్స్ PNDP-KI స్టేషన్ మధ్య UP,DN & థర్డ్ లైన్స్‌పైన కి.మీ. 487.46 నుండి 568.00 వరకు మరియు MTMP నుండి JNPD స్టేషన్ల మధ్య SL లైన్స్‌పైన కి.మీ. 0.00 నుండి 77.85 వరకు ప్రతిపాదిత భద్రత సంబంధిత ట్రాక్ పనులు. **SW 2).** ADEN/MDR సబ్ డివిజన్ పరిధిలోని SSE/P.Way/MDR, KI & MTMP సెక్షన్స్‌లో ప్రతిపాదిత నకలవిధ ట్రాక్ పనులు (భద్రత సంబంధిత ట్రాక్ ఐటమ్‌లు కాకుండా). **సుమారు టెండరు విలువ:** రూ. 3,96,91,600/- **బయానా:** 3,48,500 /-, **పూర్తి చేయు కాల వ్యవధి :** 12 నెలలు, **నిర్వహణ కాల వ్యవధి:** లేదు.

1. టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
2. కాగోరు టెండరుదారులందరూ బయానా మొత్తమును ఆన్‌లైన్ చెల్లింపు/BG ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కోరబడుతున్నారు.
3. ఎట్టి కారణం తెలియజేయకుండా టెండరును రద్దు చేయుటకు రైల్వేకు హక్కు కలదు.
4. కాగోరు టెండరుదారులందరూ GSTIN ఐడెంటిఫికేషన్ నంబర్లను పొంది తమ ఆఫర్లతో సహా దాఖలు చేయవలసిందిగా సూచించబడుతున్నారు.

సీనియర్ DEN/కో-ఆర్డినేషన్/సికింద్రాబాద్

ఓపెన్ ఇ-టెండరు నోటీసు నం.: DRM /EnHM/BZA/02/ISO-14001, for 20 స్టేషన్స్/2022నకు సవరణ నం.1 తేది: 30-11-2022

PUB/1102

దిగువ తెలిపి పనుల కోసం ఇ-టెండరుకు సవరణ నం.1ని భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు ప్రతిదానికి ఎదురుగా తెలిపిన తేదిన 15.00 గం॥ వరకు కోరుతున్నారు.

క్ర.సం.1. టెండరు నం.: EnHM/BZA/IREPS/02/ISO-14001 for 20 Stations/2022 తేది: 30-11-2022 **పని పేరు:** ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అక్రిడిటేషన్-3 సంవత్సరాల కొరకు చెల్లుబాటు అగునట్లు విజయవాడ డివిజన్‌లోని 20 రైల్వే స్టేషన్ల కొరకు ISO 14001: 2015 రీ-సర్టిఫికేషన్, ఈ కాలంలో ఈ ప్రమాణాలు ఇటీవలి వెర్షన్స్‌కు ట్రాన్సిషన్‌తోసహా. **పని సుమారు విలువ:** రూ. 8,73,200/- (18 % వంతున GST తో సహా) **కాంట్రాక్టు కాల వ్యవధి:** 3 సంవత్సరాలు (36 నెలలు), **టెండరు ఫారం ధర:** లేదు, **బిడ్ సెక్యూరిటీ (EMD) :** రూ.17500/-, **టెండరు ముగింపు తేది, సమయం:** 28-12-2022న 15.00గం॥

1). కాగోరు టెండరుదార్లు పదేని టెండరు కోసం ఏవైన మార్పులు/సవరణలు గమనించుటకు టెండరు ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ **www.ireps.gov.in** చూడవలసిందిగా సూచించబడుతున్నారు.

A1460 — సీనియర్ DEnHM, విజయవాడ

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. VI(ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టము భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) అనుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఓ.క.నెం.4358/2021-G1 — తేది.09-12-2022

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, వరగాని గ్రామము యందు ప్రజాప్రయోజనముకొరకై అనగా "నీటి పారుదల సౌకర్యం పెంపు నిమిత్తం" "గుంటూరు చానల్ పొడిగింపు" (K.M 58.251 నుండి KM 61.500 వరకు) పథకము ద్వారా య.58.6438 సెంట్లు భూమి కావలయునని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, శ్రీయుత జిల్లా కలెక్టరు గుంటూరు జిల్లా వారు 2013వ సంవత్సరము, 30వ చట్టము వలన భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలను అనుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికీ ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

ఆంధ్రప్రదేశ్ భూ సేకరణ, పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2018లోని 22వ చట్టం) ద్వారా సవరించబడిన విధంగా 2013 భూసేకరణ పునరావాసం, పునః స్థాపనలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం (2013లో 30వ చట్టం) సెక్షన్ 10A ప్రకారం సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది. సదరు విషయమును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అమరావతి, స్టేట్ గజిట్ మరియు Form-A(2) నోటిఫికేషన్ స్టేట్ గజిట్ W.No.19, తేది॥ మే 12, 2022 ద్వారా ప్రకటన చేయడమైనది.

చట్టములోని సెక్షన్ 43(1) మేరకు ప్రభావిత కుటుంబాలకు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1రెవిన్యూ (భూ.సే)శాఖ, తేది.02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టరు, గుంటూరు వారు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా నియమించబడమైనది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియులేవు.

కలెక్టరు గుంటూరు జిల్లా వారు పైన పేర్కొన్న చట్టంలో సెక్షన్ 12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారికి, వారి సిబ్బందికి మరియు వారి పనివారలకు ఈ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

చట్టంలోని 11(4) విభాగం క్రింద కలెక్టరు పూర్వ ఆమోదం లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేది నుండి ఏదేని లావాదేవీ లేదా ఏదేని భూమియొక్క లావాదేవీలు కారణం అంటే అమ్మకం/కొనుగోలు మున్నగునవి లేదా అట్టి భూమిపై ఏమేని తాకట్టులను సృష్టించడం ఏ వ్యక్తి చేయరాదు.

పై చట్టంలోని సెక్షన్ 15ను అనుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు/ఆక్షేపణలు వున్న యెడల సంబంధిత వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా శ్రీయుత జిల్లా కలెక్టర్, గుంటూరు/ శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : గుంటూరు — మండలము : పెదనందిపాడు — గ్రామము : వరగాని

క్రమ సంఖ్య	సర్వే నెం	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం (య.సెంట్లు)	భూ సేకరణ చేయు విస్తీర్ణం య.సెం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, మరియు ఇతరముల వివరములు
1	57	సర్కారు పుంజ	29.72	1.22	వేజండ్ల అనసూయ D/o మోహనరావు	57	57	69	57	-
2	57	సర్కారు పుంజ	29.72	0.70	షేక్ మస్తాన్‌వలి S/o హిమామ్‌సాహెబ్	57	57	69	57	-
3	57	సర్కారు పుంజ	29.72	0.86	కంకణాల విజయశ్రీ W/o కొండయ్య	57	59	69	57	-
4	57	సర్కారు పుంజ	29.72	0.20	ప్రత్తిపాటి సామియేలు, S/o రామయ్య	57	59	57	57	-
5	60-1	సర్కారు పుంజ	2.06	0.81	బండారుపల్లి యశోదా, W/o ఆదినారాయణ	60	60-3,4	60-2	60-1	-
6	60-2	సర్కారు పుంజ	2.46	1.29	మాకినేని బ్రహ్మానందం, S/o కోటయ్య	59	60-4	60-2	60-1	-
7	60-3	సర్కారు పుంజ	1.84	1.47	బండారుపల్లి యశోదా, W/o ఆదినారాయణ	60-1	60-6	60-4	61	-
8	60-4	సర్కారు పుంజ	0.98	0.69	మాకినేని బ్రహ్మానందం, S/o కోటయ్య	60-1,2	60-6	60-5	60-3	-
9	60-5	సర్కారు పుంజ	1.76	0.06	మాకినేని బ్రహ్మానందం, S/o కోటయ్య	60-2	60-5	60-5	60-4	-
10	60-6	సర్కారు పుంజ	3.99	1.21	గుంటుపల్లి పద్మజ, D/o జగజ్జీవనరావు	60-3,4	63	60-6	61	-
11	61-1	సర్కారు పుంజ	7.41	0.0025	వేదినేని భవాని, W/o సుధీర్‌బాబు	61-1	61-1	60	61-1	-
12	61-1	సర్కారు పుంజ	7.41	0.12	పాములపాటి వంశీ, W/o సయింపు వెంకట విజయ్‌కుమార్	61-1	61-2	60	61-1	-
13	61-2	సర్కారు పుంజ	2.87	1.14	పాములపాటి వంశీ, W/o సయింపు వెంకట విజయ్‌కుమార్	61-1	61-3	60	61-2	-
14	62-1	సర్కారు పుంజ	2.54	1.7	మాకినేని రవీంద్రబాబు, S/o ఏకాంబరం అండ్ గుమ్మడి యజ్ఞనారాయణ S/o రాజేంద్ర	62-1	62-1	63,62-1	185,186	-
15	62-1	సర్కారు పుంజ	2.54	0.32	మాకినేని జస్వర్‌బాబు, S/o ప్రసాద్ బాబు	62-1	62-2	62-1	185	-
16	62-2	సర్కారు పుంజ	2.24	0.36	మాకినేని జస్వర్‌బాబు, S/o ప్రసాద్ బాబు	62-1	62-2	62-2	185	-
17	62-2	సర్కారు పుంజ	2.24	0.46	అరుమళ్ల రవీంద్రబాబు, S/o కోటయ్య	62-1	62-2	62-2	185	-
18	62-2	సర్కారు పుంజ	2.24	0.06	కల్లూరి హేమ వెంకటప్రసాద్, S/o వెంకటేశ్వర్లు	62-2	62-3	62-2	185	-
19	62-3	సర్కారు పుంజ	2.34	0.0025	కల్లూరి హేమ వెంకటప్రసాద్, S/o వెంకటేశ్వర్లు	62-2	62-3	62-3	185	-
20	63-1	సర్కారు పుంజ	1.92	0.09	అరుమళ్ల అన్నోజిరావు, S/o కోటయ్య	60	63-1	63-2	62	-
21	69-1	సర్కారు పుంజ	0.70	0.35	ముప్పా నమిత, D/o శ్రీనివాసరావు (మైనర్ గార్డియన్)	70	69-2	69-4	69-1	-
22	69-2	సర్కారు పుంజ	1.58	1.19	ముప్పా నమిత, D/o శ్రీనివాసరావు (మైనర్ గార్డియన్)	69-1	69-3	69-4,5	69-2	-
23	69-3	సర్కారు పుంజ	0.78	0.7623	ముప్పా నమిత, D/o శ్రీనివాసరావు (మైనర్ గార్డియన్)	69-2	69-5	69-4,5	57	-
24	69-4	సర్కారు పుంజ	2.01	1.12	బత్తుల ప్రమల రాణి, W/o. రమేష్ & ఆలపాటి నాగభూషణం S/o పెద్ద సుబ్బయ్య	70	69-5	69-4	69-1,2	-
25	69-5	సర్కారు పుంజ	9.00	0.08	బత్తుల ప్రమల రాణి, W/o. రమేష్	69-4	69-5	69-5	69-2,3	-
26	69-5	సర్కారు పుంజ	9.00	1.76	ఆలపాటి సుబ్బారావు, S/o నాగభూషణం	69-3	69-5	69-5	57	-
27	70-1	సర్కారు పుంజ	1.90	0.23	ఆలపాటి రామారావు, S/o నాగేశ్వరరావు	70-1	70-1	70-3	70-1	-
28	70-1	సర్కారు పుంజ	1.90	0.27	వెలగా సాంబయ్య, S/o తాతయ్య	70-1	70-2	70-3	70-1	-
29	70-2	సర్కారు పుంజ	1.82	0.39	ఆలపాటి రామారావు, S/o నాగేశ్వరరావు	70-1	70-2	70-3	70-2	-
30	70-2	సర్కారు పుంజ	1.82	1.05	ఆలపాటి నాగభూషణం, S/o పెద్దసుబ్బయ్య	70-2	69	70-3	70-2	-
31	70-3	సర్కారు పుంజ	2.89	1.79	కంకణాల నాగేశ్వరరావు, S/o వెంకటేశ్వర్లు	85	70-3	86	70-1,2	-
32	70-3	సర్కారు పుంజ	2.89	0.44	కుర్రా శివనాగేశ్వరరావు, S/o వెంకట అప్పయ్య	70-3	69	70-3	70-2	-
33	85-2	సర్కారు పుంజ	2.26	0.29	లావు శ్రీనివాసరావు, S/o నాగేశ్వరరావు	84	85-2	86	85-2	-
34	85-2	సర్కారు పుంజ	2.26	0.43	లావు రామంజనేయులు S/o నాగేశ్వరరావు	85-2	85-3	86	85-2	-
35	85-3	సర్కారు పుంజ	3.38	0.94	కొల్లి రాజేశ్వరి, S/o శ్రీధర్	85-2	85-4	86	85-3	-
36	85-3	సర్కారు పుంజ	3.38	0.08	కంకణాల నాగేశ్వరరరావు, S/o వెంకటేశ్వర్లు	85-3	85-4	85-3	85-3	-
37	85-4	సర్కారు పుంజ	1.91	0.95	గింజుపల్లి సాంబశివరావు, S/o అబ్బాయ్య	85-3	70	86	85-4	-
38	86-1	సర్కారు పుంజ	1.92	0.98	కుర్రా వనజ , W/o శ్రీరామచంద్రమౌళి	94	86-2	86-1	85	-
39	86-1	సర్కారు పుంజ	1.92	0.65	ముప్పా శివరామరావు, S/o అప్పయ్య	86-1	86-3	86-2	85	-
40	86-2	సర్కారు పుంజ	3.32	0.71	ముప్పా శివరామరావు, S/o అప్పయ్య	86-1	86-3	86-2	86-1	-
41	86-3	సర్కారు పుంజ	1.20	0.57	ముప్పా శివరామరావు, S/o అప్పయ్య	86-1,2	86-4	86-3	85,70	-
42	86-4	సర్కారు పుంజ	2.22	0.22	కుర్రా లలిత కుమారి, W/o నరసింహారావు	86-3	86-4	86-4	70	-
43	191-3	సర్కారు పుంజ	1.54	0.13	వేజెండ్ల శశికుమారి, S/o మునేశ్వరరావు	192	196	196	200	-
44	191-5బి	సర్కారు పుంజ	1.65	0.05	వేజెండ్ల రాజ్యలక్ష్మి, W/o బుల్లియ్య	192	196	196	200	-
45	191-6	సర్కారు పుంజ	1.11	0.84	చిమట వెంకటరత్నం, S/o వెంకటరావు	192	196	196	200	-
46	191-7	సర్కారు పుంజ	2.82	1.20	కొండ్రగుంటి కోటేశ్వరరావు S/o సుబ్బయ్య	192	196	196	200	-
47	191-7బి	సర్కారు పుంజ	2.82	0.50	మారెళ్ళ శ్రీకాంత్, S/o మోహనరావు	192	196	196	200	-
48	191-8	సర్కారు పుంజ	1.23	0.2350	మారెళ్ళ మోహనరావు, S/o రోశయ్య	192	196	196	200	-
49	191-9బి	సర్కారు పుంజ	0.33	0.19	దుండురి హరి వెంకట పూర్ణచంద్రశేఖర్, W/o సుబ్రహ్మణ్యం	192	196	196	200	-
50	191-10	సర్కారు పుంజ	0.99	0.0010	దుండురి హరి వెంకట పూర్ణచంద్రశేఖర్, W/o సుబ్రహ్మణ్యం	192	196	196	200	-
51	191-11	సర్కారు పుంజ	0.35	0.0020	దుండురి హరివెంకట పూర్ణ చంద్రశేఖర్, W/o సుబ్రహ్మణ్యం	192	196	196	200	-
52	188-2ఎ	సర్కారు పుంజ	9.08	0.33	మాకినేని సుష్మ & రమ్య D/o రామ లింగేశ్వరరావు	189	196	194	188-1	-
53	194-1బి	సర్కారు పుంజ	4.68	1.12	మదమంచి బాపారావు, S/o సాంబయ్య	188	194-1బి, 2బి	194-1బి, 195	194-1డి	-
54	194-2బి	సర్కారు పుంజ	1.67	1.17	మదమంచి బాపారావు, S/o సాంబయ్య	194-2బి 1బి	194-3బి, 2బి	195	194-2బి	-
55	194-3ఎ	సర్కారు పుంజ	0.63	0.04	వేజెండ్ల రామారావు, S/o నారయ్య	194-2ఎ	194-4ఎ	194-1డి	198	-
56	194-3బి	సర్కారు పుంజ	1.46	0.98	వేజండ్లరామారావు, ఆంజనేయులు S/o నారయ్య, కోటేశ్వరమ్మ W/o చిన రామారావు	194-2బి	194-3బి, 4బి	194-3బి	194-1డి	-
57	194-4ఎ	సర్కారు పుంజ	0.80	0.50	పాములపాటి వంశీ, W/o సయింపు వెంకట విజయ్ కుమార్	194-3ఎ, 4ఎ	194-5ఎ	194-1డి	194-4ఎ	-
58	194-4బి	సర్కారు పుంజ	1.21	0.29	మారెళ్ళ మోహనరావు S/o రోశయ్య	194-3బి	194-5బి, 4బి	194-4బి	194-1డి	-
59	194-5ఎ	సర్కారు పుంజ	1.68	1.40	పెద్దిలక్ష్మీ, W/o శివయ్య	194-4ఎ	194-5ఎ, 196	194-1డి	198	-
60	194-5బి	సర్కారు పుంజ	1.54	0.0025	నాదెండ్ల అన్నపూర్ణమ్మ, W/o రమేష్	194-4బి	196	195	194-1డి	-
61	198-1	సర్కారు పుంజ	2.43	1.24	వేజెండ్ల శశికుమార్, S/o మునేశ్వరరావు	198	198	183	191	-
62	198-2	సర్కారు పుంజ	1.02	0.41	వేజెండ్ల శశికుమార్, S/o మునేశ్వరరావు	198	198	183	191	-
63	198-3	సర్కారు పుంజ	1.89	1.06	కాకాని లీల సాయి ఆదిత్య, S/o భాస్కరరావు	198	198	183	191	-
64	198-3	సర్కారు పుంజ	1.89	0.07	ముద్దినేని విజయకుమారి, W/o శ్రీనివాసులు	198	198	183	191	-
65	198-5	సర్కారు పుంజ	0.80	0.23	కాకాని లీల సాయి ఆదిత్య, S/o భాస్కరరావు	198	198	183	191	-
66	198-6	సర్కారు పుంజ	0.50	0.34	కాకాని లీల సాయి ఆదిత్య, S/o భాస్కరరావు	198	198	183	191	-
67	201-3	సర్కారు పుంజ	3.86	0.18	రావిపూడి సునిత, W/o నాగేశ్వరరావు	22	201-4బి	200	201-2బి	-
68	201-3	సర్కారు పుంజ	3.86	0.08	పొందురి వెంకయ్య, S/o వీరయ్య	22	201-4బి	200	201-2బి	-
69	201-4బి	సర్కారు పుంజ	5.58	1.85	పొందురి వెంకయ్య, S/o వీరయ్య	201-3	201-5బి	200	201-2డి	-
70	201-4బి	సర్కారు పుంజ	5.58	0.05	వేజండ్ల శివకుమారి, W/o పాపారావు	201-3బి	201-5బి	200	201-2డి	-
71	201-5ఎ	సర్కారు పుంజ	0.13	0.01	కొల్లి రమేష్‌బాబు, S/o వెంకటేశ్వర్లు	201-4బి	204	200	202	-
72	201-5బి	సర్కారు పుంజ	5.90	0.47	కొల్లి రమేష్‌బాబు, S/o వెంకటేశ్వర్లు	201-4బి	204	200	201-2డి	-
73	201-5బి	సర్కారు పుంజ	5.90	0.54	పొందురి ఆనందరావు & పొందురి నారాయణ S/o సుబ్బయ్య	201-4బి	204	200	201-2డి	-
74	201-4బి	సర్కారు పుంజ	5.90	0.84	కట్టా రాంబాబు, S/o బుల్లయ్య	201-4బి	204	200	201-2డి	-
75	204-1	సర్కారు పుంజ	0.95	0.14	కట్టా రాంబాబు S/o బుల్లయ్య	204-2	204-1	204-2	203	-
76	204-3	సర్కారు పుంజ	4.05	0.19	కట్టా రాంబాబు S/o బుల్లయ్య	202	204-3	204-3	204-2	-
77	208	సర్కారు పుంజ	15.25	0.34	మాకినేని అమ్మయ్య, S/o బాపయ్య	209	208	208	218	-
78	209-2	సర్కారు పుంజ	3.06	0.006	మదమంచి వెంకట సుబ్బాయమ్మ W/o వెంకటేశ్వర్లు	209-2	209-7	208	209-4	-
79	209-5	సర్కారు పుంజ	2.08	0.87	గోగిసెట్టి పెద కోటయ్య S/o నారయ్య	209-2	209-7	208	209-4	-
80	209-6C	సర్కారు పుంజ	1.55	0.15	మదమంచి మల్లికార్జునరావు S/o రామకోటేశ్వరరావు	209-4	209-8	209-7	209-1B	-
81	209-7	సర్కారు పుంజ	2.05	1.30	మదమంచి మల్లికార్జునరావు S/o రామకోటేశ్వరరావు	209-5	209-8,9	208	209-6C	-
82	209-8	సర్కారు పుంజ	3.53	0.31	మాకినేని అమ్మయ్య S/o బాపినయ్య	209-7	208	209-9	217	-
83	209-8	సర్కారు పుంజ	3.53	0.89	మదమంచి రమేష్ & శ్రీనివాసరావు S/o చిన్నిరయ్య	209-6C	208	209-9	217	-
84	209-8	సర్కారు పుంజ	3.53	0.42	గంటుగల పాండురంగారావు S/o వీరస్వామి	209-6C	208	209-9	217	-
85	209-9	సర్కారు పుంజ	1.75	0.01	కొండవీటి అనీల్ S/o అమృతరావు	209-7	208	208	209-8	-
86	218-3	సర్కారు పుంజ	15.26	1.78	మాకినేని హరిప్రసాదరావు S/o ఉదయార్కరరావు మాకినేని రామకృష్ణ S/o రామయ్య	209	223	208	218-1	-
87	218-3	సర్కారు పుంజ	15.26	0.08	మారెళ్ళ లక్ష్మి D/o వెంకటేశ్వర్లు	217	223	208	218-1	-
88	218-3	సర్కారు పుంజ	15.26	0.83	చేబ్రోలు సుబ్బాయమ్మ W/o శ్రీనివాసరావు వెన్నుపాటి ప్రమీల W/o శ్రీనివాసరావు	217	223	208	218-2	-
89	218-3	సర్కారు పుంజ	15.26	0.37	సూరిరెడ్డి అనిత W/o సురేష్ బాబు	217	223	208	218-2	-
90	218-3	సర్కారు పుంజ	15.26	0.56	కోల్ల గంగాధర్ రావు & కోల్ల శ్రీనివాసరావు S/o నాగేంద్రం	217	223	208	218-2	-
91	218-3	సర్కారు పుంజ	15.26	0.04	దొప్పలపూడి రజని కుమార్ W/o నవీన్ కుమార్	217	223	208	218-2	-
92	219-9	సర్కారు పుంజ	2.15	0.33	చిరిసాల ప్రసాదు రావు S/o సుబ్బారావు	219.9	220	223	219-8	-
93	220-1	సర్కారు పుంజ	5.37	0.71	వెంగలసెట్టి కోటేశ్వర రావు S/o హనుమంతరావు	219	221	220-2	Anna parru survey No.116	-
94	220-1	సర్కారు పుంజ	5.37	0.47	వెంగళశెట్టి అన్నపూర్ణమ్మ W/o కోటేశ్వరరావు	219	221	220-2	Anna parru survey No.116	-
95	220-1	సర్కారు పుంజ	5.37	0.72	వెంగళశెట్టి శ్రీనివాసరావు & కోటేశ్వర రావు S/o	219	221	220-2	219	-
96	220-2	సర్కారు పుంజ	2.97	1.09	చేబ్రోలు సింగయ్య S/o రామయ్య	219	221	223	220-1	-
97	220-2	సర్కారు పుంజ	2.97	1.18	చేబ్రోలు కాశీఅన్నపూర్ణమ్మ W/o సత్యనారాయణ	219	221	223	220-1	-
98	220-2	సర్కారు పుంజ	2.97	0.02	పోలిశెట్టి శివకుమారి W/o మల్లికార్జునరావు	219	221	223	220-1	-
99	221-2	సర్కారు పుంజ	2.91	0.34	అన్నపర్తి సుబ్బారావు S/o నరసయ్య	220	220-4A	220-3A	Anna parru survey No.130	-
100	223-1	సర్కారు పుంజ	1.10	0.22	నూనె వీరరాఘవమ్మ W/o తిరుపతి రాయుడు	218	223-2	223-3B	219	-
101	223-1	సర్కారు పుంజ	1.10	0.02	వెంగలసెట్టి వెంకాయమ్మ W/o హనుమంతరావు	218	223-2	223-3B	219	-
102	223-2	సర్కారు పుంజ	1.01	0.84	శృంగారపు పద్మావతి W/o మల్లికార్జునరావు	223-1	223-3B	223-3B	219	-
103	223-3	సర్కారు పుంజ	4.03	0.60	మారిసెట్టి సామ్రాజ్యం W/o రామారావు	218	223-4	223-6	220	-
104	223-3	సర్కారు పుంజ	4.03	0.05	చెబ్రోలు కాశీ అన్నపూర్ణమ్మ W/o సత్యనారాయణ	218	223-4	223-6	223-1	-
105	223-3	సర్కారు పుంజ	4.03	0.23	మారెల్ల యశోద W/o చంద్రశేఖర్	218	223-4	223-6	220	-
106	223-3	సర్కారు పుంజ	4.03	0.02	ఆకుల అనిల కుమారి W/o నాగబాబు	218	223-4	223-6	223-1	-
107	223-6	సర్కారు పుంజ	3.91	0.15	తేలికపెల్లి నరసింహ శాస్త్రి S/o సత్యనారాయణ	2218	223-4	223-7	223-1	-
మొత్తం విస్తీర్ణం				58.6438						

ప్రదేశం : గుంటూరు
తేది : 09-12-2022

సం/- యం.వేణుగోపాల్‌రెడ్డి IAS
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా

ప్రేమోన్మాదం

- ప్రియురాలు, ఆమె తల్లిపై కత్తితో యువకుడి దాడి
- గొంతు కోసుకుని తానూ ఆత్మహత్యాయత్నం
- వచ్చే ఆదివారం బాధితురాలికి నిశ్చితార్థం

హైదరాబాద్: ప్రియురాలితో పాటు ఆమె తల్లిపై ఓ యువకుడు కత్తితో దాడి చేయడమేగాక తానూ గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ తిరుపతిరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... గుంటూరుజిల్లా, ఇసుకపల్లికి చెందిన వెంకటరాజు, శోభ దంపతులకు కుమార్తె వైభవి, కుమారుడు గోవర్ధన్ ఉన్నారు. వెంకటరాజు ముంబైలో ప్యాబ్రికేషన్ పనులు చేస్తూ అక్కడే ఉంటున్నాడు. శోభ తన కుమార్తె వైభవీ, గోవర్ధన్‌తో కలిసి మియాపూర్‌లోని న్యూ - హఫీస్‌పేట ఆదిత్య నగర్‌లో ఉంటోంది. కాగా అదే గ్రామానికి చెందిన సంధీప్ అలియాస్ బబ్లూ వారి ఇంటి పక్కనే ఉండేవాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఈ విషయం తెలియడంతో వైభవి కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. దీంతో కొన్నాళ్లుగా వైభవీ సందీప్‌ను దూరం పెడుతుంది. దీనిని జీర్ణించుకోలేని సందీప్ ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నాడు. ఆమెకు తరచూ ఫోన్ చేసి తనతో మాట్లాడాలని లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని, చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో శోభ ఇద్దరు పిల్లలతో సహా నగరానికి వలస వచ్చి న్యూ - హాపీస్‌పేట ఆదిత్య నగర్‌లో ఉంటున్నారు.కొద్ది రోజుల క్రితం వైభవికి తమ సమీప బంధువుతో పెళ్లి కుదిరింది. వచ్చే ఆదివారం వారి నిశ్చితార్థం జరిపేందుకు నిశ్చయించారు. ఈ విషయం తెలియడంతో మంగళవారం ఉదయం నగరానికి వచ్చిన సందీప్ నేరుగా వైభవి ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. కోపంతో కూరగాయాలు కోసే కత్తితో వైభవి, ఆమె తల్లి శోభపై దాడి చేశాడు. వైభవిని గొంతు కింద ఛాతీభాగంలో, తల్లి శోభను కడుపులో పొడిచాడు. ఆ తర్వాత అదే చాకుతో తీవ్ర గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీరి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని రక్తం మడుగులో ఉన్న ముగ్గురిని ఆసుపత్రికి కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సందీప్‌ను కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రి తరలించారు. వైభవీ, తల్లి శోభలను గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిలకడగా సందీప్ ఆరోగ్యం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సందీప్‌ను పోలీసులు కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోగి పరిస్థితి పరిశీలించిన ఈఎన్‌టీ వైద్యులు అతడి గొంతుకు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

టీచర్ల బదిలీల్లో మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీలకే పెద్దపీట

- అందుకనుగుణంగా విద్యాశాఖ చర్యలు
- గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత స్కూళ్లలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాకే బదిలీలు
- బదిలీ అయినవారి స్థానాల్లోకి కొత్తవారు వచ్చాకే పాతవాళ్లు రిలీవ్
- ఎక్కడా టీచర్ల కొరత అనే మాట రాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు
- జిల్లాల్లో మొత్తం పోస్టుల్లో ఖాళీలు అన్ని ప్రాంతాలకు సమానంగా సర్దుబాటు
- అవసరమైన చోట కన్వర్షన్‌ను కోరుకున్న సబ్జెక్టు టీచర్ల నియామకం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్ని స్కూళ్లలోనూ తగినంత సంఖ్యలో టీచర్లు అందుబాటులో ఉండేలా పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపడుతోంది. తద్వారా విద్యార్థుల బోధనాభ్యసనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా రాష్ట్రంలో టీచర్ల బదిలీల ప్రక్రియను చేపట్టిన అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టారు. బదిలీల మేరకు రిలీవ్ అయిన టీచర్ల స్థానాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాకే వారిని రిలీవ్ చేస్తున్నారు. ఒకే టీచర్ ఉన్న స్కూళ్లో ఆ టీచర్‌కు బదిలీ అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు ఆ టీచర్‌ను రిలీవ్ చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే ఇద్దరు ఉన్న స్కూల్లో ఇద్దరికీ బదిలీ అయితే జూనియర్ టీచర్‌ను రిలీవ్ చేయరాదని పేర్కొంది. ముగ్గురున్న చోట బదిలీలుంటే జూనియర్లయిన ఇద్దరు టీచర్లను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యేవరకు రిలీవ్ చేయరు. ముఖ్యంగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల స్కూళ్లల్లో టీచర్లు లేరనే మాట రాకుండా.. ముందుగా మారుమూల ప్రాంతాల స్కూళ్లలో ఖాళీలు భర్తీ అయ్యేలా బదిలీల మార్గదర్శకాల్లో ప్రభుత్వం పలు అంశాలను చేర్చింది. జిల్లాల్లోని ప్రస్తుతం భర్తీ అయిన పోస్టులకు సమానంగా ఖాళీలను చూపించి బదిలీ ప్రక్రియను అధికారులు కొనసాగించనున్నారు. మిగిలిన ఖాళీ పోస్టులను అన్ని ప్రాంతాలకూ సమానంగా సర్దుబాటు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉదాహరణకు ఒక జిల్లాలో 5వేల పోస్టులు ఉంటే.. అక్కడ 4,500 మంది టీచర్లు పనిచేస్తుంటే తక్కిన 500 ఖాళీలను ప్రాంతాల వారీగా మొదటి మూడు కేటగిరీలకూ సమానంగా బదలాయిస్తారు. దీనివల్ల ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల స్కూళ్లకు ప్రయోజనం ఉంటుంది.

ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

మైదాన ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల స్కూళ్ల టీచర్లను కూడా బదిలీ చేస్తున్నా.. ఏజెన్సీ ప్రాంతాల స్కూళ్లలో ఒకేసారి ఖాళీలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గిరిజన సమీకృతాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాంతాల్లోని పాఠశాలల టీచర్లు.. నాన్ ఐటీడీఏ ప్రాంతాల్లో బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అలాంటి చోట్ల ఆయా స్కూళ్లలో టీచర్లు లేరన్న పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ భర్తీ ఏర్పాట్లు చేశాకే బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేస్తారు. ఐటీడీఏ ప్రాంతాల్లో ఖాళీ టీచర్ పోస్టులు భర్తీకాని పక్షంలో ఐటీడీయేతర ప్రాంతాల్లో బాగా జూనియర్లయిన టీచర్లను ఆయా స్థానాల్లో తాత్కాలికంగా నియమించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గతంలో ఏజెన్సీ, మారుమూల ప్రాంతాలకు బదిలీ అయిన వారిలో ఎక్కువమంది అనధికారికంగా లేదా అధికారికంగా గైర్హాజరులో ఉంటున్నారు. ఇప్పుడు ఇలాంటి వారి ఖాళీలను బదిలీల్లో చూపించడం ద్వారా అక్కడి పోస్టుల భర్తీకి ఆస్కారం ఉంటుంది. తప్పనిసరి బదిలీ అవ్వాల్సిన గ్రేడ్-2 హెచ్‌ఎంలు బదిలీ దరఖాస్తు చేయకున్నా వారిని కేటగిరీ-4లోని మిగులు పోస్టుల్లో నియమిస్తారు. అక్కడ ఖాళీ లేనిపక్షంలో కేటగిరీ-3లోని స్కూళ్ల ఖాళీల్లోకి పంపుతారు.

కన్వర్షన్ కోరుకున్న సబ్జెక్టు టీచర్లకు..

కాగా ఇటీవల సబ్జెక్టు టీచర్ల కొరతను పరిష్కరించడానికి ప్రభుత్వం ఆయా సబ్జెక్టులలో అర్హతలున్న వారిని మార్చుకోవడానికి (కన్వర్షన్) అనుమతించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది టీచర్లు ఇలా కన్వర్షన్‌కు లేఖలు ఇచ్చారు. ఇలా అంగీకారం తెలిపిన వారిని వెంటనే ఆయా సబ్జెక్టుల్లోకి మార్చడంతోపాటు బదిలీకి దరఖాస్తు చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ బదిలీల ద్వారా సబ్జెక్టు టీచర్లు దాదాపు అన్ని పాఠశాలలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంటుందని చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాల్లో మిగులు టీచర్లుగా గుర్తించిన వారందరినీ ప్రభుత్వం అవసరమైన స్కూళ్లలో తాత్కాలికంగా సర్దుబాటు చేసింది. ఇప్పుడు బదిలీల్లో ఆయా పోస్టుల్లో రెగ్యులర్ టీచర్లు నియమితులయ్యే అవకాశం ఉంది.

గతంలో కన్నా మెరుగ్గా ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి..

రాష్ట్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి గతంలో కన్నా మెరుగ్గా ఉంది. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలన్న నిబంధన ఉంది. కానీ రాష్ట్రంలో అది 20 కన్నా తక్కువగానే ఉందని పాఠశాల విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ (యూడైస్) ప్లస్ గణాంకాల ప్రకారం చూసినా గత ప్రభుత్వాల కన్నా మెరుగ్గా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

ఏపీఏటీ సిబ్బందిని మరోచోటుకు పంపడమేంటి?

- మమ్మల్ని అడక్కుండా అలాచేసి ఉండాల్సింది కాదు..
- అసంతృప్తి వ్యక్తంచేసిన సీజే ధర్మాసనం
- ఆ లేఖ రాయడం తప్పేనన్న అడ్వొకేట్ జనరల్
- దాన్ని ఉపసంహరించామని ధర్మాసనానికి నివేదన
- తదుపరి విచారణ జనవరి 2కి వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ) రద్దు తరువాత అక్కడి ఉద్యోగులు డిప్యుటేషన్‌పై హైకోర్టులో పనిచేస్తుండగా, తమను సంప్రదించకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని వివిధ శాఖలకు బదిలీ చేసేందుకు ప్రయత్నించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. హైకోర్టులో ఇప్పటికే సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో ఏపీఏటీ ఉద్యోగులను ఇతర శాఖలకు పంపాలనుకోవడం సరైన చర్యకాదని అభిప్రాయపడింది. వారు గతంలో కొద్దికాలం తమ వద్ద పని చేశారని, కాబట్టి వారు తమ వద్దే పనిచేయడం సబబని తెలిపింది. ఈ సమయంలో ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ స్పందిస్తూ.. హైకోర్టును సంప్రదించకుండా ఏపీఏటీ ఉద్యోగుల బదిలీ విషయంలో లేఖ రాయడం తప్పేనన్నారు. ఇందుకు క్షమాపణలు చెబుతున్నామన్నారు. ఆ లేఖను ఇప్పటికే ఉపసంహరించుకున్నామని ఆయన కోర్టుకు నివేదించారు. అయితే, ఏపీఏటీ ఉద్యోగులు హైకోర్టులో పనిచేయడానికి నిబంధనలు అంగీకరించవని, ఈ విషయంలో హైకోర్టుతో ప్రభుత్వాధికారులు చర్చలు జరుపుతున్నారని కోర్టు దృష్టికి ఏజీ తీసుకొచ్చారు. ఏజీ చెప్పిన ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, తదుపరి విచారణను జనవరి 2కి వాయిదా వేసింది. హైకోర్టులో పనిచేస్తున్న ఏపీఏటీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియను నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

సిబ్బంది లేఖ రాయడం క్రమశిక్షణారాహిత్యం

హైకోర్టులో పనిచేస్తున్న ఏపీఏటీ ఉద్యోగులను వివిధ శాఖలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనివల్ల హైకోర్టు కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితం అవుతాయంటూ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. హైకోర్టులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఏపీఏటీ ఉద్యోగులు తమను ఇతర శాఖల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి నేరుగా లేఖ రాయడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. ఇది క్రమశిక్షణారాహిత్యమేనని తెలిపింది. మరోవైపు.. హైదరాబాద్‌లోని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిన ఓ ఉద్యోగి విషయంలో ఉదారంగా వ్యవహరించాలని, ఆమె అక్కడే కొనసాగించేందుకు దయతో అనుమతినివ్వాలన్న ఆ ఉద్యోగిని తరఫు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. తాము దయతో కాకుండా కేసులో ఉన్న దమ్మును బట్టి ఉత్తర్వులిస్తామంది. హైకోర్టులో చాలామంది ఉద్యోగులు వారాంతంలో హైదరాబాద్ వెళ్తున్నారని, జడ్జీలు కూడా వెళ్తున్నారని, ఇలా అందరూ హైదరాబాద్‌కు వెళ్తే విజయవాడలో ఎవరుంటారని ధర్మాసనం నవ్వుతూ వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం హైకోర్టుతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 2కి వాయిదా వేసింది.

క్లుప్తంగా...

అస్వస్థతతో వైఎస్సార్‌సీపీ నేత మృతి

- జయహో బీసీ సభకు హాజరై అకస్మాత్తుగా అస్వస్థత
- ప్రైవేట్ ఆస్పత్రిలో అత్యుత్తమ వైద్యం అందించిన పార్టీ శ్రేణులు
- పార్టీ తరఫున రూ.10 లక్షల సాయం అందజేయాలని సీఎం జగన్ ఆదేశం

లబ్బీపేట (విజయవాడ తూర్పు)/సాక్షి, అమరావతి : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం వెస్ట్ విప్పర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఎడవల్లి సుబ్బారావు (62) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈ నెల 7న విజయవాడలో జరిగిన జయహో బీసీ సదస్సుకు హాజరైన సుబ్బారావు అక్కడ అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను పార్టీ శ్రేణులు విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి అత్యుత్తమ వైద్యం అందించారు. మరోవైపు.. సుబ్బారావు మృతి సమాచారం తెలిసిన వెంటనే ఉప ముఖ్యమంత్రి, మంత్రి కొట్టు సత్యనారాయణ ఆస్పత్రికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఈ విషయాన్ని ఆయన సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పార్టీ తరఫున రూ.10 లక్షలు సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని మృతుడి గ్రామానికి వెళ్లి స్వయంగా అందజేయనున్నట్లు కొట్టు సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీల పట్ల సీఎంకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని తెలిపారు. అంతకుముందు.. తొక్కిసలాట విషయం తెలిసి విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులు, ఆంధ్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బారావును కలిసి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసిన విషయాన్ని మంత్రులు ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఉద్యోగుల సమస్యలపై సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష కార్యాచరణ

ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో మంగళవారం ఆయన వివిధ ఉద్యోగ సంఘాలతో కూడిన జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ సమావేశ నిర్ణయాలను బొప్పరాజు మీడియాకు వెల్లడించారు. ఏపీ జేఏసీ అమరావతి మూడో మహాసభను కర్నూలులో ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేల కోట్ల రూపాయలు ఇవ్వక పోగా, ప్రతి నెలా జీత భత్యాలు కూడా ఒకటో తేదీన ఇవ్వడం లేదన్నారు. జీతాలు, పెన్షన్‌ల కోసం ఉద్యోగులు రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. ఉద్యోగ విరమణ చేసిన రోజే బెనిఫిట్స్ ఇచ్చి పంపాలని, అలా జరగనందున రిటైర్ కానున్న ఉద్యోగులు భయపడుతున్నారని తెలిపారు. సీపీఎస్ రద్దు, ఉద్యోగాల పర్మినెంట్, సకాలంలో జీత భత్యాల చెల్లింపు హామీలు అమలు కాలేదన్నారు. వీటిపై సీఎం సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ ద్వారా నివేదిక తెప్పించుకుని.. 11వ పీఆర్సీలో జరిగిన అన్యాయాన్ని సరి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లకు ర్యాంకింగ్‌లు పెట్టడం వల్ల ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు.

ఏకలవ్య జాతీయ క్రీడల ఏర్పాట్లపై రాజీ పడొద్దు

- రాష్ట్ర గురుకుల సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే
- ఈ నెల 17 నుంచి 22 వరకు క్రీడా పోటీల నిర్వహణ



లయోలా కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న కాంతిలాల్ దండే తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్వహించనున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల మూడవ జాతీయ క్రీడల ఏర్పాట్లలో ఎక్కడా రాజీ పడొద్దని రాష్ట్ర గురుకుల సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే స్పష్టంచేశారు. విజయవాడ లయోలా కళాశాలలో ఈ క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు జరగనున్న క్రీడల విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కళాశాల ప్రాంగణంలోని ఫుట్ బాల్, హాకీ, బాస్కెట్ బాల్ కోర్టులను పరిశీలించిన కాంతిలాల్ దండే అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఫాదర్ జీఏపీ కిశోర్, సీనియర్ అథ్లెటిక్ కోచ్ వినాయక్ ప్రసాద్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగేంద్ర ప్రసాద్, గిరిజన సంక్షేమ, శాప్ అధికారులు ఉన్నారు.

రొయ్య రైతుకు వెన్నుదన్ను

దేశంలో అత్యధిక రేట్లు ఏపీలోనే

- ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారుల చర్యలు
- ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకన్నా ఎక్కువ ధరకే కొనుగోలు
- క్షేత్రస్థాయిలో గట్టి చర్యలతో ఆక్వా రైతులకు బాసట
- మార్కెట్‌లో రేట్లను నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు
- 14న ఆక్వాఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులతో సమావేశం
- ప్రభుత్వ చర్యల ఫలితంగా 2 సార్లు ఫీడ్ రేట్లు తగ్గించిన కంపెనీలు

ఏపీలో **100** కౌంట్ రొయ్యలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర కిలో **రూ. 210**

ప్రస్తుతం రాష్ట్రంలో **రూ.210- రూ.215** మధ్య కంపెనీలు కొంటున్నాయి

..ఇదే కౌంట్‌కు హరియాణ, పంజాబ్‌లలో రైతులకు చెల్లిస్తున్న ధర **రూ.140** మాత్రమే

పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో **రూ.190**, తమిళనాడులో **రూ.200**

30 కౌంట్ రొయ్యలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర కిలో **రూ.380**

ప్రస్తుతం రాష్ట్రంలో **రూ.380** నుంచి **రూ.400** మధ్య కంపెనీలు కొంటున్నాయి

.. ఇదే కౌంట్ రొయ్యలను హరియాణ, పంజాబ్‌లలో **రూ.320**కు కొంటున్నారు

ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో **రూ.370**, తమిళనాడులో **రూ.350**కు కొనుగోలు చేస్తున్నారు



సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా రొయ్యల ధరలు తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తూ, వారికి మద్దతు ధర లభించేలా అహరహం కృషి చేస్తోందనడానికి ఇంతకంటే నిదర్శనం అవసరం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న చర్యల ఫలితంగా రొయ్య రైతులకు దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ దక్కనంత ధర ఒక్క ఏపీలోనే లభిస్తోంది. ఓ పక్క అంతర్జాతీయంగా రొయ్యల మార్కెట్ తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. వివిధ కారణాలతో ఎగుమతులు తగ్గుతున్నాయి. మరో పక్క మేత ధరలు పెరిగిపోతున్నాయి. వీటన్నింటినీ తట్టుకోవడం రాష్ట్రంలో రొయ్య రైతుకు కష్టంగా ఉంది. ఈ సమయంలో ఏ ఒక్క రైతూ ఆర్థికంగా నష్టపోకూడదన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల సీనియర్ మంత్రులతో ఆక్వా సాధికారత కమిటీని నియమించారు. రొయ్య రైతులకు మేలు చేయడానికి చర్యలు చేపట్టారు. పెరిగిన ఫీడ్ ధరలను నియంత్రించడంతోపాటు రొయ్య ధరలను క్రమబద్ధీకరించేందుకు కమిటీకి పూర్తిస్థాయి అధికారాలను అప్పగించారు. కమిటీ నిర్ణయాలు, చర్యలపై సీఎం వైఎస్ జగన్ నిరంతరం సమీక్షిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ కృషి ఫలితంగా రెండుసార్లు పెంచిన ఫీడ్ ధరలను కంపెనీలు వెనక్కి తీసుకున్నాయి. ఇటీవల టన్నుకు రూ.2,600 చొప్పున పెంచగా, సీఎం ఆదేశాలతో సాధికారత కమిటీ ఆ కంపెనీలతో చర్చలు జరిపింది. ఫలితంగా పెంచిన ధరలను కంపెనీలు తగ్గించాయి. ఇది రైతులకు చాలా మేలు చేసింది.

నెల రోజులుగా ప్రభుత్వ ధరకే కొనుగోలు

ప్రాసెసింగ్ యూనిట్లతోనూ మంత్రుల కమిటీ చర్చలు జరిపింది. రొయ్య రైతులకు గిట్టుబాటు అయ్యేలా ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రీతిలో ధరలను నిర్ణయించారు. వంద కౌంట్ రొయ్యలను రూ.210కు, 30 కౌంట్ రూ.380కు తక్కువ కాకుండా కొనాలని కమిటీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నెల రోజులుగా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఫలితంగా ఇంతటి తీవ్ర సంక్షోభ సమయంలో కూడా దేశంలో మరెక్కడా లేని విధంగా ఒక్క ఏపీలోనే రొయ్యల ధరలు నిలకడగా ఉన్నాయి. రోజూ ప్రభుత్వం నిర్దేశించిన రేట్లు, మార్కెట్‌లో రేట్లను సమీక్షించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ప్రభుత్వం నియమించింది. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్‌తో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ధరల క్రమబద్ధీకరణకు ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం ద్వారా ప్రత్యేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) రూపొందిస్తున్నారు.

14న మరోసారి భేటీ...

ఆక్వా రైతులను ఆదుకునే క్రమంలో సీఎం ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన ఆక్వా ఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులతో సాధికారత కమిటీ మరోసారి భేటీ కానుంది. సమీప భవిష్యత్‌లో ధరల క్రమబద్ధీకరణకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనుంది. రైతులకు మేలు చేసే అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనుంది. .



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
G.O.MS.No. 16
ORDER:

2018లో జోన్, నాన్ జోన్‌గా విభజిస్తూ చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 16 కాపీ

నాడు జోన్లుగా విభజించి... నేడు రాజకీయాలు

టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలో ఉండగా ఆక్వా రంగాన్ని, రైతులను ఏనాడూ పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌గా విభజిస్తూ 2018, ఏప్రిల్ 20వ తేదీన జీవో ఎంఎస్ నం.16 జారీ చేసింది చంద్రబాబు ప్రభుత్వమే. ఆహారం పండిస్తున్న భూములను కాపాడుకోవడం, కాలుష్యాన్ని నివారించడం, లవణీయత (సెలనిటీ) పెరగడం వల్ల భూములు నిరుపయోగంగా కాకుండా చూడడం, పర్యావరణ పరిరక్షణ తదితర కారణాలతో ఈ జోన్ల వర్గీకరణ జరిగింది. ఆక్వా జోనింగ్ చేయకపోతే భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లడమే కాదు, ఆహార ఉత్పత్తులు పండించే భూములు తగ్గిపోయి, ఆహారం కొరత ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు పరిస్థితుల్లో వచ్చిన మార్పులేమిటి? అప్పట్లో చంద్రబాబు చేతిలో దగా పడ్డ ఆక్వా రైతులు సీఎం వైఎస్ జగన్ చర్యలతో మరింత మేలు పొందుతున్నారు. చంద్రబాబు జోన్ వ్యవస్థను మధ్యలోనే వదిలేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక జోన్ వ్యవస్థను పూర్తిచేసి, రైతులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అధికారంలో ఉండగా జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ రూ.3.86కు విద్యుత్‌ను సరఫరా చేసిన చంద్రబాబు, మళ్లీ అధికారంలోకి వస్తే తగ్గిస్తానంటూ కొత్త రాగం అందుకున్నారు. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత మూడున్నరేళ్లుగా ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు విద్యుత్ ధరలు తగ్గించి, యూనిట్ రూ.1.50కే సరఫరా చేస్తోంది. నాన్ ఆక్వాజోన్‌లో అప్పటి నుంచి ఉన్న రేట్లు యథాతథంగా కొనసాగిస్తోంది. చంద్రబాబు హయాంలో ఉన్న మాదిరిగా ఇప్పుడూ యూనిట్ రూ.3.86కే విద్యుత్ సరఫరా చేస్తోంది. పైగా, రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ తక్కువకు దొరికేలా చూస్తోంది. ఇంకోపక్క రైతులకు ఎక్కువ ధర దక్కేలా చర్యలు తీసుకుంటోంది. ఈ వాస్తవాలను మరిచిన చంద్రబాబు.. ఇప్పుడు ఎన్నికలు వస్తుండటంతో రాజకీయాలు చేయడానికి దీన్ని అజెండాగా తీసుకున్నారు. అబద్ధాలతో ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏపీతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఈనెల 12న రొయ్యల కౌంట్ కిలో ధరలిలా (రూ.లలో)

కౌంట్	రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన రేటు	ఆంధ్రప్రదేశ్	ఒడిశా	పశ్చిమబెంగాల్	తమిళనాడు	హరియాణ	పంజాబ్
100	210	210-215	190	190	200	140	140
90	220	220-225	200	200	210	150	150
80	240	240-245	220	220	230	170	170
70	250	250-260	240	240	250	190	190
60	270	270-280	250	250	265	200	200
50	290	300-310	270	270	290	220	220
40	340	340-350	300	300	310	250	250
30	380	380-400	370	370	350	320	320

ఆర్బీకేల్లో ఆక్వా ఉత్పత్తుల రేట్లను ప్రదర్శించాలి

ఆక్వా సాధికారిత కమిటీ సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి

సాక్షి, అమరావతి: ఆక్వా రంగాన్ని పటిష్టం చేసేందుకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ధరలను స్థిరీకరించడంపై దృష్టి సారించాలని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు సూచించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల నేతృత్వంలో సమావేశమైన ఆక్వా సాధికారిత కమిటీ ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన అంశాలపై సమీక్షించి ఆక్వా రంగ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించింది. మంత్రులు మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు మార్కెట్‌లో రేట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ధరలు నిలకడగా కొనసాగేలా సాధికారిత కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుతం మార్కెట్‌లో ఆశించిన మేరకు రేటు లభిస్తోందని, ఇదే రీతిలో కొనసాగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీడ్ రేట్లను మరింతగా తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమావేశాలు జరిపి ధరలు నిలకడగా కొనసాగేలా చూడాలన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు రైతులకు రూ.1.50కే విద్యుత్ సబ్సిడీని అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా ఉత్పత్తుల రేట్లను అన్ని ఆర్బీకేల్లోనూ ప్రదర్శించాలని ఆదేశించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును అధికారులు వివరిస్తూ.. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యుదయ రైతుల నుంచి కూడా ఆక్వా రంగ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా ఎగుమతులపైనే ఆధారపడటంతో ఆక్వా ధరలను స్థిరీకరించలేకపోతున్నామని, దేశీయంగా ఆక్వా ఉత్పత్తుల వినియోగం, మార్కెటింగ్ పెంచగలిగితే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం మార్కెటింగ్ సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నట్లు వివరించారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, అప్పలరాజు తదితరులు

పక్కాగా దేవుడి భూముల రక్షణ

- సర్వేకు ముందే భూముల వివరాలు తహసీల్దార్‌కు..
- వాటి ప్రకారం సర్వే సమయంలో నోటీసులు కోరండి
- అన్ని ఆలయాల ఈఓలకు దేవదాయ శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నందున భూసర్వేలో దేవదాయ శాఖకు సంబంధించిన భూముల వివరాలు నమోదులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని ఆయా ఆలయాల ఈవోలకు మంగళవారం ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ భూములకు సంబంధించిన వివరాలను సర్వేకు ముందుగానే సంబంధిత తహసీల్దార్‌కు తెలియజేసి, ఆ సర్వేకు సంబంధించిన నోటీసులను కోరాలని సూచించారు. ఇక ఆలయ ఈవో, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జి సర్వే పనుల్లో విధిగా పాల్గొని దేవుడి భూముల విస్తీర్ణం, వాటి సరిహద్దుల వివరాలను నిర్ధారించుకోవాలని ఆదేశించారు. మరోవైపు భూముల వివరాలు సక్రమంగా నమోదు చేయించే బాధ్యత సంబంధిత ఈవోదేనని స్పష్టంచేస్తూ 2020 డిసెంబర్‌లో దేవదాయ శాఖ జారీచేసిన ఉత్తర్వుల కాపీని ఈ తాజా ఆదేశాలకు జతచేశారు. కానీ, ఆలయాలకు ఈవో లేనిచోట సర్వేలో సక్రమంగా భూముల వివరాల నమోదు బాధ్యత మండల ఎండోమెంట్ అధికారి తీసుకోవాల్సి ఉంటుందని నాటి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆక్రమణలో 1.05 లక్షల ఎకరాలు..

దేవదాయశాఖ పరిధిలో చిన్నాపెద్ద ఆలయాలు 24,669 ఉన్నాయి. వీటి పేరిట మొత్తం 4,09,229 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. అందులో 87,525 ఎకరాలు ఆక్రమణదారుల చెరలోనూ, మరో 17,839 ఎకరాలు లీజు ఒప్పందం ముగిసినా కౌలుదారుల స్వాధీనంలోనే ఉన్నాయి. మొత్తం 1.05లక్షల ఎకరాల వరకు ఆక్రమణ కింద ఉన్నట్లు గతంలో దేవదాయ శాఖ ప్రకటించింది.

పార్లమెంట్‌లో ‘హోదా’ గళం

▶ మొదటి పేజీ తరువాయి

వందల సార్లు డిమాండ్ చేశామని, ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కు అని గుర్తించాలన్నారు. కేంద్రమే చేపట్టాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను గత సర్కారుకు ఎందుకు అప్పగించాల్సి వచ్చిందో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలేవీ పూర్తి కాలేదని కేంద్రం దృష్టికి తెచ్చారు. 2014లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సౌగతారాయ్ సభకు గుర్తు చేశారు. మంగళవారం లోక్‌సభలో ‘సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్’పై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, మార్గాని భరత్‌రామ్, లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. ఆ వివరాలివీ..

- ▲ ఏపీకి ప్రత్యేక హోదా అనేది దేశ ప్రజల గళం కావాలి. హోదా కల్పించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు ప్రధాని, కేంద్ర మంత్రులకు నివేదించారు. 14వ ఆర్థిక సంఘం పేరుతో ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం సాకులు చెబుతోంది. ప్రత్యేక హోదా కోసం ప్రైవేట్ బిల్లు కూడా ప్రవేశపెట్టాం. విభజన చట్టానికి సవరణ చేయాలని కోరాం. రాష్ట్రానికి ఐదేళ్లు కాదు.. పదేళ్లు హోదా ఇవ్వాలని నాడు వెంకయ్యనాయుడు రాజ్యసభలో డిమాండు చేశారు. జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందంటూ టీడీపీ సభ్యుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.
- ▲ రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరానికి జాతీయ ప్రాజెక్టు తరహాలో నిధులు విడుదల చేయడం లేదు. నూతన భూసేకరణ నిబంధనలు, ప్రాజెక్టు ఖర్చు పెంపు ఇలా పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సవరించిన అంచనా వ్యయం రూ.55,548 కోట్లను సాంకేతిక కమిటీ 2019లోనే ఆమోదించినా ఆర్థిక శాఖ ఇంకా ఆమోదించకపోవడం సరికాదు. ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే తాగునీటి కాంపొనెంట్‌ను వేరు చేయడం. అంచనా వ్యయం నుంచి రూ.4,068 కోట్లు వేరు చేసి కేవలం సాగునీటి కోసమే ప్రాజెక్టును కడుతున్నామనడం ఎంతవరకు సమంజసం? ప్రాజెక్టును తాగునీటికి వినియోగిస్తే ఆ మొత్తాన్ని తగ్గిస్తామనడం సరి కాదు. జాతీయ ప్రాజెక్టులో తాగునీరు కూడా ఒక భాగమే. కాంపొనెంట్ వారీ షరతులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. పోలవరానికి రూ.10 వేల కోట్ల అడ్‌హక్ నిధులను కేటాయించాలి.
- ▲ ఉపాధి హామీ నిధులు గతేడాదితో పోలిస్తే రూ.8,600 కోట్లు తగ్గాయి. ఆంధ్రప్రదేశ్‌కు 9.68 కోట్ల పనిదినాలు తగ్గాయి. జీఎస్టీ పరిహారాన్ని మరో ఐదేళ్లు పొడిగించాలి.
- ▲ విభజన నేపథ్యంలో సుమారు రూ.32 వేల కోట్ల రెవెన్యూ లోటును భర్తీ చేయాలి. గత ప్రభుత్వం పరిమితికి మించి రూ.17,923 కోట్లకుపైగా రుణాలు అదనంగా తీసుకుందనే కారణంతో ఇప్పుడు కోతలు విధించడం సరికాదు. రూ.6,800 కోట్ల విద్యుత్తు బకాయిలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత చట్టం ప్రకారం 77 వేల అదనపు టన్నుల ఆహార ధాన్యాలను రాష్ట్రానికి అందచేయాలి.

ఏపీ ప్రభుత్వం హోదా కోరింది

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభకు లిఖిత పూర్వకంగా వెల్లడించారు. అయితే 14వ ఆర్థిక సంఘం సాధారణ రాష్ట్రాలకు, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు మధ్య వ్యత్యాసం చూపలేదని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు ఇచ్చే పన్నుల వాటాను 32 నుంచి 42 శాతానికి పెంచామన్నారు. రాష్ట్రాల వనరుల లోటును రెవెన్యూ లోటు నిధులతో పూడుస్తున్నామని చెప్పారు.



ఏపీ ఇన్ పార్లమెంట్

గ్రామీణ ఆస్పత్రుల్లో మెడికోల నిర్బంధసేవలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు వైద్యశాఖ సహాయమంత్రి భారతీపవార్ సమాధానం

రాజ్యసభ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ‘ఎ’ కేటగిరీలో సీట్లు పొందిన పోస్టు గ్రాడ్యుయేట్ మెడికోలు వైద్యవిద్య పూర్తిచేసిన అనంతరం ఏడాదిపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో నిర్బంధంగా వైద్యసేవలు అందించాలని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి భారతీపవార్ చెప్పారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ... ఈ నిబంధన 2022–23 విద్యా సంవత్సరం నుంచి వర్తిస్తుందని తెలిపారు. సబ్ సెంటర్ స్థాయిలో వైద్యాధికారులు సేవలందించే విధంగా ఏపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ట్రయల్ రన్ కూడా ప్రారంభించిందని చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులను నియమించుకునేందుకు సరళమైన నిబంధనలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఆరోగ్యమిషన్ కింద కాంట్రాక్టింగ్ ఇన్, కాంట్రాక్టింగ్ అవుట్ పద్ధతిలో స్పెషలిస్ట్ సర్వీసులు, ప్రైవేటు ఆస్పత్రుల నుంచి స్పెషలిస్టు డాక్టర్లను ప్రభుత్వసేవలకు వినియోగించుకోవడం వంటి వాటిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్లు, స్పెషలిస్టులను ఆకర్షించే విధంగా జీతభత్యాలు నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలకు ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాంను ఆమోదించిందని, ఇందులో భాగంగా పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జిల్లా ఆస్పత్రుల్లో మూడునెలలపాటు సేవలందించేందుకు నియమిస్తారని చెప్పారు.

ఏపీలో 3 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్) కింద ఏపీలోని పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంలలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు మరో ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఈ మూడు కాలేజీల్లో 150 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతించినట్లు తెలిపారు. రెండోదశలో రాష్ట్రంలోని 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేస్తూ కొత్త పీజీ కోర్సులు ప్రారంభించేందుకు 1,040 పీజీ సీట్లు పెంచేందుకు అనుమతించినట్లు పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా 'ఫ్యామిలీ డాక్టర్' విధానం ప్రవేశపెట్టాలి



వైద్య, ఆరోగ్య సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన రాజ్యసభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశంపై మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు సాధారణ వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని, అనేక జబ్బులకు సకాలంలో చికిత్స లభిస్తుందని చెప్పారు. ఎంపికచేసిన జిల్లాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు.

ఏపీలో గిరిజనుల అభివృద్ధికి నిధులివ్వండి

ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ కోరారు. ద కాన్‌స్టిట్యూషన్ (ఎస్సీ, ఎస్టీ) ఆర్డర్స్ (రెండో సవరణ) బిల్లు–2022పై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలతోపాటు 125 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనుల మద్దతుకు తగిన నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏకలవ్య మోడల్ స్కూళ్ల సంఖ్య పెంచాలని కోరారు.

2014 నుంచి ఇప్పటివరకు ఏపీకి రూ.23,110.472 కోట్లు

ఏపీ పునర్విభజన చట్టం–2014 ప్రకారం నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు 2014 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.23,110.472 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రీసోర్స్ గ్యాప్ కింద రూ.5,617.89 కోట్లు, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధికి రూ.1,750 కోట్లు, నూతన రాజధాని ఏర్పాటుకు రూ.2,500 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.13,226.772 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. 2015–2016 నుంచి 2019–20 వరకు ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్ట్‌ల కోసం రుణం, వడ్డీ తిరిగి చెల్లించేందుకు రూ.15.81 కోట్లు విడుదల చేసినట్లు టీడీపీ సభ్యుడు రవీంద్రకుమార్ ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 6,928.13 హెక్టార్లలో పంట నష్టం

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ వెల్లడి

లోక్‌సభ

సాక్షి, న్యూఢిల్లీ: భారీ వర్షపాతం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 6,928.13 హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదించిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు 2022–23లో ఎస్డీఆర్ఎఫ్‌కు రూ.1,252.80 కోట్లు కేటాయించగా తొలివిడత కేంద్రం వాటా రూ.940 కోట్లకుగాను రూ.470 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

48.10 శాతం మంది వ్యవసాయరంగ పనుల్లోనే



ఆంధ్రప్రదేశ్‌లో 48.10 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2020–21లో తేలిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. 2012–13తో పోలిస్తే 2018–19లో వ్యవసాయ కుటుంబ వార్షిక సగటు ఆదాయం రూ.5,979 నుంచి రూ.10,480కు పెరిగిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రశ్నకు జవాబిచ్చారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై కమిటీ లేదు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంపై ఎలాంటి కమిటీ నియమించలేదని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారతశాఖ సహాయమంత్రి నారాయణస్వామి తెలిపారు. అయితే 2022 అక్టోబర్ ఆరో తేదీన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ చైర్‌పర్సన్‌గా ఒక కమిషన్‌ను నియమిస్తూ ఆదేశాలిచ్చినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో నాలుగు ఫిషింగ్ హార్బర్లకు అనుమతి



ఆంధ్రప్రదేశ్‌లో ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, వాడరేవుల్లో రూ.1,291.40 కోట్లతో ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ప్రశ్నకు కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా జవాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు 2022–23లో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద 16 కోల్డ్‌స్టోరేజీ/ఐస్‌ప్లాంట్లు ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

ఏపీలో ఎన్ఐఎఫ్‌టీఈఎం ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్‌టీఈఎం) ఏర్పాటు ప్రతిపాదన లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ జవాబిచ్చారు.

ప్రసాద్ పథకంలో మంగినపూడి బీచ్ చేర్చాలి



మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను ప్రసాద్ పథకంలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి కోరారు. కరోనా తర్వాత పర్యాటక రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మంగినపూడి బీచ్‌ను ప్రపంచస్థాయి సదుపాయాలతో మెరుగుపరచాలని లోక్‌సభలో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

● శక్తి

ఆమె మహిళ అనో ..
సపోర్ట్ లేదనో..
పని మెల్లిగా నేర్చుకుంటుందో...
మైనారిటీ వర్గమనో..
సానుభూతి చూపారంటే..
దానినే సవాల్‌గా తీసుకొని
మరింత శక్తిమంతంగా ఎదగాలని
తన జీవితాన్ని ఉదాహరణగా
చూపుతుంది లీనా నాయర్.


లీనా నాయర్

సమానంగా చూడండి చాలు

లీనా నాయర్ బ్రిటిష్ ఇండియన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా అంచెలంచెలుగా ఎదిగిన శక్తి. 30 సంవత్సరాల పాటు ఉద్యోగ నిర్వహణలో ఎన్నో క్రియాశీలక పదవులను చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యునిలీవర్ కంపెనీని జెండర్ బ్యాలెన్స్‌డ్ కంపెనీగా నిలబెట్టింది. వరల్డ్ వైడ్ లగ్జరీ బ్రాండ్ చానెల్ సీఈవోగా ఉన్న లీనా పుట్టి పెరిగింది మహారాష్ట్రలో. ఇప్పుడు వందకుపైగా దేశాల్లో లక్షలాది మంది ఉద్యోగుల బాధ్యతను సమర్థవంతంగా నడిపిస్తూ మహిళాశక్తిని ఈ తరానికి చాటుతోంది.

■ **జెండర్ బ్యాలెన్స్..**

ఫ్రెంచ్ లగ్జరీ హౌజ్ కోకో చానెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ఈ ఏడాది జనవరి నుంచి దిగ్విజయంగా విధులను నిర్వర్తిస్తోంది లీనా నాయర్. అంతకుముందు యూనిలీవర్‌కు నాయకత్వం వహించారు. వందకు పైగా దేశాలలో సుమారు లక్షా యాభై వేల మంది బాధ్యత ఆమె మీద ఉంది.

1990 మొదట్లో నాయర్ జంషెడ్‌పూర్‌లోని హిందుస్తాన్ యూనిలీవర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరినప్పుడు, ఆ కంపెనీ ఉద్యోగుల్లో కేవలం రెండు శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఆమె కిందటేడాది బయటకు వచ్చినప్పుడు ప్రపంచవ్యాప్త కంపెనీ నిర్వహణలో లింగ సమతుల్యత ఉందని ప్రకటించింది. అంటే, నాయర్ తనదైన ముద్ర ఏ స్థాయిలో ఆ కంపెనీలో వేసిందనేది స్పష్టం అవుతుంది.

■ **లగ్జరీ మార్కెట్..**

ఫ్యాషన్ దిగ్గజంగా కోకో చానెల్ కంపెనీకి 112 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. లగ్జరీ కన్జ్యూమర్ గూడ్స్ మార్కెట్‌లోకి దూసుకెళ్లేలా చేసిన మొదటి వ్యక్తి నాయర్ ఏమీ కాదు. అంతకుముందు అనుభవజ్ఞుడైన ఆంటోనియా బెల్లోని ఉన్నాడు. ఇప్పుడు అతను మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు. అతనితో పాటు మరికొంత నిష్ణాతులైన వ్యక్తులు ఈ నిచ్చెన మీద ఇప్పటికే ఉన్నారు. అంటే, వారందరి మధ్య నాయర్‌కి ఆ పదవిని కట్టబెట్టారంటే ఆమె శక్తి సామాన్యమైనది కాదనేది స్పష్టం అవుతుంది. అంతేకాదు, ఆ పదవి ఆమెకు మరింత సవాల్‌తో కూడుకున్నదన్నమాటే. 53 ఏళ్ల వయసులో ఆమె ఈ ఘనత వహించిన కంపెనీని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి సర్వసిద్ధంగా ఉందన్నమాట.

ఆమెకు ఇదేమీ కొత్తగాకాదు. ప్రపంచవ్యాప్త యునిలీవర్‌లో 30 సంవత్సరాలు పనిచేసిన మొదటి ఆసియా, మొదటి మహిళ, అతి పిన్న వయస్కురాలు.. అనే రికార్డు ఆమె ఖాతాలో ఉంది. ఆంగ్లో-డచ్ కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీలో ఫ్యాక్టరీ ఫ్లోర్ లెవెల్ మేనేజర్‌గా అంతస్తులో పనిచేసిన మొదటి మహిళ, నైట్ షిఫ్ట్‌లో పనిచేసిన మొదటి మహిళగానూ నాయర్‌కు పేరుంది.

■ **ప్రతిరోజూ సవాల్..**

'లీనా తను ఏ పని చేసినా దానికో గొప్ప విలువ ఇస్తుంది. ఏ పాత్ర పోషించినా అందుకు తగిన శక్తి సామర్థ్యాలను చూపడంలో దిట్ట. అందుకే ఆమెకు అంతటా అత్యంత గౌరవం. ఆమె తన కొత్త పాత్రలో రాణిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు' అని కోకో చానెల్‌కు ఎంపికైన సందర్భంలో యునిలీవర్ మాజీ చైర్మన్ దాడి సేత్ ఆమె గురించి గొప్పగా చెప్పారు. కిందటేడాది డిసెంబర్‌లో నాయర్‌ను సీఇవోగా నియమించాలని చానెల్ తన నిర్ణయాన్ని ప్రకటించినప్పుడు, ఇది పరిశ్రమకే వైవిధ్యమైన మైలురాయిగా అంతా ప్రశంసించారు.

'నా కెరీర్ ప్రారంభ రోజుల్లో కాలేజీల్లోనూ, కంపెనీల్లోనూ ఒక మహిళగా నా స్థానం ఉండేది. ఉన్నతస్థాయిని సాధించడానికి ప్రతి రోజూ సవాల్‌గా ఉండేది. నామీద ఎవరికైనా సానుభూతి ఉంది అంటే నాకు నేనే అట్టడుగున ఉన్నట్టు అనిపించేది. దానిని నేను చాలా వ్యక్తిగతంగా తీసుకునేదాన్ని. అందుకే, నన్ను నేను ఉన్నతంగా మలుచుకోవడానికి ఇప్పటికీ ప్రతిరోజూ ప్రయత్నిస్తుంటాను' అని సవినయంగా చెబుతారు నాయర్. బహుశా అందుకే ఆమె ఎదుగుదల ఈ రీతిలో సాధ్యమైందేమో!

● **చిన్న పట్టణం నుంచి ...**

మహారాష్ట్రలోని చిన్న పట్టణమైన కొల్హాపూర్‌లో జన్మించిన నాయర్, ఎలక్ట్రానిక్స్, టెలి కమ్యూనికేషన్ లో ఇంజినీరింగ్ చేసింది. కాలేజీ పూర్తయిన రోజుల్లో ఒక రోజు కాలేజీ ప్రొఫెసర్ ఆమెను కూర్చోబెట్టి 'నీవు ఇప్పటికి ఒక అందమైన ఇంజినీర్‌వే. కానీ, విధి నిర్వహణలో సత్తా చూపగల నైపుణ్యం కలిగి ఉన్నావని భావిస్తున్నాను' అని చెప్పారట. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరిస్తుంది నాయర్. ఆ తర్వాత పట్టుదలతో ఎంబీయేలో గోల్డ్‌మెడల్ సాధించింది. హిందూస్తాన్ యూనిలీవర్ ఎంపిక చేసుకున్న 15 వేల మంది మగవారిలో అతి కొద్దిమంది స్త్రీలలో ఒకరిగా నాయర్ ట్రైనీగా చేరింది.

ఫ్యాషన్ అంటే ఏమిటో తెలుసా? నువ్వు మాట్లాడకుండానే నువ్వేమిటో తెలియజేసేది... అంటారు. ఫ్యాషన్ ఎక్కడ ఉంటుందో యువతరం అక్కడ ఉంటుంది. అయితే పేచీ అంతా 'ఫాస్ట్ ఫ్యాషన్'తోనే! ఫాస్ట్ ఫ్యాషన్‌కు మహరాజ పోషకులుగా ఉన్న యువతరం ఇప్పుడు ఎందుకు పునరాలోచనలో పడింది?

యూత్ పల్స్

ఫాస్ట్ ఫ్యాషన్ ఫ్లో అవుతుందా!



'ఫాస్ట్ ఫ్యాషన్'గా పిలవబడే చీప్, స్టైలిష్, మాస్-ప్రొడక్షన్ క్లాత్స్ పర్యావరణంపై చూపే ప్రభావం గురించి ఎప్పటి నుంచో చర్చ జరుగుతోంది. 'ఎఫర్డబుల్' 'ట్రెండీ'లాంటి కారణాల వల్ల యూత్ ఫాస్ట్ ఫ్యాషన్ ట్రెండ్‌లో ఎప్పటినుంచో ముందు ఉంది. అయితే సోషల్ మీడియాలో 'ఫాస్ట్ ఫ్యాషన్'పై జరుగుతున్న వాడి వేడి చర్చ తాలూకు సెగ చాలామంది యూత్‌ని మెల్లగా తాకుతోంది.

'ఫాస్ట్ ఫ్యాషన్' గురించి కూల్‌గా ఆలోచించుకునేలా చేస్తోంది.

ఇక ఫాస్ట్‌ఫ్యాషన్ గురించి వెనక్కి వెళితే...

1970 తరువాత చైనా, లాటిన్ అమెరికా దేశాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ దుస్తులు తయారు చేసే పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. తక్కువ ధరకు రావడంతో ఈ దుస్తులు వేగంగా అమ్ముడయ్యేవి. వ్యాపార కోణంలో లాభాల మాట ఎలా ఉన్నా పర్యావరణ కోణంలో జరిగే నష్టాల గురించి చర్చ మొదలైంది.

ఎలిజబెత్ ఎల్. క్లైన్ రాసిన 'ఓవర్ డ్రెస్స్‌డ్: ది షాకింగ్లీ హై కాస్ట్ ఆఫ్ చీప్ ఫ్యాషన్' పుస్తకం యువతలో ఎంతోమందిని ప్రభావితం చేసింది.

ఫ్యాషన్ ఇండస్ట్రీలో జరగాల్సిన మార్పులు, కొనుగోలుదారుల ఎంపికలో రావాల్సిన మార్పులు, పర్యావరణ నష్టాల గురించి గణాంకాలతో లోతుగా విశ్లేషిస్తుంది ఈ పుస్తకం.

'ఓవర్ డ్రెస్స్‌డ్ పుస్తకం చదివిన తరువాత ఒకరోజు పనిగట్టుకొని కొన్ని క్లాత్ స్టోర్స్ చుట్టూ తిరిగాను. ఎక్కడా కాటన్ దుస్తుల జాడ లేదు. పుస్తకం చదవడానికి ముందు నేను కూడా ఫాస్ట్ ఫ్యాషన్ ట్రెండ్‌ను అందరిలాగే అనుసరించేదానిని. అయితే ఇప్పుడు నా ఆలోచనా ధోరణిలో పూర్తిగా మార్పు వచ్చింది' అంటోంది ముంబైకి చెందిన రేష్మ.

ప్రపంచ వ్యాప్తంగా మోస్ట్ పాపులర్ మోడల్‌గా ప్రసిద్ధి పొందిన ఫాస్ట్ ఫ్యాషన్‌కు నెంబర్‌వన్ టార్గెట్ అయిన యూత్‌లో కొద్దిగా మార్పు మొదలైనట్లే కనిపిస్తోంది. అమెరికాలో నిర్వహించిన ఒక సర్వేలో యువతరంలో ఎక్కువమంది 'ఫాస్ట్ ఫ్యాషన్' అనేది తమ తప్పనిసరి ఛాయిస్ కాదు అని చెప్పారు.

సోషల్ మీడియాలో పర్యావరణ సంక్షోభం గురించి రకరకాల కోణాల్లో జరుగుతున్న చర్చ వల్ల 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనే విషయాలపై యూత్ తీరికగా ఆలోచించే పరిస్థితి ఏర్పడింది.

ఆన్‌లైన్ వేదికగా పర్యావరణ స్పృహను రేకెత్తించే అంశాలపై యూత్ దృష్టి సారించేలా చేయడంలో యష్న దురియలాంటి వాళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

'ఇక ముందు ప్లకార్డ్‌లు పట్టుకొని వీధులకు వెళ్లొద్దు' అని పేరెంట్స్ యష్న దురియాకు ఎన్నోసార్లు చెప్పారు. అయితే 22 సంవత్సరాల యష్న ఎప్పటిలాగే పోస్టర్లు, బ్యానర్లు పట్టుకొని దిల్లీ వీధుల్లోకి వెళుతోంది. గ్లోబల్ క్లైమెట్ స్ట్రైక్‌లో పాల్గొంటోంది.

పోస్టర్లు, బ్యానర్లు పట్టుకొని తమ కూతురు వీధులకెక్కడం తల్లిదండ్రులకు తల నొప్పి కావచ్చు. అయితే కూతురికి మాత్రం పర్యావరణ విధ్వంసమే అతి పెద్ద తలనొప్పి.

'పర్యావరణ సంక్షోభం గురించి విన్నప్పుడల్లా నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు అనిపిస్తుంది. కొన్నిసార్లయితే తట్టుకోలేక స్నేహితుల ముందు బిగ్గరగా ఏడ్చేదాన్ని. పర్యావరణ సంక్షోభం గురించి ప్రజలు ఎందుకు స్పందించడం లేదు అనే ప్రశ్న నన్ను ఎప్పుడూ వేధిస్తుంది' అంటుంది యష్న.

> **పర్యావరణ సంక్షోభం గురించి విన్నప్పుడల్లా నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు అనిపిస్తుంది. కొన్నిసార్లయితే తట్టుకోలేక స్నేహితుల ముందు బిగ్గరగా ఏడ్చేదాన్ని. పర్యావరణ సంక్షోభం గురించి ప్రజలు ఎందుకు స్పందించడం లేదు అనే ప్రశ్న నన్ను ఎప్పుడూ వేధిస్తుంది.**
> **- యష్న, ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్**



యష్నతో ఏకీభవించే యువతరంలో ఎంతోమంది 'మీరు చెప్పింది నిజమే' అనడం వరకు మాత్రమే పరిమితం కావడం లేదు. 'నా పరిస్థితి ఏమిటి? నా పాత్ర ఏమిటి?' అని ఆత్మావలోకనం చేసుకుంటున్నారు.

యువతరం ఎప్పుడూ మార్పుకు సిద్ధంగా ఉంటుంది.

ఫ్రైడే ఫర్ ఫ్యూచర్ (ఎఫ్ఎఫ్ఎఫ్), దేర్ ఈజ్ నో ఎర్త్ బీ...లాంటి ఎన్విరాన్‌మెంట్ యాక్షన్ గ్రూపులలో చురుగ్గా పాల్గొంటున్న యువతరాన్ని చూస్తుంటే పర్యావరణహితం కోసం తమ అభిరుచులు మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారనే విషయం సులభంగానే బోధపడుతుంది.

డూ-ఇట్-యువర్ సెల్ఫ్ (డిఇవై) అనే పాత మాట మనకు కొత్త కాదు. కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో పాపులర్ అయిన ఈ మాట ఇప్పుడు యువతరాన్ని పలకరిస్తోంది. దుస్తుల ఎంపికకు సంబంధించిన ఆలోచనలు, ప్రత్యామ్నాయ సృజనాత్మక మార్గాల గురించి ఆలోచించడానికి ఊతం ఇస్తోంది.

● స్ఫూర్తి


ప్రియా శర్మ

వీల్ చెయిర్ విల్ పవర్

ఆమె ఎప్పుడూ ఇంట్లో వారి మీద ఆధారపడుతూ వచ్చింది. కానీ, ఆత్మస్థైర్యంతో తనను తాను నిలదొక్కుకోవడంలో ఎవరిమీదా ఆధారపడటం లేదు. ఇంటి గడప దాటడానికే ఎన్నో అడ్డంకులు ఉన్న పరిస్థితుల్లో ఆ ఇంటి గడప నుంచే తన భవిష్యత్తుకు బాటలు వేసుకుంటోంది జైపూర్ వాసి అయిన దివ్యాంగురాలు ప్రియా శర్మ. తన జీవన పోరాటం ద్వారా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న ప్రియాశర్మ అందరికీ స్ఫూర్తిదాయకం.

అడగడుగునా అవరోధాలు, నిరాశలే. అయినా, తనను తాను మలుచుకున్న తీరు నవతరానికి స్ఫూర్తినిస్తుంది. ప్రియ తనకున్న వైకల్యం గురించి బాధపడకుండా ఇంటి నుంచే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. నెట్ ఎగ్జామ్‌లో ర్యాంకు సాధించి శభాష్ అనిపించుకుంది. దేశవ్యాప్త వికలాంగుల హక్కులు, వారి ప్రయోజనాల కోసం కృషి చేస్తోంది. సోషల్ మీడియా వేదికగా స్ఫూర్తిదాయక కథనాలను పంచుకుంటోంది. తన గళం దివ్యాంగుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికే అని చెబుతోంది.

■ **వీల్ చెయిర్ ప్రయాణం**

చక్కగా ఉన్న అమ్మాయి అడుగు కూడా కదపలేకపోతోందని రెండేళ్ల ప్రియాశర్మను వైద్యులకు చూపించారు ఆమె తల్లితండ్రి. సెరిబ్రల్ పాల్సీ కారణంగా ఆమె జీవితమంతా నడవలేదని డాక్టర్లు నిర్ధారించారు. ఇకపైన ఆమె జీవనం భారం అవుతుందేమో అనుకున్నారు ప్రియ తల్లీతండ్రి.

''పిల్లలు నడవడం నేర్చుకున్నప్పుడు నేను వీల్ చెయిర్ పట్టుకున్నాను. నాకు చదువంటే చాలా ఇష్టం. కానీ, చాలా స్కూల్స్ నాకు అడ్మిషన్ ఇవ్వడానికి నిరాకరించాయి. అందుకు కారణం దివ్యాంగుల పిల్లలకు స్కూల్, కాలేజీలో సరైన సౌకర్యాలు లేకపోవడమే. ఎంతో ప్రయత్నమ్మీద ఒక స్కూల్‌లో అడ్మిషన్ లభించింది. అది కూడా ఇంట్లో ఉండే చదువుకోవాలన్న నిబంధన మీద. మా నాన్న పూజారి, అమ్మ గృహిణి. ఐదేళ్ల వయసు నుంచి ఇంట్లోనే అమ్మనాన్నల అండతో చదువుకున్నాను. పరీక్షల సమయంలో అమ్మనాన్నలే ఎగ్జామ్ సెంటర్‌కి తీసుకెళ్లేవారు. ఇలాంటి బిడ్డను కనడం కంటే, అసలు బిడ్డలే లేకపోవడం మేలు అనే మాటలు మా అమ్మ ఎన్నో పడింది. ఎక్కడా సీట్ దొరకలేదు. నేను దేనికీ ఉపయోగపడనని, చదువుకోలేనని, పరీక్షలు రాయడం అవసరమా..' అని మా చుట్టుపక్కల వాళ్లు, బంధువుల్లోనే చాలా మంది అనేవారు.

■ **పోస్ట్ గ్రాడ్యుయేషన్...**

అమ్మ, నాన్న సాయంతో అక్షరాలు నేర్చుకున్న నేను వారి ద్వారానే పై తరగతులకు చేరుకోగలిగాను. స్కూల్, కాలేజీ స్థాయి చదువును ఇంటి నుంచే పూర్తి చేశాను. చరిత్ర గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో అదే మాధ్యమంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. హిస్టరీలోనే పీహెచ్‌డి చేసేందుకు సిద్ధమవుతున్నాను. దీనికి అర్హత సాధించేందుకు ఎస్ఇటి ఎగ్జామ్ రాసి, ఉత్తీర్ణత సాధించాను. నేను ఇంత చదువుతానని మా కటుంబంలో ఎవరూ ఊహించలేదు. పీహెచ్‌డిలో చేరడంతో పాటు ఉద్యోగానికి ప్రయత్నాలు చేస్తున్నాను. పురావస్తు శాఖలో పనిచేయాలనుకుంటున్నాను. అందుకు, ఎన్నో సెంటర్లకు వెళ్లి కలిశాను. పోటీ పరీక్షలకు హాజరైనా ఎక్కడా సరైన ర్యాంప్ దొరకడం లేదు. కారణం, దివ్యాంగురాలిగా ఉండటమే. ఈ స్థితి ఎలాగూ తప్పదు. కానీ, పట్టుదలతో నా భవిష్యత్తును నేనే దిద్దుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

■ **సౌకర్యాల లేమి...**

ప్రవేశ పరీక్షల కోసం ఎన్నో ఎగ్జామ్ సెంటర్స్‌కు వెళ్లాను. వెళ్లిన ప్రతిచోటా దివ్యాంగులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నాను. సినిమాలు చూడటం ఇష్టం. కానీ, అక్కడా దివ్యాంగులకు సరిపడే వసతులేవీ లేవు. నేను చదువుకున్న పుస్తకాల్లోని చారిత్రక కట్టడాలను చూడాలని ఇష్టం. కానీ, ఇది కూడా పెద్ద సమస్యగా అనిపించింది. మెట్లు ఎక్కడం సమస్య, టాయ్‌లెట్స్‌కు వెళ్లడం సమస్య. దివ్యాంగులకున్న ఇష్టాలు, వారు సమాజంలో ప్రతిచోటా ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్వయంగా అనుభవించి తెలుసుకున్నాను. వాటిపై గళం విప్పాలని నిర్ణయించుకున్నాను. రాజస్థాన్ వికలాంగుల ఆలోచనల్లో మంచి మార్పు తీసుకురావడానికి నా గొంతుక రాష్ట్ర ప్రభుత్వానికి చేరేలా ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభించాను.

■ **మోటివేషనల్ స్పీకర్..**

యూట్యూబ్ వేదికగా నా ఆలోచనలను పంచుకోవడం మొదలుపెట్టాను. రెండు నెలల క్రితం 'మేక్ ది వరల్డ్ వర్త్ ఆజ్' పేరుతో ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభించాను. ఈ పిటిషన్‌పై ఇప్పటికే రెండు వేల మంది దివ్యాంగులు సంతకాలు చేశారు. వీల్ చెయిర్ మీదే నా ముందున్న ప్రయాణమంతా అని తెలుసు. కానీ, వీల్ చెయిర్ పవర్ కూడా నా చుట్టూ ఉన్నవారికి చూపాలనుకుంటున్నాను. అందుకే, నాకిష్టమైన రంగంలో రాణించడానికి నా వంతుగా ప్రతీ సవాల్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాను'' అని వివరిస్తోంది ప్రియా శర్మ.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడుచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా ముగ్గులు బాగా వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో చక్కటి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

బ్యూటిప్



శిరోజాలు సిల్కీగా, ఆరోగ్యంగా ఉండటానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాం. రెడీమేడ్‌గా దొరికే షాంపూల్లో రసాయనాల గాఢత ఎక్కువగా ఉండి వెంట్రుకలు దెబ్బతింటున్నాయని బాధపడుతుండే వారు ఇంట్లోనే షాంపూని తయారు చేసుకోవచ్చు.

కావలసినవి: కోడిగుడ్డు, టేబుల్‌స్పూన్ నిమ్మరసం, టేబుల్ స్పూన్ క్యాస్టిల్ సోప్ లిక్విడ్, టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, అరకప్పు నీళ్లు లేదా హెర్బల్ టీ, కొన్ని చుక్కల ఎసెన్షియల్ ఆయిల్.

తయారీ: వీటన్నింటినీ కలిపి తలకు రాసుకుని స్నానం చేయాలి. ఈ షాంపూని ఫ్రిజ్‌లో పెట్టుకుని రెండు వారాల వరకు వాడుకోవచ్చు. తాజాగా తయారు చేసుకుంటే మరింత మంచిది.

ఆమె పేరు స్నేహాషాహీ.
పర్యావరణంతో స్నేహం చేసింది.
పర్యావరణ రక్షణను చదివింది.
నీటి చుక్క... మీద పరిశోధన చేస్తోంది.
నీటి విలువ తెలుసుకుని జీవించమంటోంది.
ఇన్ని చేస్తున్న ఆమెను యూఎన్ గుర్తించింది.
ఇటీవల 'యూత్ ఫర్ ఎర్త్' అవార్డుతో గౌరవించింది.
ఈ సందర్భంగా ఆమె గురించి.

పర్యావరణ స్నేహిత

స్నేహాషాహీకి 28 ఏళ్లు. ఎం.ఏ. ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ కోసం 2019లో బరోడాలోని మహారాజా షాయాజీరావ్ యూనివర్సిటీలో చేరింది. పర్యావరణ పరిరక్షణను ప్రాక్టికల్‌గా చేసి చూపించడం కూడా అప్పుడే మొదలు పెట్టిందామె. క్రియాశీలకంగా పని చేయడానికి ముందుకు వచ్చిన మరో మూడు వందల మంది విద్యార్థులను కూడా చేర్పించింది. ఇక పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహించిన ప్రచారంలో ఆ యూనివర్సిటీ క్యాంపస్‌లోని స్టూడెంట్స్ అందరినీ భాగస్వాములను చేసింది. అందరూ కలిసి క్యాంపస్‌లో ప్రవహిస్తున్న కాలువను శుభ్రం చేసే పని మొదలు పెట్టారు. అది సహజమైన కాలువ, అందులో అనేక ప్రాణులు నివసిస్తుంటాయి. అలాంటి వాటర్ బాడీ మనుషుల బాధ్యతారాహిత్యం వల్ల మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయింది. స్టూడెంట్స్ అంతా కలిసి బయటకు తీసిన చెత్త ఎంతో ఊహించగలరా? ఏడు వందల కేజీలు. ఆ తర్వాత వర్షాలకు ఆ కాలువ పూర్వపు వైభవాన్ని సంతరించుకుని తాబేళ్లు, మొసళ్లకు ఆలవాలం అయింది.

వ్యర్థాల ప్రదర్శన

కాలువ నుంచి తీసిన థర్మోకోల్ షీట్‌లు, గాజు సీసాలు, మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలను వాల్ హ్యాంగింగ్‌లు, పూల కుండీలుగా రీ సైకిల్ చేసి క్యాంపస్‌లోనే ప్రదర్శనకు ఉంచారు. ఒకసారి కాలువను శుభ్రం చేయడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం వచ్చినట్లు కాదు, ఇకపై కూడా ఇలాంటివేవీ కాలువలో కనిపించకూడదనే సందేశం ఇవ్వడానికే ఈ పని చేశారు వాళ్లు. ఇంతటి బృహత్తరమైన కార్యక్రమానికి రూపకల్పన చేసిన స్నేహ, ఆమె బృందం 'యూత్ ఫర్ ఎర్త్' అవార్డుకు ఎంపికయ్యారు. స్నేహ ఆ సందర్భంగా మాట్లాడుతూ '' మనకందరికీ చెత్తను అలవోకగా ఏదో ఒక వైపుకు విసిరేయడం బాగా అలవాటై పోయింది. చాక్లెట్ ర్యాపర్‌ని రోడ్డు మీద వేయడానికి సందేహించే వాళ్లు కూడా నీటి కాలువ కనిపిస్తే మరో ఆలోచన లేకుండా అందులోకి విసిరేస్తారు. నిజానికి ఆ పని రోడ్డు మీద వేయడం కంటే ఇది ఇంకా ప్రమాదకరం. మా క్యాంపస్‌లో చెత్తను తొలగించడానికి ముందు కొద్ది నెలల పాటు చెత్తను ఇష్టానుసారంగా పారేయవద్దని ప్రచారం మొదలు పెట్టాం. ఆ మేరకు బాగానే చైతన్యవంతం చేయగలిగాం. నిజానికి కాలువను శుభ్రం చేయడానికంటే చైతన్యవంతం చేయడమే అదే పెద్ద టాస్క్. అయితే అందరూ యూత్, చదువుకుంటున్న వాళ్లు, మంచి మార్పుని స్వాగతించడానికి సిద్ధంగా ఉండే వాళ్లే కావడంతో మొత్తానికి మా ప్రయత్నం విజయవంతమైంది. ఆ తర్వాత క్యాంపస్ బయట నివసిస్తే స్థానికుల్లో కూడా మార్పు తీసుకు రాగలిగాం. క్లీనింగ్ మొదలుపెట్టిన తర్వాత క్యాంపస్‌లో అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పని చేశారు. మేము మొదలు పెట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఇప్పుడు మా జూనియర్ బ్యాచ్‌లు కొనసాగిస్తున్నాయి. బరోడా వాసులు ఎంతగా చైతన్యవంతం అయ్యారంటే... ఎవరైనా చేతిలోని ప్లాస్టిక్ కవర్‌ని నిర్లక్ష్యంగా రోడ్డుమీద కానీ కాలువల్లో కానీ విసిరేస్తుంటే చూస్తూ ఊరుకోవడం లేదు. 'ఇది ఏం పని? పర్యావరణం పట్ల బాధ్యతగా వ్యవహరిద్దాం' అని గుర్తు చేస్తున్నారు'' అని చెప్పింది.




స్నేహాషాహీ

యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ 1972లో ప్రారంభమైంది. ఈ విభాగం భూగోళాన్ని ప్లాస్టిక్ రహితం గా మార్చడం కోసం పని చేస్తోంది. ఇందుకోసం 25 దేశాల నుంచి రెండు లక్షల ఇరవై ఐదు వేల మంది యువతను భాగస్వాములను చేసింది. అందులో భాగంగానే స్నేహ ఈ గుర్తింపును, గౌరవాన్ని పొందింది. ఇప్పుడామె బెంగళూరులో ఎక్స్‌ట్రీమ్ హైడ్రోలాజికల్ ఈవెంట్స్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. ''చిన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాలను చూశాను. రక్షిత మంచినీటి సౌకర్యం లేకపోవడంతో వాళ్లు వీధిలో బోరు నీటినే తాగుతున్నారు. అప్పటినుంచి నాకు తెలియకుండానే నీటి గురించి శ్రద్ధ మొదలైంది. ఎవరైనా నీటి కష్టాలు తెలియకుండా పెరిగారంటే నా దృష్టిలో వాళ్లు విశేషాధికారాలు, సౌకర్యాలతో పెరిగినట్లే. నీటి ఎద్దడి కారణంగా కిలోమీటర్ల దూరం నుంచి నీటిని మోసుకునే జీవితాలెన్నో. ఒకవేళ నీరు ఉన్నప్పటికీ అది కలుషితమైన నీరు అయితే ఆ బాధలు వర్ణనాతీతం. అందుకే నీటి వనరులను కాపాడుకుందాం. రేపటి రక్షణ కోసం నేడు కొద్దిగా శ్రమిద్దాం'' అని చెప్తోంది స్నేహాషాహీ.



క్వార్టర్ ఫైనల్లో రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక-వైదేహి చౌదరీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. షోలాపూర్‌లో మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి జోడీ 6-3, 2-6, 10-6తో వైష్ణవి-రుతుజా భోస్లే (భారత్) ద్వయంపై గెలిచింది. మహిళల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి, సంజన సిరిమల్ల రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.



మరో గెలుపే లక్ష్యంగా...

'సూపర్ ఓవర్' గెలుపుతో ఉత్సాహంగా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం అదే ఊపులో నేడు జరిగే మూడో టి20లో ఆస్ట్రేలియాను 'ఢీ' కొట్టేందుకు సిద్ధమైంది. మూడో టి20 కూడా ముంబైలోనే జరుగుతున్నప్పటికీ వేదిక డీవై పాటిల్ స్టేడియం నుంచి బ్రబౌర్న్ మైదానానికి మారింది. ఇక్కడ కూడా టీమిండియాకు చీర్స్ చెప్పేందుకు ప్రేక్షకులను ఉచితంగానే అనుమతిస్తారు. అయితే ప్రేక్షకులు తమ పేర్లను ముందుగా బుక్‌మైషో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. రాత్రి 7 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

'క్వాంట్‌బాక్స్'తో చేయి కలిపిన అర్జున్

ఐదేళ్ల కాలానికి భారీ ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: భారత చెస్ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి తన ప్రొఫెషనల్ కెరీర్‌లో తొలిసారి స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ రంగంలో పని చేస్తున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీ 'క్వాంట్‌బాక్స్'తో అర్జున్ చేతులు కలిపాడు. ఐదేళ్ల కాలానికిగాను ఈ స్పాన్సర్‌షిప్ విలువ 15 లక్షల డాలర్లు (సుమారు రూ.12 కోట్ల 41 లక్షలు) కావడం విశేషం. అంటే ఏడాదికి సుమారు రూ. 2 కోట్ల 50 లక్షలుగా ఈ డీల్ ఉంటుంది. భారత చెస్ చరిత్రలో దీనిని అత్యుత్తమ ఒప్పందంగా భావిస్తున్నారు. సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న 'క్వాంట్‌బాక్స్' వ్యవస్థాపకుడు, మాజీ చెస్ ఆటగాడైన ప్రశాంత్ సింగ్ ఈ ఒప్పందం వివరాలను వెల్లడించారు. 2022లో అర్జున్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. ఈ ఏడాది టాటా స్టీల్ చాలెంజర్స్, జాతీయ చాంపియన్‌షిప్, ఢిల్లీ ఓపెన్, అబుదాబి మాస్టర్స్ టైటిల్స్ గెలిచిన అర్జున్ ప్రస్తుతం 2722 ఎలో రేటింగ్‌తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 26వ స్థానంలో ఉన్నాడు.

రాణించిన షోయబ్: ఆంధ్ర 238



సాక్షి, విజయనగరం: మాజీ చాంపియన్ ముంబై జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 74.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ షోయబ్ మొహమ్మద్ ఖాన్ (99 బంతుల్లో 84; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. గిరినాథ్ (45; 5 ఫోర్లు) రాణించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై 13 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 25 పరుగులు సాధించింది.

సెమీస్‌లో తలైవాస్, బెంగళూరు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్ 'టైబ్రేక్'లో 36-36 (6-4)తో యూపీ యోధాస్ జట్టుపై... బెంగళూరు బుల్స్ 56-24తో దబంగ్ ఢిల్లీపై నెగ్గి సెమీస్ చేరాయి. రేపు సెమీఫైనల్స్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో బెంగళూరు బుల్స్; పుణేరి పల్టన్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

'టెస్టు' సమరానికి సమయం

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించేందుకు భారత్‌కు ఆరు టెస్టు మ్యాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కనీసం ఐదు గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా టీమిండియా ముందంజ వేస్తుంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల్లో తలపడటానికి ముందు బలహీన బంగ్లాదేశ్‌పై చెలరేగి సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు ఖాతాలో వేసుకోవడమే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. అయితే సొంతగడ్డపై ఇటీవలే మన జట్టును వన్డే సిరీస్‌లో ఓడించి ఊపు మీదున్న బంగ్లాదేశ్ ఎలాంటి పోటీనిస్తుందనేది ఆసక్తికరం. ఈ నేపథ్యంలో నేటి నుంచి తొలి టెస్టుకు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ తొలి మ్యాచ్
- విజయమే లక్ష్యంగా టీమిండియా
- సొంతగడ్డపై సత్తా చాటేందుకు బంగ్లా సిద్ధం
- ఉదయం గం. 9 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

చిట్టోగ్రామ్: రోహిత్ శర్మ అనూహ్యంగా గాయంతో దూరం... బుమ్రా, షమీ, రవీంద్ర జడేజాలాంటి సీనియర్ బౌలర్లు అందుబాటులో లేరు... ఇటీవల పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తడబడుతున్న కేఎల్ రాహుల్ ఇప్పుడు బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీలో రాణించాల్సిన అవసరం... ఇలాంటి పరిస్థితుల మధ్య భారత జట్టు బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో తలపడనుంది. వన్డే సిరీస్ ఫలితం చూసిన తర్వాత బంగ్లాను తేలిగ్గా తీసుకోరాదనే విషయం స్పష్టమైంది. ప్రధానంగా సీనియర్ ఆటగాళ్లను నమ్ముకున్న బంగ్లా టెస్టుల్లో భారత్‌ను ఇప్పటి వరకు ఓడించకపోయినా... సంచలనానికి సై అంటోంది. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఆట సాగుతున్న కొద్దీ స్పిన్ ప్రభావం చూపిస్తుంది.

ఐదో బౌలర్ ఎవరు...

కెప్టెన్ హోదాలో బరిలోకి దిగుతున్న రాహుల్ ఒక ఓపెనర్‌గా ఆడటం ఖాయం కాగా, అతనికి జోడీగా ఎవరు దిగుతారనేది చూడాలి. శుబ్‌మన్ గిల్‌కు మెరుగైన అవకాశాలే ఉన్నా... ఇటీవల బంగ్లా గడ్డపై 'ఎ' జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 157, 141 పరుగులు చేసిన అభిమన్యు ఈశ్వరన్‌కు కూడా చాన్స్ ఉంది. మూడు, నాలుగు స్థానాల్లో ఎప్పటిలాగే పుజారా, కోహ్లి బరిలోకి దిగుతారు. పుజారా అంతర్జాతీయ క్రికెట్ ఆడి చాలా రోజులైనా రంజీ ట్రోఫీలో బరిలోకి దిగి అతను ఆటతో టచ్‌లోనే ఉన్నాడు. మరోవైపు సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవలే వన్డేల్లో సెంచరీ సాధించిన కోహ్లి, రెండున్నరేళ్ల తర్వాత టెస్టుల్లోనూ సెంచరీ సాధించాలని పట్టుదలగా ఉన్నాడు. టెస్టుల్లో స్థానం సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న శ్రేయస్ అయ్యర్ సత్తా చాటాల్సి ఉండగా, ఆరో స్థానంలో కీపర్ పంత్ బ్యాటింగ్ కూడా కీలకం కానుంది. భారత్ ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతో దిగనుంది. ఉమేశ్, సిరాజ్ రూపంలో ఇద్దరు పేసర్లతో పాటు స్పిన్నర్లుగా అశ్విన్, అక్షర్ పటేల్ ఖాయం. ఐదో బౌలర్‌గా స్పిన్నర్ కుల్దీప్‌ను ఎంచుకుంటారా చూడాలి. దశాబ్దకాలం తర్వాత టీమిండియా పిలుపు లభించిన జైదేవ్ ఉనాద్కట్ వీసా సమస్యలతో ఇంకా ఇక్కడకు చేరకపోవడం అతను తొలి టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు.

సీనియర్లపైనే భారం...

వన్డేలు, టి20ల్లో సొంతగడ్డపై ఘనమైన రికార్డు ఉన్నా... గత కొంత కాలంగా బంగ్లాదేశ్‌కు సొంతగడ్డపై టెస్టులు మాత్రం అచ్చి రాలేదు. 2021 జనవరి నుంచి ఆరు టెస్టులు ఆడిన ఆ జట్టు 5 ఓడిపోయి, ఒకటి 'డ్రా' చేసుకోగలిగింది. అయితే ఇటీవల పరిమిత ఓవర్ల ప్రదర్శన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ప్రత్యర్థిని రెండుసార్లు ఆలౌట్ చేయలేని పరిమిత బౌలింగ్ వనరులు ఉన్నా, బ్యాటింగ్ బలంతో జట్టు కాస్త మెరుగ్గా కనిపిస్తోంది. ముష్ఫికర్, షకీబ్, దాస్‌తో మిడిలార్డర్ పటిష్టంగా ఉండగా, బంగ్లా దేశవాళీలో టాప్ స్కోరర్‌గా నిలిచిన జాకీర్ హసన్ ఓపెనర్‌గా అరంగేట్రం చేయనున్నాడు. ఇబాదత్, ఖాలెద్, షరీఫుల్ పేస్ బౌలింగ్ భారం మోస్తుండగా, ప్రధాన స్పిన్నర్లు షకీబ్, మెహదీ హసన్ మిరాజ్ భారత్‌ను ఎలా కట్టడి చేస్తారో చూడాలి.



కోహ్లి


మెహదీ

11 భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 11 టెస్టులు జరిగాయి. భారత్ 9 టెస్టుల్లో గెలుపొందగా... రెండు 'డ్రా'గా ముగిశాయి.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రాహుల్ (కెప్టెన్), గిల్/ఈశ్వరన్, పుజారా, కోహ్లి, శ్రేయస్, పంత్, అశ్విన్, అక్షర్, ఉమేశ్, సిరాజ్, కుల్దీప్. **బంగ్లాదేశ్:** షకీబ్ (కెప్టెన్), మహ్మదుల్ హసన్, జాకీర్, నజ్ముల్, ముష్ఫికర్, లిటన్ దాస్, నూరుల్, మెహదీ హసన్, షరీఫుల్, ఖాలెద్, ఇబాదత్.

అందరి కళ్లు మొరాకో పైనే...

- నేడు డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌తో రెండో సెమీఫైనల్
- అర్ధరాత్రి గం. 12:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం




ఫ్రాన్స్ స్టార్స్ జిరూడ్, ఎంబాపె

దోహా: అందరి అంచనాలను తారుమారు చేస్తూ... ఊహకందని ప్రదర్శనతో అదరగొడుతున్న ఆఫ్రికా జట్టు మొరాకో మరో సంచలనం సృష్టించాలనే పట్టుదలతో ఉంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో భాగంగా నేడు జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌తో మొరాకో తలపడనుంది. ప్రపంచకప్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య ఇదే తొలి ముఖాముఖి మ్యాచ్ కాగా... వేర్వేరు టోర్నీలలో ఈ రెండు జట్లు 11 సార్లు తలపడ్డాయి. 1963లో ఒక్కసారి ఫ్రాన్స్‌ను ఓడించిన మొరాకో ఆ తర్వాత ఏడు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, మూడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 2007 తర్వాత ఈ రెండు జట్ల మధ్య మరోసారి మ్యాచ్ జరుగుతుండటం విశేషం. ఎంబాపె, జిరూడ్, గ్రీజ్‌మన్, థియో హెర్నాండెజ్, చువమెని, గోల్‌కీపర్ హుగో లోరిస్‌లాంటి స్టార్ ఆటగాళ్లతో ఫ్రాన్స్ పటిష్టంగా ఉంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 22వ స్థానంలో ఉన్న మొరాకో ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా దేశంగా రికార్డు నెలకొల్పింది. కెనడాతో మ్యాచ్‌లో సెల్ఫ్ గోల్ మినహా ఈ మెగా టోర్నీలో ప్రత్యర్థి జట్టుకు ఒక్క గోల్ కూడా సమర్పించుకొని ఏకైక జట్టుగా మొరాకో నిలిచింది. గ్రూప్ దశలో గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియా జట్టును నిలువరించిన మొరాకో ఆ తర్వాత రెండో ర్యాంకర్ బెల్జియంపై... ప్రిక్వార్టర్ ఫైనల్లో 2010 విశ్వవిజేత స్పెయిన్‌పై... క్వార్టర్ ఫైనల్లో 2016 యూరో చాంపియన్ పోర్చుగల్‌ను ఓడించి తమను ఏమాత్రం తక్కువ అంచనా వేయొద్దని ఫ్రాన్స్‌కు హెచ్చరికలు పంపించింది. మొరాకో తరఫున యూసుఫ్ ఎన్ నెసిరి, అష్రఫ్ హకీమి, హకీమ్ జియెచ్, సఫ్యాన్ అమ్రాబత్, గోల్‌కీపర్ యాసిన్ బోనో ప్రదర్శన మరోసారి కీలకం కానుంది. ఈ టోర్నీలో ప్రత్యర్థి ఆటగాళ్లు గోల్‌పోస్ట్ లక్ష్యంగా కొట్టిన 39 షాట్‌లను గోల్‌కీపర్ యాసిన్ బోనో నిలువరించడం విశేషం.

7 ప్రపంచకప్ టోర్నీలో ఫ్రాన్స్ ఏడోసారి సెమీఫైనల్ ఆడుతోంది. మూడుసార్లు (1958, 1982, 1986) సెమీఫైనల్లో ఓడిన ఆ జట్టు మరో మూడు సార్లు (1998, 2006, 2018) గెలిచింది.

87 బెర్త్‌లు... 405 క్రికెటర్లు

- ఈనెల 23న కొచ్చిలో ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: ఫ్రాంచైజీలన్నీ మెరిపించే ఆల్‌రౌండర్లపైనే కన్నేయడంతో స్టార్ ఆల్‌రౌండర్లు బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్), కామెరాన్ గ్రీన్ (ఆస్ట్రేలియా)లపై ఈ ఐపీఎల్ వేలంలో రూ.కోట్లు కురిసే అవకాశముంది. ఈ నెల 23న కొచ్చిలో నిర్వహించే ఐపీఎల్ మినీ వేలంలో మొత్తం 405 మంది ఆటగాళ్ల తుది జాబితాను బీసీసీఐ విడుదల చేసింది. పది ఫ్రాంచైజీల్లో మొత్తం ఖాళీలు 87. ఇందులో 30 స్లాట్లు విదేశీ ఆటగాళ్లతో భర్తీ చేసుకోవాలి. ఈ బెర్త్‌ల కోసం 405 మంది ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. వీరిలో 273 మంది భారత ఆటగాళ్లయితే... 132 మంది విదేశీ క్రికెటర్లు. గరిష్టంగా హైదరాబాద్ ఫ్రాంచైజీ చేతిలో అత్యధికంగా రూ. 42.25 కోట్లు ఉన్నాయి. 13 మందిని భర్తీ చేసుకోవాలి. హైదరాబాద్ నుంచి ఏడుగురు క్రికెటర్లు (మికిల్ జైస్వాల్, అనికేత్ రెడ్డి, తనయ్, రాహుల్ బుద్ధి, సంకేత్, రోహిత్ రాయుడు, భగత్ వర్మ)... ఆంధ్ర నుంచి పది మంది (శ్రీకర్ భరత్, రషీద్, అశ్విన్ హెబర్, రికీ భుయ్, కరణ్ షిండే, నితీశ్, పృథ్వీరాజ్, లలిత్ మోహన్, వంశీకృష్ణ, అయ్యప్ప) వేలంలోకి రానున్నారు.

సినిమా

• ఇయర్ రౌండప్

మేడమ్ ఇన్ మేకింగ్



అమ్మాయిలంటే సిల్వర్ స్క్రీన్‌పై మెరవడానికే.. స్క్రీన్ వెనక టెక్నీషియన్స్‌గానో, సినిమాలకు పెట్టుబడి పెట్టే ప్రొడ్యూసర్‌గానో సూట్ అవ్వరనే అభిప్రాయం చాలామందికి ఉంటుంది. అందుకే ఈ రెండు విభాగాల్లో తక్కువమంది ఉంటారు. అయితే రోజులు మారుతున్నాయి. మహిళా సాంకేతిక నిపుణులు పెరుగుతున్నారు. మరీ ముఖ్యంగా ఈ ఏడాది నిర్మాణ రంగంలో లేడీ ప్రొడ్యూసర్ల సంఖ్య పెరిగింది. అరడజను మందికి పైగా ఈ ఏడాది నిర్మాతలుగా పరిచయం కావడం ఇందుకు ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక ఈ ఏడాది ఫిలిం మేకింగ్ (నిర్మాణం)లోకి వచ్చిన మేడమ్స్ గురించి తెలుసుకుందాం.

దివంగత ప్రముఖ నటులు, నిర్మాత కృష్ణంరాజు పెద్ద కుమార్తె సాయి ప్రసీద 'రాధేశ్యామ్' సినిమాతో ఈ ఏడాది నిర్మాతగా పరిచయం అయ్యారు. ప్రభాస్, పూజా హెగ్డే జంటగా కె. రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ లవ్ స్టోరీ 'రాధేశ్యామ్'. వంశీ, ప్రమోద్ (యూవీ క్రియేషన్స్)లతో కలిసి ప్రసీద (గోపీకృష్ణా మూవీస్) ఈ సినిమా నిర్మించారు. నిర్మాణరంగంలోకి అడుగు పెట్టక ముందు విదేశాల్లో ప్రసీద ప్రొడక్షన్ కోర్స్ చేశారు. మరోవైపు దివంగత ప్రముఖ దర్శకుడు కోడి రామకృష్ణ కుమార్తె కోడి దివ్య దీప్తి కూడా నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. కోడి దివ్య ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై దివ్య దీప్తి నిర్మించిన తొలి చిత్రం 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం, సంజన జంటగా నటించారు. తండ్రి దర్శకత్వం వహించిన చిత్రాల షూటింగ్‌లకు దివ్య వెళ్లేవారు. అలా ఫిలిం మేకింగ్‌పై అవగాహన పెంచుకున్నారు. అలాగే ప్రముఖ నిర్మాత గుణశేఖర్ కుమార్తె నీలిమ గుణ నిర్మాతగా మారారు. సమంత టైటిల్ రోల్ చేసిన 'శాకుంతలం' సినిమాకు నీలిమ ఓ నిర్మాత. ఈ ఏడాది నవంబరులో విడుదల కావాల్సిన ఈ పీరియాడికల్ ఫిల్మ్ వీఎఫ్‌ఎక్స్ వర్క్ కారణంగా వచ్చే ఏడాదికి వాయిదా పడింది. ఇక నిర్మాణరంగంలో ప్రముఖ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు పూర్ణోదయ మూవీ క్రియేషన్స్‌ది ప్రత్యేక స్థానం. ఈ నిర్మాణ సంస్థలో వచ్చిన చిత్రాలకు (సిరి సిరి మువ్వ, శంకరాభరణం, సాగర సంగమం, స్వాతి ముత్యం..) పదికిపైగా జాతీయ అవార్డులు వచ్చాయి. ఏడిద నాగేశ్వరరావు వారసురాలిగా ఆయన మనవరాలు ఏడిద శ్రీజ 'ఫస్ట్ డే ఫస్ట్ షో' చిత్రం ద్వారా నిర్మాతగా తొలి అడుగు వేశారు. శ్రీజ ఎంటర్‌టైన్మెంట్స్‌పై రూపొందిన ఈ చిత్రంలో శ్రీకాంత్ రెడ్డి, సంచిత బసు జంటగా నటించారు. కాగా ప్రస్తుతం తెలుగులో ఉన్న అగ్ర నిర్మాతల్లో 'దిల్' రాజు ఒకరు. ఆయన కుమార్తె హన్షిత రెడ్డి నిర్మాణ రంగంపై దృష్టి సారిస్తున్నారు. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో 'దిల్' రాజు డిజిటల్ కంటెంట్‌ను నిర్మిస్తున్నారు. ఈ బ్యానర్‌లో 'ఏటీఎమ్' అనే వెబ్ సిరీస్ కూడా ఆరంభమైంది. ఈ సిరీస్‌కు దర్శకుడు హరీష్ శంకర్ కథ ఇచ్చారు. బిగ్‌బాస్ ఫేమ్ వీజే సన్నీ, సుబ్బరాజు ప్రధాన పాత్రధారులుగా రూపుదిద్దుకుంటున్న ఈ సిరీస్‌కి హన్షిత రెడ్డి ఓ నిర్మాతగా ఉన్నారు.

యాక్షన్ టు ప్రొడక్షన్

హీరోయిన్లు కూడా నిర్మాతలుగా మారుతుంటారు. హీరోయిన్ మేఘా ఆకాష్ తల్లి బిందు ఆకాష్ నిర్మాతగా మారారు. రాహుల్ విజయ్, మేఘా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'మాటే మంత్రము' చిత్రానికి బిందు ఆకాష్ ఓ నిర్మాతగా ఉన్నారు. పేరు తల్లిది అయినప్పటికీ కూతురు మేఘా ఆకాష్ సపోర్ట్‌తోనే బిందు నిర్మాత అయ్యుంటారని ఊహించవచ్చు. ఇక మలయాళ బ్యూటీ ఐశ్వర్యా లక్ష్మి 'గార్గి' చిత్రం ద్వారా నిర్మాతగా పరిచయం అయ్యారు. గౌతమ్ రామచంద్రన్ దర్శకత్వంలో సాయి పల్లవి ప్రధాన పాత్రలో ఈ చిత్రం రూపొందింది. అలాగే టాప్ హీరోయిన్ కీర్తి సురేష్ త్వరలో ఓ ప్రొడక్షన్ హౌస్ ఆరంభించనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

హిందీలోనూ..

బాలీవుడ్‌లోనూ ఈ ఏడాది లేడీ నిర్మాతల జాబితాలో కొందరు హీరోయిన్ల పేర్లు చేరాయి. హన్సల్ మెహతా తెరకెక్కించనున్న ఓ థ్రిల్లర్ సబ్జెక్ట్‌లో నటించి, నిర్మించనున్నారు కరీనా కపూర్. ఏక్తా కపూర్‌తో కలిసి ఆమె ఈ సినిమా నిర్మించనున్నారు. ఇక షారుక్ ఖాన్ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్స్‌తో కలిసి ఆలియా భట్ 'డార్లింగ్స్' అనే సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో ఆలియా నటించారు కూడా. హీరోయిన్ కృతీ కుల్హారి కూడా 'నాయిక' అనే సినిమాలో నటిస్తూ, నిర్మిస్తున్నారు. ఇలా నిర్మాణ రంగంలోనూ స్త్రీ శక్తి ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం.



ఆర్డర్ కాదురా.. ఆఫర్


విశాల్

''మీలాంటి వాళ్లని చేతికి లాఠీ ఇచ్చి కొట్టమంటే.. అది మాకు పై అధికారులు ఇచ్చే ఆర్డర్ కాదురా.. ఆఫర్'' అని విశాల్ చెప్పే డైలాగ్‌తో 'లాఠీ' చిత్రం ట్రైలర్ సాగుతుంది. విశాల్ హీరోగా ఎ. వినోద్ కుమార్ దర్శకత్వంలో రమణ, నంద నిర్మించిన చిత్రం 'లాఠీ'. ''ఈ చిత్రంలో విశాల్ సిన్సియర్ పోలీసాఫీసర్‌గా నటించారు. ఆయన భార్య పాత్రను సునైనా చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'లాఠీ'ని రూపొందించాం. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ఈ నెల 22న రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

శాసనసభ ప్రశ్నించేలా ఉంటుంది

- ఇంద్రసేన



''ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టేలా మా 'శాసనసభ' ఉంటుంది. డబ్బులిచ్చి ఓట్లు ఎందుకు కొనుక్కోవాలి? అని రాజకీయ నేతలను, నోటుకు ఓటును ఎందుకు అమ్ముకోవాలి? అని ఓటర్లను ఓ సామాన్యుడు ప్రశ్నించేలా ఉంటుంది'' అని హీరో ఇంద్రసేన అన్నారు. వేణు మడికంటి దర్శకత్వంలో ఇంద్రసేన, ఐశ్వర్యా రాజ్ జంటగా నటించిన చిత్రం 'శాసనసభ'. రాజేంద్రప్రసాద్, సోనియా అగర్వాల్, పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటించారు. తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మించిన ఈ సినిమా తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇంద్రసేన మాట్లాడుతూ– ''ఓ నటుడికి కనీస గుర్తింపు ఉండే పాత్రలు దక్కకపోతే ఇండస్ట్రీలో విలువ ఇవ్వరు. దర్శకుడు సురేందర్ రెడ్డిగారు 'కిక్ 2, ధృవ, సైరా' చిత్రాల్లో మంచి పాత్రలిచ్చి, నన్ను ప్రోత్సహించారు. ఆ తర్వాత నాకు గుర్తింపు తెచ్చే పాత్రలు దక్కకపోవడంతో కొద్ది రోజులు విరామం తీసుకున్నాను. హీరోగానే నటించాలని నిర్ణయించుకున్నా. ఆ టైమ్‌లో నా స్నేహితుడు రాఘవేందర్ రెడ్డి రాసిన 'శాసనసభ' స్క్రిప్ట్ నా వద్దకు వచ్చింది. ఈ కథ నా మిత్రుడు షణ్ముగంకి కూడా బాగా నచ్చడంతో నిర్మించాడు. నేను కొత్త హీరో అయినా ఎక్కువ బడ్జెట్ పెట్టాడు. ఈ సినిమా ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకంగా ఉండదు.. సాధారణ రాజకీయ పరిస్థితుల్లో ప్రజలు ఎలా చైతన్యవంతం కావాలో చూపిస్తున్నాం. 'కేజీఎఫ్', 'సలార్' వంటి పెద్ద చిత్రాలు చేసిన రవి బస్రూర్‌గారు మాది చిన్న చిత్రమైనా కథ నచ్చడంతో ఒప్పుకున్నారు. అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారాయన. అన్ని వాణిజ్య అంశాలున్న మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది. హీరోగానూ నాకు మంచి పేరొస్తుంది. మంచి పాత్ర వస్తే క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా నటించడానికైనా సిద్ధమే'' అన్నారు.

అవతార్‌కి అవసరాల మాటలు


శ్రీనివాస్ అవసరాల

ప్రపంచ సినీ ప్రేక్షకులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం 'అవతార్ 2: ది వే ఆఫ్ వాటర్'. జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగులోనూ అదే తేదీన థియేటర్స్‌కి రానుంది. ఈ సినిమా తెలుగు వెర్షన్‌కి రచయిత-దర్శకుడు, నటుడు శ్రీనివాస్ అవసరాల డైలాగ్స్ రాశారు. జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో వచ్చిన 'అవతార్' (2009)కి సీక్వెల్‌గా 'అవతార్ 2: ది వే ఆఫ్ వాటర్' రూపొందింది.

నాలుగు జంటల ప్రేమకథ


నరసింహ నంది

'1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, జాతీయ రహదారి' వంటి చిత్రాలతో అవార్డులు అందుకున్న దర్శకుడు నరసింహ నంది తెరకెక్కించిన తాజా చిత్రం 'అమ్మాయిలు అర్థంకారు'. అల్లం శ్రీకాంత్, ప్రశాంత్, కమల్, మీరావలి హీరోలుగా, సాయిదివ్య, ప్రియాంక, స్వాతి, శ్రావణి హీరోయిన్లుగా నటించారు. శ్రీ లక్ష్మి నరసింహ సినిమా పతాకంపై నందిరెడ్డి విజయలక్ష్మి రెడ్డి, కర్ర వెంకట సుబ్బయ్య నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా ట్రైలర్‌ని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ బసిరెడ్డి, తెలుగు నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, నిర్మాత మేడికొండ వెంకట మురళీకృష్ణ రిలీజ్ చేశారు. ''నరసింహ తన అభిరుచికి తగ్గ సినిమాలు చేశారు. అదే కమర్షియల్ సినిమాలు తీసి ఉంటే ఇప్పటికే పెద్ద దర్శకుల జాబితాలో చేరేవారు'' అన్నారు తమ్మారెడ్డి. ''మధ్య తరగతి జీవితాల్లో జరిగే నాలుగు ప్రేమ జంటల కథలతో ఈ చిత్రం తెరకెక్కించాను'' అన్నారు నరసింహ నంది. ''చిత్తూరు, తిరుపతి ప్రాంతాల యాసను నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని నిర్మించాం'' అన్నారు కర్ర వెంకట సుబ్బయ్య.

ఉరఫ్ కారం చాయ్


శాన్వి మేఘన

కౌశిక్ బాబు, శాన్వి మేఘన జంటగా శ్రీమాన్ గువ్వడవెల్లి దర్శకత్వంలో రచయిత డా. సదానంద్ శారద నిర్మించిన చిత్రం 'నేనే సరోజ'!. 'ఉరఫ్ కారం చాయ్' అనేది ఉపశీర్షిక. సుమన్, చంద్రమోహన్, ఆనంద్, చక్రపాణి కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాను త్వరలో విడుదల చేయాలనుకుంటున్నారు. సదానంద్ శారద మాట్లాడుతూ – ''ఆడపిల్లల పట్ల సమాజంలో కనిపిస్తున్న వివక్షతను ఎదిరిస్తూ ఎదిగిన ఈ తరం ఆడపిల్ల కథే ఈ చిత్రం. ఈ సినిమాలో 'కారం చాయ్' అనేది ఈ తరం అమ్మాయిలకు ఓ అస్త్రం కానుంది'' అన్నారు. ''ఫిబ్రవరిలో విడుదల ప్లాన్ చేశాం'' అన్నారు శ్రీమాన్.

సాక్షి **బిజినెస్**
బుధవారం
14-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 403	నిఫ్టీ ▲ 111
62,533	18,608

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,170	▲	26
డోజోన్స్	33,924	▼	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,503	▲	57
డాక్స్	14,498	▲	191
షాంఘై	3,176	▼	3
నికాయ్	27,955	▲	113

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
54,030	▲	122
బంగారం (99.5 స్వచ్ఛత)		
53,814	▲	121
వెండి (కిలో)		
67,161	▲	139

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.90	83.57
€	యూరో	ఒకటి	85.70	88.73
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.82	103.15
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.16	61.06
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.70	57.05
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.10	62.06
SAR	సౌదీ రియాల్	[illegible]	21.09	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.44
¥	చైనా యువాన్	[illegible]	10.74	12.76

ఐపీవోకు ఐదేళ్లలో 80 స్టార్టప్‌లు!

- దూకుడు చూపుతున్న 100 కంపెనీలు
- ఇప్పటికే లిస్టింగ్ పొందిన 20 సంస్థలు
- భారీ విస్తరణ, లాభార్జనకు అవకాశం

న్యూఢిల్లీ: రానున్న ఐదేళ్లలో దేశీయంగా 80 స్టార్టప్‌లు పబ్లిక్ ఇష్యూలను చేపట్టే అవకాశమున్నట్లు మార్కెట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ సంస్థ రెడ్‌సీర్ తాజాగా అంచనా వేసింది. ఈ కాలంలో 100కు మించిన సంస్థలు మరింత బలపడనున్నట్లు, భారీ స్థాయిలో లాభాలు ఆర్జించేందుకు వీలున్నట్లు అభిప్రాయపడింది. ఐపీవోలపై రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ రూపొందించిన నివేదికలో ఇప్పటికే కార్యకలాపాలను విస్తరించిన 20 స్టార్టప్‌లు ఎక్స్చేంజీల్లో లిస్టయినట్లు వెల్లడించింది. దేశీయంగా మరో 100కు పైగా స్టార్టప్‌లు మరింత ఎదిగే వీలుందని, భారీ లాభార్జన స్థాయికి చేరవచ్చని పేర్కొంది. ఈ జాబితాలో ఇప్పటికే 20 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను పూర్తి చేసుకున్నట్లు ప్రస్తావించింది. వెరసి మరో 80 కంపెనీలు ఐదేళ్లలో ఐపీవోల ద్వారా నిధుల సమీకరణకు ముందుకురానున్నట్లు అంచనా వేసింది.

టెక్ కంపెనీలు వీక్: ప్రపంచ ఆర్థిక పరిస్థితుల కారణంగానే వినియోగ కంపెనీలతో పోలిస్తే టెక్నాలజీ సంస్థల ఐపీవోలు పతన బాటలో సాగుతున్నట్లు హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో రూపొందిన రెడ్‌సీర్ నివేదిక పేర్కొంది. అయితే టెక్నాలజీ కంపెనీలు ప్రస్తుతం వృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపింది. వచ్చే రెండేళ్లలో సానుకూల నగదు ఆర్జనను సాధించగల కీలక కంపెనీలు ప్రస్తుతం 20–30% డిస్కౌంట్‌లో ఉన్నట్లు పేర్కొంది. ఇందుకు చౌక వడ్డీ రేట్లు కారణంకాగా.. ఇకపై మరింత ఊపందుకోనున్న వడ్డీ రేట్ల పరిస్థితులలో విలువ వేగంగా బలపడనున్నట్లు అభిప్రాయపడింది. ఇతర దేశాలతో పోలిస్తే దేశీయంగా లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ వృద్ధి చూపనున్నట్లు అంచనా వేసింది.

కారణాలున్నాయ్

యూఎస్ స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 43 లక్షల కోట్ల డాలర్లలో టెక్నాలజీ లేదా న్యూఏజ్ కంపెనీల వాటా 25 శాతంగా నివేదిక పేర్కొంది. వీటిలో యాపిల్ ఇంక్, అమెజాన్ తదితర దిగ్గజాలున్నట్లు తెలియజేసింది. ఇక ఇండియాలో 3.9 లక్షల కోట్ల డాలర్ల స్టాక్ మార్కెట్ విలువలో టెక్ లేదా న్యూఏజ్ కంపెనీల వాటా 1 శాతమేనని వివరించింది. గత రెండు దశాబ్దాలలోనూ ఇదేతరహా పరిస్థితులను పరిశీలిస్తే.. వడ్డీ రేట్లు నీరసించినప్పటికీ మార్కెట్లు నిలకలకడను సాధించేందుకు కొంత సమయం పట్టినట్లు రెడ్‌సీర్ సంస్థ పార్ట్‌నర్ రోహన్ అగర్వాల్ తెలియజేశారు. మార్కెట్లు రికవరీ సాధించేందుకు మరింత సమయం పట్టవచ్చని అంచనా వేశారు. డౌన్‌టర్న్‌ల తదుపరి ఐపీవోలు జోరు చూపడం చూస్తున్నదేనని ప్రస్తావించారు. కాగా.. ఐపీవో బాటలో విజయవంతమయ్యేందుకు మార్కెట్ లీడర్‌షిప్, విస్తరించవలసిన మార్కెట్లు, నమ్మకమైన ఆదాయ అంచనాలు, లాభదాయకతకు స్పష్టమైన ప్రణాళికలు వంటి పలు కీలక అంశాలపై స్టార్టప్‌లు దృష్టిసారించవలసి ఉన్నట్లు వివరించారు.



మహీంద్రా లాజిస్టిక్స్ వేర్‌హౌస్ షురూ

నెట్ జీరో మల్టీ క్లయింట్ వేర్‌హౌస్ ఏర్పాటు

హైదరాబాద్: దేశీయంగా సమీకృత లాజిస్టిక్స్ సర్వీసులందించే మహీంద్రా లాజిస్టిక్స్ లిమిటెడ్(ఎంఎల్ఎల్) స్థానికంగా నెట్ జీరో సౌకర్యానికి తెరతీసింది. బహుళ ఖాతాదారుల సామర్థ్యాలు, పునరుత్పాదక ఇంధనం, వనరుల పరిరక్షణసహా పర్యావరణ అనుకూల(గ్రీన్ కవర్) వేర్‌హౌసింగ్ ఆర్కిటెక్చర్‌తో దీనిని ఏర్పాటు చేసింది. ఈ అత్యాధునిక వేర్‌హౌస్ సిద్దిపేట జిల్లా ములుగు మండలం, బండమైలారం గ్రామంలోని అరుణ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద నెలకొంది. కంపెనీకిగల దేశవ్యాప్త మల్టీ యూజర్ సోలార్ విద్యుత్ సౌకర్యాలలో భాగమైన ఈ కేంద్రం కస్టమర్ల తయారీ, ఫుల్‌ఫిల్‌మెంట్ ఇన్‌బౌండ్ కార్యక్రమాలకు వీలు కల్పించనుంది. ఈ–కామర్స్ కస్టమర్లకు మద్దతివ్వనుంది. ఈ నూతన కేంద్రం 100% సౌర, బ్యాటరీ స్టోర్డ్ శక్తితో పనిచేస్తుంది. అధికంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందజేస్తుంది. ఎలక్ట్రిక్ కార్గో వాహనాలకు చార్జింగ్ సౌకర్యాలనూ కల్పించనుంది. ఎంఎల్ఎల్ 350 మందికి పైగా ఇక్కడ ఉపాధి అవకాశాలను కల్పించింది. అధిక డిమాండ్ సమయంలో థర్డ్ పార్టీ అసోసియేట్లు ఈ సంఖ్యకు మూడింతలు అధికంగా ఉపాధి కల్పించే అవకాశమున్నట్లు కంపెనీ పేర్కొంది.



8 నెలల్లో లక్ష ట్రాక్టర్ల విక్రయాలు

సోనాలిక ట్రాక్టర్స్ ఘనత



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో మొత్తం లక్ష ట్రాక్టర్లను అమ్మినట్లు సోనాలిక ట్రాక్టర్స్ ప్రకటించింది. అంతక్రితం ఇదే కాలంలో జరిగిన విక్రయాలతో పోలిస్తే 11.2% వృద్ధిని సాధించినట్లు తెలిపింది. కాగా., ఇదే కాలంలో పరిశ్రమ కేవలం 8.8 శాతం పెరుగుదలను నమోదు చేసింది. 2017–18 నుంచి ప్రతీ ఏడాది ఒక లక్ష పైగా ట్రాక్టర్లను విక్రయిస్తున్నట్లు పేర్కొంది. కంపెనీ అత్యంత వేగంగా లక్ష ట్రాక్టర్ల అమ్మకాలను 8 నెలల్లోనే నమోదు చేయడం పట్ల కంపెనీ జాయింట్ ఎండీ రమణ్ మిట్టల్ హర్షం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-12-2022	
విశాఖ	547–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	534–00
విజయవాడ	534–00
రిటైల్ ధర (డజను)	78.00
13-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	522–00
వరంగల్	524–00
రిటైల్ ధర	5.80

రెండురోజుల తర్వాత లాభాలు

- మెప్పించిన ద్రవ్యోల్బణం డేటా
- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్ల దన్ను
- సెన్సెక్స్ 403 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 111 పాయింట్లు



ముంబై: రిటైల్ ద్రవ్యోల్బణం దిగిరావడంతో దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం లాభాలను ఆర్జించాయి. ప్రపంచ మార్కెట్ల నుంచీ సానుకూల సంకేతాలు అందాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో, ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 403 పాయింట్లు పెరిగి 62,533 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 111 పాయింట్లు బలపడి 18,608 వద్ద నిలిచింది. ఫ్లాట్‌గా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా పటిష్టమైన లాభాలతో దూసుకెళ్లాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 437 పాయింట్లు బలపడి 62,568 వద్ద, నిఫ్టీ 120 పాయింట్లు ర్యాలీ చేసి 18,617 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఇంధన, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ పావుశాతం, స్మాల్ సూచీ అరశాతం చొప్పున లాభపడ్డాయి. ఆరురోజుల వరుస అమ్మకాల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు తొలిసారి రూ.620 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు సైతం స్వల్పంగా రూ.37 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేశారు. ఆరంభ నష్టాల నుంచి రూపాయి రికవరీ అయ్యింది. ఇంట్రాడేలో 39 పైసలు పతనమైనప్పటికీ.. ఆఖరికి 9 పైసల స్వల్ప నష్టంతో 82.60 వద్ద ముగిసింది. ఫెడ్ రిజర్వ్ పాలసీ కమిటీ సమావేశం ప్రారంభానికి(మంగళవారం) ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

'ఈ నవంబర్‌లో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత లక్ష్యం(2–6%) కంటే దిగువ(5.88%)న 11 నెలల కనిష్ట స్థాయిలో నమోదైంది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) అక్టోబరులో మైనస్ 4 శాతానికి(26 నెలల కనిష్టం) పతనమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్‌బీఐ ఇకపై కీలక వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే ఆశలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. ఆర్థిక అగ్రరాజ్యం అమెరికా ద్రవ్యోల్బణం డేటా, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయాలు రానున్న రోజుల్లో ఈక్విటీ మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయి' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- తన అనుబంధ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌లో కొంత వాటాను పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించేందుకు బోర్డు అనుమతి తెలిపడంతో టాటా మోటార్స్ షేరు ఒకశాతం లాభపడి రూ.419 వద్ద స్థిరపడింది.
- ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్ల ర్యాలీ కొనసాగుతోంది. యూకోబ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఐఓబీ షేర్లు 20%–15శాతం ర్యాలీ చేశాయి. మహారాష్ట్ర బ్యాంక్, పీఎస్‌బీ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ షేర్లు పదిశాతం రాణించాయి. యూనియన్ బ్యాంక్, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ బరోడా, ఎస్‌బీఐ షేర్లు 7–4% లాభపడ్డాయి.
- మార్కెట్లో ఒడుదుడుకులను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ మూడుశాతానికి పైగా తగ్గి 12.88 స్థాయికి దిగివచ్చింది. ఈ ఇండెక్స్ 15శాతానికి ఉంటే రాబోయే రోజుల్లో మార్కెట్లో భారీ ఊగిసలాట ఉండొచ్చని అర్థం.

ఏపీ, తెలంగాణలో వీ ఫౌండర్ సర్కిల్ పెట్టుబడులు



న్యూఢిల్లీ: స్టార్టప్ కంపెనీ అయిన 'వీ ఫౌండర్ సర్కిల్' (డబ్ల్యూఎఫ్‌సీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో గణనీయమైన స్టార్టప్ పెట్టుబడుల ప్రణాళికలతో ఉన్నట్టు ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో 50కు పైగా స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపింది. 2023లో కనీసం ఎనిమిది స్టార్టప్‌లకు నిధులు సమకూర్చనున్నట్టు పేర్కొంది. సగటున ఒక్కో పెట్టుబడి రూ.82 లక్షల నుంచి రూ1.23 కోట్ల మధ్య ఉంటుందని 'టై గ్లోబల్ సదస్సు'లో భాగంగా డబ్ల్యూఎఫ్‌సీ ప్రకటించింది. ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన ఐదు స్టార్టప్‌లలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టినట్టు పేర్కొంది. ద్వితీయ, తృతీయ తరగతి పట్టణాలకు చెందిన ఇన్వెస్టర్ల కోసం మంచి ప్రణాళికలతో ముందుకు వస్తామని సంస్థ సహ వ్యవస్థాపకుడు గౌరవ్ వీకే సింఘ్వి తెలిపారు.

పేటీఎమ్ బైబ్యాక్ @ రూ. 810

రూ. 850 కోట్ల కేటాయింపు



న్యూఢిల్లీ: డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కు రూ. 850 కోట్లవరకూ వెచ్చించనుంది. షేరుకి రూ. 810 ధర మించకుండా ఓపెన్ మార్కెట్ ద్వారా సొంత ఈక్విటీని కొనుగోలు చేయనున్నట్లు 'పేటీఎమ్' బ్రాండ్ కంపెనీ తాజాగా వెల్లడించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఆరు నెలల్లోపు బైబ్యాక్‌ను పూర్తిచేయగలమని భావిస్తున్నట్లు తెలియజేసింది. మంగళవారం(13న) సమావేశమైన బోర్డు బైబ్యాక్ ప్రతిపాదనను అనుమతించినట్లు పేర్కొంది. స్వతంత్ర డైరెక్టర్లతోపాటు బోర్డు మొత్తం ఏకగ్రీవంగా ఈ ప్రతిపాదనకు అనుకూలంగా ఓటేసినట్లు వెల్లడించింది. బైబ్యాక్ వార్తల నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు 2 శాతం బలపడి రూ. 538 వద్ద ముగిసింది. బైబ్యాక్ ధర దీనికి 50% అధికం.

టాటా మోటార్స్ వాహన ధరలు ప్రియం

న్యూఢిల్లీ: అన్ని రకాల వాణిజ్య వాహనాల ధరలను జనవరి నుంచి 2 శాతం పెంచనున్నట్టు టాటా మోటార్స్ ప్రకటించింది. మోడల్‌ను బట్టి ధరల పెంపు వేర్వేరుగా ఉంటుందని పేర్కొంది. పెరిగిన తయారీ ధరల భారాన్ని సర్దుబాటు చేసుకునేందుకే ధరలను పెంచాల్సి వస్తున్నట్టు వివరణ ఇచ్చింది. పెరిగిన వ్యయాల్లో ఎక్కువ మొత్తాన్ని తామే సర్దుబాటు చేసుకున్నట్టు, కొంత మేర కస్టమర్లకు బదిలీ చేయాల్సి వస్తున్నట్టు పేర్కొంది. జనవరి నుంచి రేట్లను పెంచనున్నట్టు టాటా మోటార్స్ లోగడే ప్రకటించగా, తాజాగా ఎంత మేర పెంచేదీ ప్రకటించింది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

డైలీ కరెంట్ అఫైర్స్ — అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్ — మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

టీఎస్‌పీఎస్సీలో 1392 జూనియర్ లెక్చరర్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1392
- » **అర్హత:** సంబంధిత సబ్జెక్టు/భాషలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు సడలింపు లభిస్తుంది.
- » **వేతనం:** నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 16.12.2022
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 06.01.2023.
- » **పరీక్ష తేది(ఆబ్జెక్టివ్ టైప్):** జూన్/జూలై 2023.
- » **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఇస్రోలో 68 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలోని ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఐసీఆర్‌బీ) సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
- » **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్.
- » **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. గేట్ పరీక్షలో అర్హత సాధించాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.12.2022
- » **వెబ్‌సైట్:** www.isro.gov.in

తూర్పు గోదావరి జిల్లాలో 23 ఆశా వర్కర్ పోస్టులు

రాజమహేంద్రవరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం.. తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
- » **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.10,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, రాజమహేంద్రవరం చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.12.2022
- » **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

డీఎంహెచ్‌వో, నంద్యాల జిల్లాలో 13 ఆశావర్కర్ పోస్టులు

నంద్యాల జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం.. పట్టణ ప్రాంతాల్లో ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
- » **అర్హత:** పదో తరగతి/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.10,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, నంద్యాల చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.12.2022
- » **వెబ్‌సైట్:** nandyal.ap.gov.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, న్యూఢిల్లీలో 596 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 596
- » **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్-సివిల్)–62, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇంజనీరింగ్-ఎలక్ట్రికల్)–84, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రానిక్స్) –440, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్)–10.
- » **అర్హత:** 60% మార్కులతో బీఈ, బీటెక్ (సివిల్ /ఎలక్ట్రికల్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్స్ /ఆర్కిటెక్చర్)ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 21.01.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** గేట్ 2020/గేట్ 2021/గేట్ 2022 స్కోరు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.12.2022
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.01.2023.
- » **వెబ్‌సైట్:** www.aai.aero

క్యాట్ తర్వాత.. ఏం చేద్దాం!

- » నవంబర్ 27న ముగిసిన క్యాట్-2022
- » జాతీయ స్థాయిలో 2.2 లక్షలకు పైగా హాజరు
- » 50 శాతం మార్కులతో 99 పర్సంటైల్ అంచనా
- » మలి దశకు సన్నద్ధం కావాలంటున్న నిపుణులు
- » 20 ఐఐఎంలలో 12 వేలకు పైగా సీట్లు



కామన్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్యాట్! దేశంలోని ప్రతిష్టాత్మక బీస్కూల్స్.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌ల్లో ఎంబీఏ, పీజీపీఎం, ఫెలో ప్రోగ్రామ్ తదితర మేనేజ్‌మెంట్ కోర్సుల్లో.. 2023-24లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష! జాతీయ స్థాయిలో రెండు లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు! వీరంతా క్యాట్ తర్వాత ఏం చేయాలి.. క్యాట్ కటాఫ్ ఎంతుంటుంది.. ఐఐఎంల మలిదశ ఎంపిక ప్రక్రియకు సన్నద్ధమవడం ఎలా.. అనే సందిగ్ధంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో.. క్యాట్-2022 విశ్లేషణతోపాటు, మలి దశలో ఐఐఎంలు నిర్వహించే ఎంపిక ప్రక్రియ వివరాలు, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, క్యాట్-2023 కటాఫ్ అంచనా తదితర అంశాలపై విశ్లేషణ..

గ్రాడ్యుయేషన్ కోర్సుల విద్యార్థులు ఎక్కువ మంది మేనేజ్‌మెంట్ కోర్సులు,ముఖ్యంగా ఐఐఎంల్లో చేరడమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు. దీంతో క్యాట్‌కు ప్రతి ఏటా రెండు లక్షలకు పైగా అభ్యర్థులు హాజరవుతున్నారు. అయితే ఐఐఎంల్లో క్యాట్ స్కోర్‌తోనే అడ్మిషన్ లభించదు. క్యాట్‌తోపాటు మలి దశలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, రిటన్ ఎబిలిటీ టెస్టుల్లోనూ రాణించాల్సి ఉంటుంది.

మోస్తరు క్లిష్టత

- ఈ ఏడాది నవంబర్ 27న మూడు స్లాట్లలో క్యాట్ పరీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం పరీక్ష ఓ మోస్తరు క్లిష్టతతో ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మూడు సెక్షన్లలో క్యాట్ నిర్వహించగా.. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలు అడిగారు. వీటికి 198 మార్కులు కేటాయించారు.
- స్లాట్-1లో.. ఏఆర్‌సీ విభాగం ప్రశ్నలు కొంత సులభంగా, లాజికల్ రీజనింగ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.
- స్లాట్-1 కంటే స్లాట్-2 కొంత క్లిష్టంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వీఏఆర్‌సీ విభాగంలో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయంటున్నారు. డీఐఎల్ఆర్ విభాగం ప్రశ్నలు సులభంగా ఉన్నప్పటికీ..కాలిక్యులేషన్స్ చేయాల్సిన విధంగా ప్రశ్నలు అడగడంతో సమయాభావం ఎదురైందని అభ్యర్థులు పేర్కొంటున్నారు.క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో.. ఓ మోస్తరు క్లిష్టతతో అభ్యర్థులను తికమక పెట్టే విధంగా ప్రశ్నలు ఉన్నాయి.
- తొలి రెండు స్లాట్లతో పోల్చితే మూడో స్లాట్ సులభంగా ఉందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా వీఏఆర్‌సీ, డీఐఎల్ఆర్ విభాగాల నుంచి అడిగిన ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. దీంతో ఈ స్లాట్‌లో పరీక్షకు హాజరైన వారు అధిక శాతం ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం లభించింది. అయితే క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగం మాత్రం క్లిష్టంగా ఉందంటున్నారు.

50 శాతం మార్కులతో 99 పర్సంటైల్

మొత్తం 198 మార్కులకు జరిగిన పరీక్షలో 50 శాతం మార్కులు సాధించిన వారు 99 పర్సంటైల్ సాధించే అవకాశం కనిపిస్తోంది. అదే విధంగా 73–77 మార్కులు సాధించిన వారు 97కు పైగా పర్సంటైల్, 63–67 మార్కులతో 95 శాతం పర్సంటైల్ పొందే అవకాశాలున్నాయి. ఈ స్థాయిలో మార్కులు సాధిస్తామనే అంచనాకు వచ్చిన అభ్యర్థులు ఐఐఎంలు నిర్వహించే మలి దశ ఎంపిక ప్రక్రియకు సిద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

మలి దశ ఎంపిక ఎలా

ఐఐఎంలు క్యాట్ స్కోర్‌తోపాటు ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. క్యాట్ స్కోర్ కేవలం ఆయా ఐఐఎంలలో తమకు ఆసక్తి ఉన్న ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి ఉపయోగపడే సాధనంగానే నిలుస్తోంది. ఇలా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఐఐఎంలు మలి దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్, రిటన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలలోనూ ప్రతిభ చూపితేనే ప్రవేశాలు ఖరారు అవుతాయి.

కటాఫ్ పర్సంటైల్

అన్ని ఐఐఎంలు మలిదశలో వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తూ.. ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. క్యాట్‌లో నిర్దిష్ట కటాఫ్ పర్సంటైల్ ఉన్న వారికే దరఖాస్తుకు అవకాశం కల్పిస్తాయి. తుది జాబితా రూపకల్పన, గత రెండు, మూడేళ్లుగా ప్రవేశాలు ఖరారైన విద్యార్థుల పర్సంటైల్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. 93శాతంపైగా పర్సంటైల్ ఉంటేనే ప్రవేశం లభిస్తోంది. ఐఐఎం–కోల్‌కత,ఐఐఎం–అహ్మదాబాద్ వంటి తొలితరం ఐఐఎంలలో ప్రవేశం పొందాలంటే..99కి పైగా పర్సంటైల్ ఉంటేనే సాధ్యమని గత ప్రవేశాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ మూడు ముఖ్యమే

క్యాట్ స్కోర్ ఆధారంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. తదుపరి దశలో రిటన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూలోనూ విజయం సాధిస్తే.. ఐఐఎంల్లో ప్రవేశం ఖరారైనట్లే.

గ్రూప్ డిస్కషన్

మలి దశ ఎంపికకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో నిర్వహించే ప్రక్రియ.. గ్రూప్ డిస్కషన్. అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటుచేసి.. ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. కోర్ నుంచి కాంటెంపరరీ వరకు.. ఈ అంశాలు ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సమకాలీన అంశాలపైనా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత అభ్యర్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన మరో పరీక్ష.. రిటన్ ఎబిలిటీ టెస్ట్. ఇందులో నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశాన్ని పేర్కొని.. అభ్యర్థులు తమ అభిప్రాయాలు లేదా సలహాలు వ్యక్తీకరించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. ఈ అంశాలు కూడా.. సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన అభ్యర్థులు.. చివరిగా ఎదుర్కోవాల్సిన ప్రక్రియ.. పర్సనల్ ఇంటర్వ్యూ. ఈ ఇంటర్వ్యూలో.. సదరు విద్యార్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు ఎంచుకున్న మార్గాలు తదితర అంశాలను నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ అడిగి తెలుసుకుంటుంది.

వెయిటేజీ విధానం

- ఐఐఎంలలో ఆయా ప్రోగ్రామ్‌లలో అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసే క్రమంలో.. క్యాట్ స్కోర్, జీడీ, ఆర్‌ఏటీ, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభతోపాటు మరెన్నో అంశాలను ప్రామాణికంగా తీసుకుంటూ వాటికి కూడా నిర్దిష్ట వెయిటేజీ ఇస్తున్నారు.
- మొత్తం వంద మార్కుల వెయిటేజీ విధానంలో 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ కల్పిస్తున్నారు.
- డైవర్సిటీ వెయిటేజీ పేరుతో జండర్ డైవర్సిటీ, కల్చరల్ డైవర్సిటీలకు మూడు నుంచి అయిదు శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి.
- పలు ఐఐఎంలు అకడమిక్ వెయిటేజీ నిబంధన కూడా అమలు చేస్తున్నాయి.
- పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు ఒక్కో దానికి ప్రత్యేకంగా వెయిటేజీ ఉంటోంది. అకడమిక్ వెయిటేజీలోనే ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్న వారికి ప్రత్యేక వెయిటేజీని ఐఐఎంలు కల్పిస్తున్నాయి. ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతం మధ్యలో ఉంటోంది.
- వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న అభ్యర్థులకు అయిదు నుంచి పది శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ కూడా అభ్యర్థులు పని చేస్తున్న రంగం, మొత్తం అనుభవం గడించిన సంవత్సరాల ఆధారంగా ఉంటోంది.
- ఐఐఎంలలో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అకడమిక్ డైవర్సిటీకి కూడా పెద్ద పీట వేస్తున్నారు.

జెండర్ వెయిటేజీ

జెండర్ వెయిటేజీ..ఐఐఎంలు అనుసరిస్తున్న మరో వినూత్న విధానం. మేనేజ్‌మెంట్ విద్యలో మహిళా విద్యార్థులు చేరేలా ప్రోత్సహించేందుకు ఈ జెండర్ డైవర్సిటీ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

- ఐఐఎం కోల్‌కత జెండర్ డైవర్సిటీ వెయిటేజీ పేరుతో మహిళా విద్యార్థులకు అదనంగా మూడు మార్కులు కేటాయిస్తోంది.
- ఐఐఎం లక్నో విద్యార్థినులకు రెండు పాయింట్లు కేటాయిస్తోంది.
- ఐఐఎం రోహ్‌తక్ జెండర్ డైవర్సిటీ, నాన్-ఇంజనీరింగ్ ఫ్యాక్టర్స్ పేరుతో మొత్తం ఎంపిక ప్రక్రియలో 30పాయింట్లు కేటాయిస్తుండటం విశేషం.
- ఐఐఎం రాయ్‌పూర్ 20 శాతం వెయిటేజీని జండర్ డైవర్సిటీకి కేటాయిస్తోంది.
- ఐఐఎం–ఉదయ్‌పూర్ 15పాయింట్లు; ఐఐఎం–కాశీపూర్ 3 పాయింట్లు కేటాయిస్తున్నాయి.

'క్యాట్'కు గరిష్టంగా 40 శాతం

తుది జాబితా రూపకల్పనతో క్యాట్ స్కోర్‌కు లభిస్తున్న వెయిటేజీ 40 శాతంగా ఉంటోంది. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు 40 నుంచి 50 శాతం వెయిటేజీని ఐఐఎంలు ఇస్తున్నాయి. ప్రొఫైల్, పని అనుభవం తదితర అంశాలకు దాదాపు 20 శాతం మేరకు వెయిటేజీ లభిస్తోంది. క్యాట్ స్కోర్‌లో అధిక శాతం వెయిటేజీ సొంతం చేసుకోవాలన్నా.. వెయిటేజీ గణనలో తమ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలన్నా.. అభ్యర్థులు సదరు ఐఐఎంలు పేర్కొన్న విధంగా క్యాట్‌లో సెక్షనల్ కటాఫ్‌లు, మొత్తం కటాఫ్‌ల పరంగా కనీస కటాఫ్ మార్కులు పొందాల్సి ఉంటుంది.

దాదాపు 12 వేల సీట్లు

ఐఐఎం క్యాంపస్‌లలో పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ మొదలు..ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ వరకు అన్ని కోర్సులకు కలిపి దాదాపు 12 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో, క్యాట్ ఉత్తీర్ణతతో సీటు లభించే పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ సీట్ల సంఖ్య అయిదు వేల వరకు ఉంటోంది.

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి



సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సమర్థిస్తూ 50 శాతం గరిష్ట పరిమితి తొలగించిన కారణంగా జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి పెంచాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతం పెంచాలని, చట్టసభల్లోను బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, భూపేష్ సాగర్, మోక్షిత్ మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. ఎస్సీ, ఎస్టీల జనాభా లెక్కలను కులాల వారీగా సేకరిస్తున్నప్పుడు బీసీ జనాభా లెక్కల సేకరణకు అభ్యంతరాలేమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి ప్రత్యేక బీసీ చట్టాన్ని తీసుకురావాలనిఆయన డిమాండ్ చేశారు.

శివలింగం తరలింపుపై పీఠాధిపతుల్ని సంప్రదించండి

దేవదాయ శాఖ కమిషనర్, నంద్యాల కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా అయ్యలూరు గ్రామంలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో ఆ క్షేత్రంలోని శివలింగాన్ని మరో చోటుకు మార్చి పునర్నిర్మాణం పూర్తయిన తరువాత దానిని తిరిగి ప్రతిష్ఠించే విషయంలో పీఠాధిపతులు, నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్, నంద్యాల జిల్లా కలెక్టర్‌లను హైకోర్టు ఆదేశించింది. దేవదాయ శాఖ స్థపతి, కంచి పీఠాధిపతి, శారదా పీఠాధిపతి స్వరూపానంద తదితరుల నుంచి అభిప్రాయాలు, సలహాలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన న్యాయవాది బైరెడ్డి సాయిఈశ్వరరెడ్డి పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ జరిపారు.

కొల్లేరులో వలస పక్షుల సందడి

- కొల్లేరులో ఎటుచూసినా విదేశీ పక్షులే
- లక్షలాది కిలోమీటర్ల నుంచి అరుదైన పక్షుల రాక



కొల్లేరు అభయారణ్యంలో పక్షుల కేరింతలు

కైకలూరు: కిక్కిస పొదలు.. అందమైన జలదారుల నడుమ ప్రకృతి పంపిన రాయబారులు రాజహంసల్లా సందడి చేస్తున్నాయి. వలస పక్షులతో కొల్లేరు కళకళలాడుతోంది. శీతాకాలం విడిది కోసం సైబీరియా, నైజీరియా, రష్యా, టర్కీ, యూరప్ దేశాల నుంచి వలస పక్షులు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నడుమ విస్తరించిన కొల్లేరు ప్రాంతానికి చేరుకున్నాయి. అందరికీ విదేశీ పక్షులుగానే కనిపించే.. ఈ విహంగాలు కొల్లేరు ప్రాంత వాసులకు మాత్రం ఇంటి ఆడపడుచులుగా ఏటా ఇక్కడకు విచ్చేస్తాయి.

6 లక్షల పక్షుల రాక

రాష్ట్రంలో కొల్లేరు అభయారణ్యం 77,185 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఏటా కొల్లేరుకు దాదాపు 6 లక్షల విదేశీ పక్షులు వలస వస్తున్నాయి. అక్టోబర్‌లో వలసబాట పట్టే ఈ విహంగాలు ఇక్కడే సంతానోత్పత్తి చేసుకుని మార్చిలో తిరిగి పయనమవుతాయి. కొల్లేరు అభయారణ్యంలో 190 జాతులకు చెందిన పక్షులు జీవనం సాగిస్తున్నాయి. ఏలూరు జిల్లా ఆటపాక పక్షుల విహార కేంద్రానికి పెలికాన్ పక్షులు వేలాదిగా రావడంతో దీనికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణం చేశారు. ఏలూరు రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నాలుగు వారాలుగా పక్షుల లెక్కింపు జరుగుతోంది. డిసెంబర్ రెండో వారానికి దాదాపు స్వదేశీ, విదేశీ పక్షులు 5 లక్షల 20 వేలను గుర్తించారు. ఏటా శీతాకాలంలో విదేశీ వలస పక్షులు 6 లక్షలు, స్వదేశీ పక్షులు 3.50 లక్షల వరకు గుర్తిస్తున్నామని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కొల్లేరు ప్రాంతంలో స్పాట్ బిల్డిన్ పెలికాన్, కామన్ శాండ్ పైపర్, బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్, గ్లోబీ ఐబీస్, పెయింటెడ్ స్టార్క్, రివర్ టర్న్, జకనా, లార్జ్ విజిటింగ్ డక్, ఓరియంటల్ డాటర్, కామన్ రెడ్ షంక్ వంటి 43 రకాల వలస పక్షులను ప్రస్తుతానికి అటవీ సిబ్బంది గుర్తించారు.

వలస పక్షుల సంఖ్య పెరుగుతోంది

ప్రకృతి అనుకూలించడంతో కొల్లేరుకు వచ్చే వలస పక్షుల సంఖ్య పెరుగుతోంది. ఏటా 6 లక్షల విదేశీ పక్షులు వలస వస్తుండగా.. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం పక్షుల గణన జరుగుతోంది. పక్షుల ఆవాసాల కోసం అటవీ శాఖ కృత్రిమ స్టాండ్లను ఏర్పాటు చేస్తోంది.

– ఎస్‌వీకే కుమార్,
ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ రేంజర్, ఏలూరు

కోర్టు ధిక్కార కేసులో.. టీటీడీ ఈఓకు జైలుశిక్ష

- నెలరోజుల శిక్ష, రూ.2వేల జరిమానా
- హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ మన్మథరావు తీర్పు
- సర్వీసు క్రమబద్ధీకరణ తీర్పుపై ధర్మాసనం స్టే
- సింగిల్ జడ్జి తీర్పుపై ధర్మాసనం ముందు ధర్మారెడ్డి అప్పీల్
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి హైకోర్టు నెలరోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో వారంపాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ నెల 27లోపు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ముందు లొంగిపోవాలని ధర్మారెడ్డిని ఆదేశించింది. అనంతరం ఆయన్ను జైలుకు పంపాలని రిజిస్ట్రార్‌కు స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు మంగళవారం తీర్పు వెలువరించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రోగ్రాం అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి 2011 జనవరిలో టీటీడీ నోటిఫికేషన్ జారీచేసింది. దీనిని రద్దు చేయడంతో పాటు ప్రోగ్రాం అసిస్టెంట్లుగా తమ సర్వీసులను క్రమబద్ధీకరించేలా టీటీడీ అధికారులను ఆదేశించాలని కోరుతూ కొమ్ము బాబు, రామావత్ స్వామి నాయక్, భూక్యా సేవ్లానాయక్‌లు 2011లో హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై ఈ ఏడాది ఏప్రిల్ 13న తుది విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు టీటీడీ నోటిఫికేషన్‌ను రద్దుచేశారు. అలాగే, పిటిషనర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలంటూ టీటీడీ అధికారులను ఆదేశిస్తూ తీర్పుచెప్పారు. కానీ, ఈ తీర్పుపై టీటీడీ అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలుచేశారు. ఈ నేపథ్యంలో.. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలంటూ ఇచ్చిన తీర్పును అధికారులు అమలుచేయడంలేదని కొమ్ము బాబు తదితరులు ఈ ఏడాది జూన్ 16న కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. టీటీడీ అధికారులు కౌంటర్ దాఖలు చేస్తూ, సర్వీసు క్రమబద్ధీకరించాలన్న ఉత్తర్వులపై ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశామని, అందువల్ల ఆ ఉత్తర్వులను అమలుచేయలేకపోయామని చెప్పారు. అయితే, ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. అప్పీల్ పేరుతో టీటీడీ అధికారులు ఆరు నెలల గడువు తీసుకున్నారని.. కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారన్నారు. ఒకవేళ తమ ఉత్తర్వుల అమలుకు మరింత గడువు కావాలనుకుని ఉంటే, ఆ విషయంలో కోర్టు నుంచి అనుమతి తీసుకుని ఉండొచ్చునన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనకు ధర్మారెడ్డిని బాధ్యుడిగా చేస్తూ అతనికి నెలరోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

జస్టిస్ మన్మథరావు ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

మరోవైపు.. సర్వీసు క్రమబద్ధీకరణపై ఈ ఏడాది ఏప్రిల్ 13న జస్టిస్ మన్మథరావు ఇచ్చిన తీర్పుపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం మంగళవారం స్టే విధించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. లంచ్‌మోషన్ రూపంలో టీటీడీ అధికారుల అప్పీల్‌ను మంగళవారం ధర్మాసనం అత్యవసర విచారణ జరిపింది. టీటీడీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్. సత్యనారాయణ ప్రసాద్ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధించింది. అలాగే, ఇదే కేసులో జైలుశిక్ష విధిస్తూ జస్టిస్ మన్మథరావు ఇచ్చిన తీర్పుపై ధర్మారెడ్డి ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన జస్టిస్ శేషసాయి ధర్మాసనం, విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

సమాచార కమిషనర్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే

సాక్షి, అమరావతి: హైకోర్టు పరిపాలనలో జోక్యం చేసుకునే రీతిలో రాష్ట్ర సమాచార కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులపై హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ఏకంగా కేసుకు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించడంపై విస్మయం వ్యక్తంచేసింది. ఇది ఖచ్చితంగా హైకోర్టు పాలనలో జోక్యం చేసుకోవడమేనని వ్యాఖ్యానించింది. అందువల్ల సమాచార కమిషనర్ ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)లో దాఖలైన ఓ కేసుకు సంబంధించి ఏ శ్రీనివాసరావు అనే వ్యక్తి సమాచార కమిషన్ ముందు అప్పీల్ దాఖలుచేశారు. దీనిపై విచారణ జరిపిన సమాచార కమిషనర్.. దరఖాస్తుదారు కోరిన వివరాలు ఇవ్వడంతో పాటు ఆ కేసుకు నంబర్ కేటాయించాలని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, సమాచార అధికారి అయిన రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపి సమాచార కమిషనర్ ఆదేశాలపై స్టే విధించింది.

ఆ డబ్బు ఉపసంహరణకు అభ్యంతరంలేదు

- దానిని తీసుకున్న తరువాత ఐఐపీఈ నిర్మాణానికి ఆటంకాలు కల్గించకూడదు
- హైకోర్టులో మెమో దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విచారణ రేపటికి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖపట్నం జిల్లా, సబ్బవరం మండలం, వంగలి గ్రామ పరిధిలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ నిర్మాణ భూ సేకరణ కోసం హైకోర్టులో జమచేసిన రూ.2.98 కోట్లను 29 మంది పిటిషనర్లు ఉపసంహరించుకునేందుకు తమకెలాంటి అభ్యంతరంలేదని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. ఈ మేరకు హైకోర్టులో ఓ మెమో దాఖలు చేసింది. ఈ సొమ్మును తీసుకున్న తరువాత ఐఐపీఈ క్యాంపస్ నిర్మాణ పనులకు పిటిషనర్లు ఏ రకమైన ఆటంకాలు కలిగించరాదని అందులో స్పష్టంచేసింది. దీంతో ఈ మెమోపై స్పందించాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తెల్లాప్రగఢ మల్లికార్జునరావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.